




www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM

NAVABHOOMI TELUGU DAILY — నవతరం తెలుగు దినపత్రిక








Published from Hyderabad and Vijayawada

ఎడిటర్ : అజీద్

హైదరాబాద్ | 30 శుక్రవారం | మే 2025 | పేజీలు 12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 255

Navabhoomi daily fallows..

Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur


# ఉత్తమ నటుడిగా అల్లు అర్జున్

- బెస్ట్ ఫిల్మ్‌గా 'కల్కి 2898 ఏడీ'
- రెండో, మూడో ఉత్తమ చిత్రాలుగా 'పొట్టేలు', 'లక్కీ భాస్కర్'
- గద్దర్ అవార్డుల ప్రకటించిన జ్యూరీ ఛైర్‌పర్సన్ జయసుధ
- ఉత్తమ నటిగా నివేదా థామస్,దర్శకుడిగా నాగ్ అశ్విన్

2



హైదరాబాద్-నవభూమిబ్యూరో

గద్దర్ ఫిల్మ్ అవార్డుల విజేతలను గురువారం జ్యూరీ ఛైర్‌పర్సన్ జయసుధ ప్రకటించారు. ఉత్తమ నటుడిగా 'పుష్ప 2' చిత్రానికి గానూ అల్లు అర్జున్, ఉత్తమ నటిగా నివేదా థామస్ (35 ఇది చిన్న కథకాదు), ఉత్తమ దర్శకుడిగా నాగ్ అశ్విన్?(కల్కి) ఎంపికయ్యారు. ఉత్తమ చిత్రంగా 'కల్కి 2998ఏడీ' ఎంపిక అయ్యింది. రెండో, మూడో ఉత్తమ చిత్రాలుగా 'పొట్టేలు', 'లక్కీ భాస్కర్' ఎంపికయ్యాయి.

**2024 బెస్ట్ సినిమాలు ఇవే**

మొదటి ఉత్తమ ఫీచర్ చిత్రం: కల్కి 2898ఏడీ
రెండో ఉత్తమ ఫీచర్ చిత్రం: పొట్టేల్
మూడో ఉత్తమ ఫీచర్ చిత్రం: లక్కీ భాస్కర్
ఉత్తమ బాలల చిత్రం: 35 ఇది చిన్న కథ కాదు
హిస్టరీ విభాగంలో ఫీచర్ హెరిటేజ్ చిత్రం: రజాకార్
ఉత్తమ ప్రజాదరణ చిత్రం: ఆయ్
ఉత్తమ పరిచయ దర్శకుడు: యధువంశీ (కమిటీ కుర్రాళ్లు)

**వ్యక్తిగత విభాగాల్లో!**

ఉత్తమ దర్శకుడు: నాగ్ అశ్విన్ (కల్కి)
ఉత్తమ నటుడు: అల్లు అర్జున్ (పుష్ప 2)
ఉత్తమ నటి: నివేదా థామస్ (35 ఇది చిన్న కథ కాదు)
ఉత్తమ సహాయ నటుడు: ఎస్‌జే సూర్య (సరిపోదా శనివారం)
ఉత్తమ సహాయ నటి: శరణ్యా ప్రదీప్ (అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్)
ఉత్తమ గేయ రచయిత: చంద్రబోస్ (రాజు యాదవ్)
ఉత్తమ సంగీత దర్శకుడు: భీమ్స్ (రజాకార్)
ఉత్తమ నేపథ్య గాయకుడు: సిద్ శ్రీరామ్ (ఊరి పేరు భైరవకోన)
ఉత్తమ నేపథ్య గాయని: శ్రేయా ఘోషల్ (పుష్ప 2- సూసేకి అగ్గిరవ్వ)
ఉత్తమ హాస్యనటుడు: సత్య, వెన్నెల కిశోర్ (మత్తువదలరా 2)
ఉత్తమ బాలనటుడు: మాస్టర్ అరుణ్ దేవ్ పోతుల (35 ఇది చిన్న కథ కాదు), బేబీ హారిక (మెర్సీ కిల్లింగ్)
ఉత్తమ కథా రచయిత: శివ పాలడుగు (మ్యూజిక్ షాప్ మూర్తి)

# నన్నూ కేసీఆర్‌నూ విడదీసే కుట్ర

- బీజేపీకి బీఆర్ఎస్‌ను గంపగుత్తుగా ఇచ్చేందుకు ప్లాన్
- తండ్రిని,కుటుంబాన్ని విడిచి ఎలా వెళ్తా..
- కొత్త పార్టీ ఎందుకు..ఉన్న పార్టీని చూస్తే చాలు
- కేసీఆర్ మాత్రమే నాయకుడు, హీరో
- కేసీఆర్ మళ్లీ సీఎం అవుతారు..డౌట్ లేదు

2



హైదరాబాద్-నవభూమిబ్యూరో

బీఆర్ఎస్ పార్టీ, నాయకులపై కేసీఆర్ కుమార్తె, ఆ పార్టీ ఎమ్మెల్సీ కవిత తీవ్ర విమర్శలు చేశారు. తాను అంతర్గతంగా ఇచ్చిన ఫీడ్‌బ్యాక్ ఎలా లీకైందని ప్రశ్నించారు. కట్టడి చేయమంటే పెయిడ్ సోషల్ మీడియాలో విమర్శిస్తున్నారని మండిపడ్డారు. ఈ మేరకు మీడియా చిట్‌చాట్‌లో సంచలన వ్యాఖ్యలు చేశారు.

మమ్మల్ని విడదీసే కుట్ర జరుగుతోంది : తనను, కేసీఆర్‌ను విడదీసే కుట్ర చేస్తున్నారని కవిత ఆరోపించారు. తన తండ్రిని, తన కుటుంబాన్ని వదిలి ఎందుకు వెళ్తానని? ప్రశ్నించారు. తనను దూరం చేస్తే ఎవరికి లాభం జరుగుతుందో ఆలోచించుకోవాలన్నారు. తాను ఎవరి నాయకత్వం కింద పనిచేయనని, కేసీఆర్ మాత్రమే తన నాయకుడని చెప్పారు. దామోదర్ రావు, గండ్ర మోహన్‌రావును ఎవరు పంపారో తనకు తెలియదని, వాళ్లు ఎవరికి దగ్గరో తెలుసుకదా అన్ని అన్నారు. కొత్త పార్టీ ఎందుకు? ఉన్న పార్టీని బాగా చూసుకుంటే చాలన్న ఆమె, ఎంతోమంది నేతలు వస్తుంటారని, తనకు కేసీఆర్ మాత్రమే నాయకుడని, హీరో అని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ తన పార్టీ అని, పార్టీ కోసం గట్టిగా పోరాడతానన్నారు. కేసీఆర్ మళ్లీ సీఎం అవుతారు, అందులో ఎలాంటి అనుమానం లేదని ధీమా వ్యక్తం చేశారు.

# మీ రుణం తీర్చుకుంటా

- మహానాడు గ్రాండ్ సక్సెస్..: సీఎం చంద్రబాబు
- కడప టీడీపీ అడ్డా అని నిరూపించేందుకే మహానాడు ఇక్కడ పెట్టాం
- అహంకారంతో విర్రవీగే వారికి ఎన్నికల్లో కడప జిల్లా ప్రజలు అద్భుతమైన తీర్పునిచ్చారు
- వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కడపలో పదికి పది సీట్లు గెలుస్తాం

2



**కడప-నవభూమిబ్యూరో:** కడప మహానాడు గ్రాండ్ సక్సెస్ అయ్యిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. కడప టీడీపీ మహానాడు బహిరంగ సభలో సీఎం ప్రసంగించారు. ఈ సందర్భంగా జై తెలుగుదేశం అని కార్యకర్తలతో చెప్పించారు ముఖ్యమంత్రి. రాయలసీమ గర్జన రాష్ట్రం అంతా మారుమ్రోగాలన్నారు. జనసంద్రంగా కడప నిండిపోయిందన్నారు. ఎన్నోసార్లు కడపకు వచ్చానని.. ఇంత పెద్ద సంఖ్యలో ప్రజలు టీడీపీ మహానాడుకు రావడం చూసి కొండంత ధైర్యం వచ్చిందన్నారు. కడపలో మహానాడు పెడితే చాలామంది అనుమానించారని సీఎం తెలిపారు.

**పదికి పది గెలుస్తాం**

కానీ కడప టీడీపీ అడ్డా అని నిరూపించేందుకే మహానాడు ఇక్కడ పెట్టామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక మొదటి మహానాడు దేవునిగడపలో జరిగిందని.. రెస్పాన్స్ అదిరిందన్నారు. మహానాడు సూపర్ హిట్ అయ్యిందని అన్నారు. కడప రాజకీయం మారబోతోందని.. కడప గడపలో మార్పు కనిపిస్తుందని గత ఎన్నికల ప్రచారంలో చెప్పానన్నారు. అహంకారంతో విర్రవీగే వారికి ఎన్నికల్లో కడప జిల్లా ప్రజలు అద్భుతమైన తీర్పునిచ్చారని కొనియాడారు. ఈ ఎన్నికల్లో కడపతో పాటు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో అద్భుతమైన విజయం సాధించామన్నారు. ఉమ్మడి కడపలో పదికి ఏడు స్థానాలు గెలిచామని చెప్పుకొచ్చారు. ఇప్పటి నుంచి కష్టపడితే 2029 ఎన్నికల్లో పదికి పదికి స్థానాలు గెలుచుకుంటామని ముఖ్యమంత్రి ధీమా వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో రాయలసీమ ప్రజలు అద్భుతమైన తీర్పు ఇచ్చారని, 52 సీట్లకు 45 సీట్లతో కూటమిని గెలిపించారన్నారు. వైసీపీకి రాయలసీమలో ఏడు సీట్లు వస్తే టీడీపీ కూటమికి ఒక్క ఉమ్మడి కడప జిల్లాలోనే ఏడు సీట్లతో గెలిపించారన్నారు. ఈ తీర్పును మనం అర్థం చేసుకున్నామని.. కానీ ఓడిపోయిన పార్టీ ఇంకా అర్థం చేసుకోలేదని మండిపడ్డారు. టీడీపీ అధికారం కోసం పుట్టిన పార్టీ కాదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

**అలాంటి వారు ఉండటం పార్టీకి అదృష్టం**

అవమానాలు, అక్రమ కేసులు, నిర్బంధాలు అన్నింటినీ ఎదుర్కొన్నారని.. ప్రభుత్వం అధికారంలోకి

# కేబినెట్ ప్రక్షాళన!

- త్వరలో మంత్రివర్గ విస్తరణ..అధిష్టానం ఆమోదం
- కేబినెట్ ప్రక్షాళన..మంత్రులకు శాఖల మార్పు
- పనితీరు బాగాలేని మంత్రులకు ఉద్వాసన?
- కొత్త మంత్రులకు కీలకమైన శాఖలు
- మంత్రులకు విందు ఇచ్చిన సీఎం రేవంత్

2



హైదరాబాద్-నవభూమిబ్యూరో

తెలంగాణ రాజకీయాలు ఆసక్తి కరంగా మారుతున్నాయి. తెలంగాణ మంత్రివర్గ విస్తరణకు దాదాపు ముహూర్తం ఖరారైంది. రాష్ట్రంలో రాజకీయంగా పూర్తి పట్టు సాధించటానికి ప్రస్తుత పరిణామాలు తమకు సహకరిస్తాయని కాంగ్రెస్ నాయకత్వం భావిస్తోంది. మరో సారి సీఎం రేవంత్.. టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ఢిల్లీ పర్యటనకు వెళ్తున్నారు. ఇదే సమయంలో మంత్రులకు సీఎం రేవంత్ ఇచ్చిన విందు అర్ధరాత్రి వరకు కొనసాగింది. అనేక కీలక అంశాలు ఈ విందు సమావేశంలో చర్చకు రాగా.. ముఖ్యమంత్రి రేవంత్ మంత్రులకు భవిష్యత్ కార్యాచరణపై దిశా నిర్దేశం చేసారు. రేవంత్ దిశా నిర్దేశం మంత్రివర్గ సహచరులకు సీఎం రేవంత్ విందు ఇచ్చారు. బుధవారం అర్ధరాత్రి వరకు ఈ భేటీ కొనసాగింది. పీసీసీ, మంత్రివర్గ విస్తరణ, కవిత తదితర అంశాలపై చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. కాగా, జిల్లాల ఇంఛార్జ్ మంత్రులు గురువారం నుంచి జిల్లాల పర్యటనకు వెళ్తున్న సమయంలో రేవంత్ ఈ విందు సమావేశం ఏర్పాటు చేసారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించే కొత్త పథకాలు, తీసుకునే నిర్ణయాలతో పాటు ప్రస్తుత పథకాల అమలు విషయంలో ఒకే మాట, అభిప్రాయంపై ఉందామని మంత్రులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. విందులో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ కూడా పాల్గొన్నారు. పలు కారణాలతో మంత్రి సీతక్క హాజరు కాలేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన గత ఏడాదిన్నర కాలంలో.. మంత్రులకు సీఎం విందు ఇవ్వడం ఇదే తొలి సారి. రాజకీయ చర్చ కొత్త పథకాల రూపకల్పన, ప్రస్తుత పథకాలు, జూన్ 2న ప్రారంభించబోయే రాజీవ్ యువ వికాసం పథకం పైనా సీఎం, మంత్రులు లోతుగా చర్చించారు. పథకా

## జెత్వానీ కేసులో పీఎస్ఆర్‌కు బెయిల్

- సీనియర్ ఐపీఎస్ అధికారికి
- షరతులతో కూడిన బెయిల్
- బాలీవుడ్ నటి జెత్వానీ కేసులో
- రెండో నిందితుడిగా (ఏ2)గా
- ఉన్న ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్




అమరావతి-నవభూమిబ్యూరో

నటి కాదంబరీ జెత్వానీ వేధింపుల కేసుకు సంబంధించిన వ్యవహారం గత నెలలో పీఎస్ఆర్ ఆంజనేయులును సీఐడీ పోలీసులు అరెస్ట్ చేసిన వైనం తెలిసిందే.ముంబైకి చెందిన సినీ నటి కాదంబరీ జెత్వానీని వేధించారన్న ఆరోపణలతో అరెస్టయిన సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులుకు ఊరట లభించింది. ఈ కేసులో ఆయనకు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు పలు షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేసింది.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నటి కాదంబరీ జెత్వానీపై కక్షపూరితంగా తప్పుడు కేసు నమోదు చేయించి, చట్టవిరుద్ధంగా అరెస్టు చేసి, మానసికంగా వేధించారనేది ప్రధాన ఆరోపణ. ఈ వ్యవహారంలో పీఎస్ఆర్ ఆంజనేయులు రెండో నిందితుడిగా (ఏ2) ఉన్నారు. ఈ ఆరోపణల నేపథ్యంలో గత నెలలో రాష్ట్ర దర్యాప్తు సంస్థ (సీఐడీ) అధికారులు ఆయన్ను అదుపులోకి తీసుకుని విచారణ జరిపిన సంగతి తెలిసిందే.విచారణ అనంతరం పీఎస్ఆర్ ఆంజనేయులు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు. ఆయన అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న ఉన్నత న్యాయస్థానం, కొన్ని షరతులు విధిస్తూ బెయిల్ మంజూరు చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. కేసు తదుపరి విచారణ కొనసాగనుంది.

# ఇక అరెస్టే?

- జగన్ అరెస్టుకు ముహూర్తం ఫిక్స్..!
- సన్నిహితులతో సాయిరెడ్డి వెల్లడి?
- వచ్చే నెల 10లోపు అరెస్ట్ చేసే ఛాన్స్
- సాయిరెడ్డి లీక్‌తో వైసీపీలో కలవరం



అమరావతి-నవభూమిబ్యూరో

ఏపీ మద్యం కుంభకోణంపై కూటమి ప్రభుత్వం దూకుడు ప్రదర్శిస్తోంది. ఇప్పటికే ఈ స్కాంలో వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి, రాజ్ కెసిరెడ్డి, సజ్జల శ్రీధర్ రెడ్డితో పాటు రిటైర్డ్ ఐఏఎస్ ధనుంజయ్ రెడ్డి, జగన్ మాజీ ఓఎస్టీ కృష్ణమోహన్ రెడ్డి, భారతీ సిమెంట్స్ డైరెక్టర్ బాలాజీ గోవిందప్పను నిందితులుగా చేర్చి, వీరిలో కొందరని అరెస్టు చేసి జైలుకు కూడా పంపారు. ఈ నేపథ్యంలో ఇక తదుపరి అరెస్టు మాజీ సీఎం వైఎస్ జగన్ దేనన్న ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. దీనిపై ఈ మధ్యే జగన్ కూడా స్పందించారు. అరెస్టుకు భయపడేది లేదని, తాను విజయవాడలోనే ఉన్నానని జగన్ ఇప్పటికే చెప్పేశారు. ఈ నేపథ్యంలో సీఐడీ వేగంగా పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు జగన్‌ను అరెస్టు చేసేందుకు పక్కా ప్రణాళిక సిద్ధం చేస్తోంది. దీనిపై వైసీపీ మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి తన సన్నిహితులకు ఇప్పటికే కీలక సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ మధ్యే తిరుపతి వెళ్లిన విజయసాయిరెడ్డి లిక్కర్ స్కాంలో జగన్ ఎప్పుడు అరెస్టు అవుతారో వారికి వెల్లడించినట్లు సమాచారం. విజయసాయిరెడ్డి తన సన్నిహితులతో పంచుకున్న సమాచారం ప్రకారం లిక్కర్ స్కాంలో వైఎస్ జగన్‌ను సీఐడీ వచ్చే నెల 10వ తేదీ లోపు అరెస్టు చేసే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు ప్రభుత్వం పావులు కదుపుతోందని తెలుస్తోంది. అయితే సాయిరెడ్డి బహిరంగంగా ఏమీ మాట్లాడలేదు. తనను కెలకొద్దని మాత్రం ఇప్పటికే వైసీపీలో జగన్ కోటరీగా ఆరోపిస్తున్న వారికి

## ప్రభాకర్‌రావుకు సుప్రీంకోర్టులో స్వల్ప ఊరట

- తాత్కాలిక ముందస్తు బెయిల్ మంజూరు చేసిన ధర్మాసనం
- మూడు రోజుల్లో భారత్‌కు వచ్చి విచారణకు హాజరుకావాలని ఆదేశం
- దర్యాప్తునకు పూర్తిగా సహకరించాలని ప్రభాకర్ రావుకు సూచన



హైదరాబాద్-నవభూమిబ్యూరో

తెలంగాణలో తీవ్ర సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐపీఎస్ అధికారి, రాష్ట్ర ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) మాజీ చీఫ్ టి. ప్రభాకర్ రావుకు సుప్రీంకోర్టులో ఈరోజు స్వల్ప ఊరట లభించింది. ఈ కేసులో ఏ1 నిందితుడిగా ఉన్న ఆయన దాఖలు చేసుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం, ఆయనకు తాత్కాలికంగా ముందస్తు బెయిల్ మంజూరు చేసింది.

జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ సతీష్ చంద్ర శర్మలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. మూడు రోజుల్లోగా ప్రభాకర్ రావు భారతదేశానికి తిరిగి రావాలని, ఇక్కడికి వచ్చిన తర్వాత దర్యాప్తునకు సంపూర్ణంగా సహకరించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అంతేకాకుండా, ప్రభాకర్ రావు భారత్ తిరిగి వచ్చేందుకు వీలుగా ఆయన పాస్‌పోర్ట్‌ను కూడా మంజూరు చేయాలని ఆదేశించింది. ప్రస్తుతం ఆయనపై ఎలాంటి కఠినమైన చర్యలు చేపట్టవద్దని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. మూడు రోజుల్లో ఇండియాకు రావాలని ప్రభాకర్ రావును ఆదేశించింది.

## ఉమ్మడి వరంగల్ కలెక్టర్ల పనితీరుపై మంత్రి పొంగులేటి అసంతృప్తి

- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ అనుమతుల్లో నిర్లక్ష్యం తగదన్న మంత్రి
- జూన్ 6 నాటికి లబ్ధిదారుల జాబితా, ప్రొసీడింగ్స్ కాపీలు సిద్ధం చేయాలని ఆదేశం
- నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచన

2



వరంగల్-నవభూమిబ్యూరో

ఉమ్మడి వరంగల్ జిల్లా కలెక్టర్ల పనితీరుపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా ప్రజలకు అత్యంత కీలకమైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన అనుమతుల మంజూరు ప్రక్రియలో నిర్లక్ష్యం తగదని అన్నారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను వేగవంతం చేయాలని, జూన్ 6వ తేదీలోగా అర్హులైన వారి పూర్తి జాబితాను తయారు చేయాలని ఆయన గడువు విధించారు. కేవలం జాబితా మాత్రమే కాకుండా, సంబంధిత ప్రొసీడింగ్స్ కాపీలను కూడా జతచేసి అందించాలని మంత్రి పొంగులేటి ఆదేశించారు. అదేవిధంగా, వ్యవసాయ సీజన్ సమీపిస్తున్న తరుణంలో రైతులను తీవ్రంగా నష్టపరిచే నకిలీ విత్తనాలు, నకిలీ ఎరువుల బెడదపై కూడా మంత్రి దృష్టి సారించారు. ఎవరైనా నకిలీ విత్తనాలు లేదా ఎరువులు విక్రయిస్తే వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని అధికారుల ను ఆదేశించారు. ఈ నకిలీ దందాను సమర్థవంతం గా అరికట్టేందుకు పోలీస్ శాఖ, వ్యవసాయ శాఖ అధికారులు పూర్తి సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు.

# వంశీకి ఊరట!

- అక్రమ మైనింగ్ కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ వంశీ పిటిషన్
- విచారించిన హైకోర్టు బెయిల్ మంజూరు
- వంశీకి మెరుగైన చికిత్స అందించాలని హైకోర్టు ఆదేశం
- వంశీకి ఎక్కడ వైద్యం చేయిస్తారో తేల్చాలన్న హైకోర్టు

2



అమరావతి-నవభూమిబ్యూరో

వల్లభనేని వంశీకి హైకోర్టులో రిలీఫ్ దక్కింది. ఉమ్మడి కృష్ణాజిల్లా పరిధిలో అక్రమ మైనింగ్ కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేసిన హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. అదే విధంగా వంశీ తనకు మెరుగైన చికిత్స కోసం ప్రయివేటు ఆస్పత్రికి వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ ఆస్పత్రిలో సరైన సౌకర్యాలు లేవని కోర్టుకు నివేదించారు. దీంతో, వంశీకి మెరుగైన చికిత్స అందించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. కృష్ణాజిల్లా పరిధిలో అక్రమ మైనింగ్ కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిగింది. గతంలోనే ఈ పిటీషన్ పైన విచారణ చేసిన న్యాయస్థానం ఈ రోజుకు వాయిదా వేసింది. పీటీ వారెంట్ అమలును నిలుపుదల చేస్తూ గతంలో ఇచ్చిన ఉత్తర్వులనూ ఈ రోజు వరకు పొడిగించింది. కాగా, ఈ రోజు విచారణ తరువాత వంశీకి ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ న్యాయస్థానం తీర్పు వెలువరించింది. ఈ కేసులో ముందస్తు బెయిల్ మంజూరు అయినా.. వంశీ బయటకు రాలేని పరిస్థితి ఉంది. ఇతర కేసుల్లో వంశీ రిమాండ్‌లో ఉన్నారు. బాపులపాడు నకిలీ ఇళ్ల పట్టాల కేసులో వంశీ పోలీసు కస్టడీ ఎదుర్కొన్నారు. కాగా, వంశీకి చికిత్స విషయంలోనూ కోర్టు కీలక ఆదేశాలు ఇచ్చింది. కొంత కాలంగా వంశీ అనారోగ్యంతో బాధ పడుతున్నారు. పలు మార్లు విజయవాడ ఆస్పత్రిలో వంశీ కి చికిత్స అందించారు. తాజాగా గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో వంశీకి చికిత్స చేసారు. అక్కడ పరీక్షలు నిర్వహించారు. న్యూరాలజీ, పల్మనాలజీ సమస్యలతో వంశీ బాధ పడుతున్నట్లు గుర్తించి మందులు ఇచ్చారు. కాగా, చేయాల్సిన పరీక్షల గురించి వైద్యులు వివరించారు. కాగా, హైకోర్టులో

**మావోయిస్టు కీలక నేత కుంజాం హిడ్మా అరెస్ట్** 4

**పీఓకే మనదే.. అక్కడి ప్రజలూ మనవాళ్లే**

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in



## పేద పిల్లలకు ఉచిత కంప్యూటర్ శిక్షణ



**అంబర్‌పేట-నవభూమి:**బాగ్‌అంబర్‌పేట శ్రీ షిర్డీ సాయిబాబా సంస్థాన్ ఆధ్వర్యంలో పేద పిల్లలకు ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నట్లు సంస్థాన్ ప్రతినిధులు తెలిపారు. గత మూడు దశాబ్దాలుగా సాయిబాబా దేవాలయంలో ఎన్నో సేవా కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహిస్తున్న సంస్థాన్ ప్రస్తుతం సామాజిక బాధ్యత కూడా నిర్వహించాలనే ఉద్దేశ్యతో కంప్యూటర్ శిక్షణను కూడా ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఆర్థికంగా వెనుకబడిన, ప్రత్యేక కారణాలతో చదువు కొనసాగించలేని పదో తరగతి పాస్/ఫెయిల్, ఇంటర్ పాస్/ఫెయిల్ అయిన వయోపరిమితి 18 సంవత్సరాల నుంచి 25 సంవత్సరాల లోపు ఉన్న వారికి ఈ శిక్షణ ఇస్తున్నామని వారు పేర్కొన్నారు. యువతీ, యువకులకు ప్రత్యేకంగా శిక్షణ బ్యాచ్‌లు ఉంటాయన్నారు. ఆసక్తి గలవారు బాగ్‌అంబర్‌పేటలోని శ్రీషిర్డీ సాయిబాబా సంస్థాన్‌లో గానీ ఫోన్ నెంబర్ 040-27424824, సెల్: 8374334546లో సంప్రదించాలని కోరారు.

## నవ వార్త




## వెటర్నరీ కోర్సుల్లో సెల్ఫ్ ఫైనాన్స్ సీట్ల పెంపు



**హైదరాబాద్-నవభూమి:**పీవీ నరసింహారావు తెలంగాణ పశు వైద్య విశ్వవిద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరం నుంచి బ్యాచిలర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్(బీవీఎస్సీ) డిగ్రీ కోర్సుల్లో సెల్ఫ్ ఫైనాన్స్ (ఎన్ఆర్ఐ) కోటా సీట్లను 15కు పెంచాలని పాలకమండలి నిర్ణయించింది. రాజేంద్రనగర్, కోరుట్లలో ఒక్కో దానిలో 5 సీట్ల చొప్పున 10 ఉన్నాయనీ, కొత్తగా వరంగల్ జిల్లా మాములూరు కళాశాలకు జాతీయ వైద్య మండలి విసిఐ గుర్తింపు లభించినందున దానిలోను ఐదు సీట్లను సెల్ఫ్ ఫైనాన్స్ కింద భర్తీ చేసేందుకు పాలకమండలి అనుమతి ఇచ్చిందని వీసీ జ్ఞాన ప్రకాశ్ ఒక ప్రకటనలో తెలిపారు.

## 11న హౌసింగ్ బోర్డు స్థలాల వేలం..

### నివాస స్థలం చదరపు గజం 1.25 లక్షలు



**హైదరాబాద్-నవభూమి:** కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీ ఫేస్-7 పరిధిలో 4 నివాస, 15 వాణిజ్య ప్లాట్లకు వచ్చే నెల 11న బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు. నివాస ప్లాట్ల ధర చదరపు గజానికి రూ.1.25 లక్షలుగా, వాణిజ్య ప్లాట్ల ధర రూ.1.50 లక్షలుగా నిర్ణయించారు. నివాస ప్లాట్ల వైశాల్యం కనిష్ఠంగా 194 గజాలు, వాణిజ్య ప్లాట్ల వైశాల్యం 800 నుంచి 920 గజాల వరకు ఉంది. హౌసింగ్ బోర్డుకు హైదరాబాద్‌తోపాటు చుట్టుపక్కల ప్రాంతా ల్లో 4609 ఎకరాలు ఉండగా, అందులో 3820 ఎకరాల్లో ఇదివరకే కాలనీలు నిర్మించారు.

మిగిలిన 789 ఎకరాల్లో 80 ఎకరాలపై కోర్టులో కేసులు ఉండగా, 610 ఎకరాలు క్లియర్‌గా ఉన్నాయి. 150 ఎకరాల భూమిని లీజుకు ఇచ్చారు. 100 ఎకరాలు జేఎన్‌టీయూకు ఇవ్వగా, మిగిలినవి వివిధ సంస్థలు, వ్యక్తులకు ఇచ్చారు. నిధుల సమీకరణలో నిమగ్నమైన సర్కారు దృష్టి ఈ ఆస్తులపై పడింది. ఆస్తుల స్థితి తదితర వివరాలతో కూడిన నివేదికను అధికారులు ప్రభుత్వానికి అందించారు. నిధుల సమీకరణలో భాగంగా ప్రభుత్వం ఈ భూములను విక్రయించాలని నిర్ణయించింది.

ఎవరో ఆ ప్రపంచ సుందరి! ప్రపంచ సుందరీ పోటీల తుది ఘట్టం దగ్గరపడింది. ఎల్లుండి హైటెక్స్‌లో గ్రాండ్ ఫినాలే జరగనున్నది. ఆ వేదికపై ప్రపంచ సుందరి కిరీటం ఎవరిని వరించనుందో తేలిపోతుంది. 109 మంది అందాలభామలు ప్రపంచ సుందరీ కిరీటం కోసం తలపడగా, తుది పోటీలకు 40 మంది కంటెస్టెంట్లు ఎంపికయ్యారు.

## ఎవరో ఆ ప్రపంచ సుందరి!



**హైదరాబాద్-నవభూమి:**ప్రపంచ సుందరీ పోటీల తుది ఘట్టం దగ్గరపడింది. ఎల్లుండి హైటెక్స్‌లో గ్రాండ్ ఫినాలే జరగనున్నది. ఆ వేదికపై ప్రపంచ సుందరి కిరీటం ఎవరిని వరించనుందో తేలిపోతుంది. 109 మంది అందాలభామలు ప్రపంచ సుందరీ కిరీటం కోసం తలపడగా, తుది పోటీలకు 40 మంది కంటెస్టెంట్లు ఎంపికయ్యారు.గ్రాండ్ ఫినాలేలోని ఒక్కో దశలో కొందరిని ఎలిమినేట్ చేస్తూపోయి, తుదివరకు నిలిచిన ముగ్గురిని ఫస్ట్, సెకండ్, థర్డ్ విజేతలుగా ప్రకటిస్తారు. హైటెక్స్‌లోని 31న జరగనున్న గ్రాండ్ ఫినాలేకు సుమారు 4 వేల మంది అతిథులు హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నామని అధికారులు తెలిపారు. మిస్ ఇండియా నందిని గుప్తా మిస్ వరల్డ్ గ్రాండ్ ఫినాలే పోటీలో ఉండటంతో అభిమానులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు.

## బీఆర్ఎస్‌పై రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్-నవభూమి:** బీఆర్ఎస్‌పై బీజేపీ ఎమ్మెల్యే రాజా సింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బీజేపీలో బీఆర్ఎస్ విలీనంపై ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలు నిజమే అని అనుకుంటున్నాని అన్నారు. పెద్ద ప్యాకేజీ దొరికితే తమ వాళ్లు (బీజేపీ) కూడా ఎప్పుడో బీజేపీని బీఆర్ఎస్‌లో కలిపేసేవారంటూ సెన్సేషనల్ కామెంట్స్ చేశారు. ఒకవేళ బీజేపీ, బీఆర్ఎస్ కలిసిపోతే వచ్చే ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి పోటీ చేయాలని అనుకుంటే ఎక్కడి నుంచి నిలబడాలి అనేది కూడా బీఆర్ఎస్ వాళ్లే డిసైడ్ చేస్తారన్నారు. గతంలో కూడా ఇదే జరిగిందని అందుకే బీజేపీ నష్టపోయిందని అన్నారు. ఎప్పుడో బీజేపీ ప్రభుత్వం రావాల్సి ఉందని.. కానీ బీజేపీ ప్రభుత్వం ఎందుకు రాలేదో ఒకసారి ఆలోచన చేయాలన్నారు.ప్రతీ ఎన్నికల్లో తమ పార్టీ నేతలు కుమ్మక్కయ్యారని ఆరోపించారు. దీని వల్ల బీజేపీ చాలా నష్టపోయిందంటూ వ్యాఖ్యలు చేశారు. ప్రతి ఒక్క భారతీయ జనతా పార్టీ కార్యకర్తలకు ఈ విషయం తెలుసని.. అయినా ఎవరూ బయటపడరన్నారు. ఈ విషయాన్ని పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకువెళ్తే సస్పెండ్ చేస్తారనే భయంతో కార్యకర్తలు, అధికారులు నోరు మూసుకుని కూర్చున్నారంటూ ఎమ్మెల్యే రాజాసింగ్ తీవ్ర స్థాయిలో వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు రాజాసింగ్ ఓ లేఖను విడుదల చేశారు.అయితే సొంత పార్టీపై విమర్శలు చేయడం రాజాసింగ్‌కు కొత్తేమీ కాదు. గతంలో కూడా బీజేపీపై పలు విమర్శలు చేశారు. పదేళ్ల పాటు బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో పూర్తి స్థాయిలో అధికారపార్టీకి తొత్తులుగా మారేందుకు బీజేపీ రాష్ట్ర నాయకత్వం ప్రయత్నం చేసిందని ఆరోపించారు. అధికారంలో ఎవరు ఉంటే వారితో చేతులు కలుపుతూ వారికి వంత పాడటం అనేది బీజేపీ రాష్ట్ర నాయకుల్లో కొంత మందికి అలావాటు అయ్యిందని, పాత స్క్రాబ్‌ను తీసివేస్తే తప్ప పరిష్కారం లభించదంటూ గతంలో కూడా రాజాసింగ్ హాట్ కామెంట్స్ చేసిన విషయం తెలిసిందే.ఇప్పుడు తాజాగా ఈరోజు(గురువారం) బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో బీఆర్ఎస్ పార్టీ బీజేపీలో విలీనం కాబోతోందంటూ కామెంట్స్ చేశారు. దీనిపై మాట్లాడిన రాజాసింగ్.. కవిత వ్యాఖ్యలకు మద్దతు ఇచ్చారు. కవిత వ్యాఖ్యలు నిజమే అని భావిస్తూ ఎమ్మెల్యే ఓ లేఖను విడుదల చేశారు. అయితే కవితకు సంబంధించి విషయాలపై ఎవరూ మాట్లాడటానికి వీలులేదని, ఎవరు మాట్లాడినా ఉపేక్షించేది లేదని.. జాతీయ నాయకత్వం దృష్టికి వెళ్తుదంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి అల్టిమేటం ఇచ్చిన విషయం తెలిసిందే.

# నన్నూ కేసీఆర్‌నూ విడదీసే కుట్ర

**(1వపేజీ తరువాయి)**"గంపగుత్తగా బీఆర్ఎస్‌ను బీజేపీకి అప్పగించాలన్న ప్రయత్నం జరుగుతోంది. జైలులో ఉన్నప్పుడే ప్రతిపాదన వస్తే నేను వ్యతిరేకించాను. బీజేపీలో బీఆర్ఎస్ విలీనం కాకుండా స్వతంత్రంగా ఉండాలన్నదే నా అభిమతం. నన్ను పార్టీ నుంచి బయటకు ఎవరు పంపుతారు? అంత సీన్ లేదు. లీకు వీరులను ఎండగట్టమంటే గ్రీకు వీరుల్లా నాపై ప్రతాపం చూపుతున్నారు. కాంగ్రెస్, బీజేపీపై మాట్లాడాలి కానీ, నాపై దాడి చేస్తే ఎలా?. కాంగ్రెస్‌తో నేను మాట్లాడాను అన్నది శుద్ధ అబద్ధం. బీఆర్ఎస్‌లో కేసీఆర్ మాత్రమే నాకు నాయకుడు. కేసీఆర్ నాయకత్వంలోనే పని చేస్తాను. వర్కింగ్ ప్రెసిడెంట్‌కు ఇవ్వాల్సిన ప్రొటోకాల్, గౌరవం ఉంటుందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు.

తనపై దుష్ప్రచారం చేస్తున్నా, పార్టీ స్పందించలేదని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. దేశం వెలుపల ఐటీ సెల్‌లు పెట్టి, తనపై పోరాడుతామంటే ఎలా? అని ప్రశ్నించారు. దొంగల్ని పట్టుకోమంటే చేతగాక తనపై ప్రతాపం చూపితే ఎలా? అని అడిగారు. కేసీఆర్‌కు నోటీసులు ఇస్తే, కేవలం ఎక్స్‌లో పెట్టి వదిలేస్తే ఎలా? అన్న ఆమె, పార్టీ తమదని ప్రతి ఒక్కరూ పోరాడితేనే ఫలితం ఉంటుందన్నారు. కేసీఆర్ ఎలాంటి తప్పు చేయలేదని, ఆయన కింద ఉన్న వారు ఆలోచించుకోవాలని సూచించారు.

నా మీద పడి ఏడిస్తే ఎలా? : 'నేను అంతర్గతంగా ఇచ్చిన ఫీడ్‌బ్యాక్ ఎలా లీక్ అయ్యింది? కట్టడి చేయమంటే పెయిడ్ సోషల్ మీడియాలో విమర్శిస్తున్నారు. ఇంటి ఆడబిడ్డ గురించి ఎలా పడితే అలా మాట్లాడిస్తే అది మర్యాదేనా?. లిక్కర్ కేసు వచ్చినప్పుడు రాజీనామా చేస్తా అంటే కేసీఆర్ వద్దని వారించారు. ఎంపీగా పోటీచేస్తే పార్టీ నేతలే కుట్ర పూరితంగా ఓడించారు. అదే జిల్లాలో ప్రొటోకాల్ ఉండాలని కేసీఆర్ ఎమ్మెల్సీ ఇచ్చారు. నేను పదవుల కోసం ఏనాడూ పాకులాడలేదు. కడుపులో బిడ్డను పెట్టుకొని ఉద్యమంలో సైనికురాలిలా పని చేశాను. నన్ను విమర్శిస్తున్న నేతలు కేసీఆర్ నీడన తప్ప చేసిన కార్యక్రమాలు ఏమున్నాయి.' అని కవిత అన్నారు.

ఆ భేటీ తర్వాతే గోదావరి - బనకచర్ల : తెలంగాణ ప్రాజెక్టులను వ్యతిరేకించలేదని చంద్రబాబు చెప్పడం హాస్యాస్పదమని కవిత అన్నారు. తెలంగాణకు అన్యాయం చేసేలా గోదావరి-బనకచర్ల చేపడుతున్నారని ఆరోపించారు. ఎన్డీఏలో ఉన్నందున కేంద్రం ఏమీ అనదని ముందుకెళ్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డితో భేటీ తర్వాతే చంద్రబాబు గోదావరి-బనకచర్ల చేపట్టారని తెలిపారు. అందరూ కలిసి రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. బీఆర్ఎస్‌లో తనకు నీతులు చెబుతున్న నాయకులు, స్పందించాలని డిమాండ్ చేశారు. గోదావరి-బనకచర్ల అంశం వచ్చినప్పుడు పెద్దఎత్తున కార్యాచరణ చేపట్టాలని అన్నారు.

## మన జెండా పీకేస్తాం అన్నోళ్లు అడ్రస్ లేకుండా పోయారు



**కడప-నవభూమి:** తెలుగుదేశం పార్టీ జెండా పీకేస్తామని, పార్టీని లేకుండా చేస్తామని అన్నవారు ఇప్పుడు అడ్రస్ లేకుండా పోయారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తీవ్రస్థాయిలో విమర్శించారు. కడపలో జరిగిన మహానాడు వేదికగా ఆయన మాట్లాడుతూ, వై నాట్ 175 అన్నవారికి ప్రజలు ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఎదుర్కొన్న సవాళ్లను, కార్యకర్తల త్యాగాలను స్మరించుకుంటూ, రాబోయే రోజుల్లో రాష్ట్ర ప్రగతికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

**మాస్ జాతర అదిరిపోయింది!**

తిరుమల తొలిగడప దేవుని కడప... ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయం, అమీన్ పీర్ దర్గా, మరియాపురం చర్చి నెలకొన్న పుణ్యభూమి కడప. పౌరుషం, ఆత్మీయతలను కలగలిపి మహిళలను గౌరవించి గొప్పనేల కడప. కడప మాస్ జాతర మహానాడు అదిరిపోయింది. పౌరుషాల గడ్డపై పసుపు సైన్యం గర్జించింది, దేవుని గడప కడపలో పసుపు పండగ జరుపుకోవడం మన అదృష్టం. 2024లో మాస్ విక్టరీ సాధించాం, రికార్డులు బద్దలు కొట్టాం... చరిత్రను తిరగరాసాం. 94 పర్సెంట్ స్ట్రైక్ రేట్...164 అవుటాఫ్ 175. ఇది కేవలం రికార్డ్ కాదు ఆల్ టైం రికార్డ్. ఇది తెలుగుదేశం పార్టీ కార్యకర్తల నాటుదెబ్బ. జెండా పీకేస్తాం అన్నారు ... పార్టీ కార్యాలయానికి టు లెట్ బోర్డు పెట్టుకున్నారు. పార్టీ లేకుండా చేస్తామన్నోళ్లు అడ్రెస్స్ లేకుండా పోయారు. వై నాట్ 175 అన్నారు ... ప్రజలు ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదు. మన బొమ్మలు పెట్టి బాక్సింగ్ చేసారు... ఎన్నికల్లో ప్రజలు ఫుట్ బాల్ ఆడుకున్నారు. ఏ తప్పు చేయని మన అధినేతను అరెస్ట్ చేసారు... ప్రజలు వాళ్ళ నాయకుడిని ప్యాలస్ లో పెట్టి తాళం వేసారు. ముఖ్యమంత్రి చంద్రబాబు గారికి, గౌరవ మంత్రులు, గౌరవ ఎమ్మెల్యేలు, 82 బ్యాచ్ సీనియర్ నాయకుల దగ్గర నుండి 2025 బ్యాచ్ జూనియర్లకు, ప్రజలకు, అందరి కంటే ముఖ్యం, ఎత్తిన జెండా దించకుండా, మడమ తిప్పకుండా తెలుగుదేశం పార్టీకి కాపలా కాస్తున్నప్రాణసమానమైన కార్యకర్తలకు నా శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను.

**దేవుని గడప సాక్షిగా ప్రజలకు 4ప్రశ్నలు**

దేవునికడప సాక్షిగా ఇక్కడి ప్రజలను నాలుగు ప్రశ్నలను అడగాలనుకుంటున్నా. 1). తల్లిని చెల్లిన మెడబట్టి బయటకు గెంటిదెవరు? 2). సొంత బాబాయిని గొడ్డలిపోటుతో లేపేసిందెవరు? 3). జె-బ్రాండ్స్ తో పేదల రక్తం తాగిందెవరు? 4). బల్లకింద రెడ్ బటన్ నొక్కి ప్రజలను బాదిందెవరు?

**సీబీఎన్ అంటే ఒక బ్రాండ్**

తెలుగు వారిని ప్రపంచ పటంలో పెట్టింది మన బ్రాండ్ సీబీఎన్. అప్పుడు ఐటీ... ఇప్పుడు ఏఐ. అప్పుడు హైటెక్ సిటీ... ఇప్పుడు క్వాంటమ్ వ్యాలీ. అప్పుడు సైబరాబాద్... ఇప్పుడు అమరావతి. అప్పుడు రూ.200 పెన్షన్ ను రూ. రెండు వేలు చేసింది మన సీబీఎన్... ఇప్పుడు పెన్షన్ ను రూ.నాలుగు వేలు చేసింది కూడా మన సీబీఎన్. అన్న క్యాంటిన్లు, డ్వాక్రా, దీపం, పేదల చిరునవ్వు మన సీబీఎన్. సీబీఎన్ అంటే డెవెలప్మెంట్, సీబీఎన్ అంటే సంక్షేమం, సీబీఎన్ అంటే మానవత్వం.

మన నాయకులు ట్రెండ్ ఫాలో అవ్వరు ట్రెండ్ సెట్ చేస్తారు. సినిమా స్క్రీన్ అయినా పొలిటికల్ స్క్రీన్ అయినా ఆయనే లెజెండ్. ఎన్టీఆర్ అంటే మూడు అక్షరాలు కాదు ఒక ప్రభంజనం. ఆయనే రాముడు, ఆయనే కృష్ణుడు, ఆయనే భీముడు, ఆయనే అర్జునుడు, ఆయనే కర్ణుడు, ఆయనే ప్రజల గుండెల్లో దేవుడు.ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కలిసి రాష్ట్రాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తున్నారు. ప్రధాని మోదీ మన రాష్ట్రానికి పూర్తి సహకారం అందిస్తున్నారు. మనం అడిగిన ప్రతి కోరిక తీరుస్తున్నారు. మనకు అహంకారం ఉండకూడదు, అహంకారం విర్రవీగిన గత పాలకుల 151 సీట్లు 11 అయ్యాయి. అందుకే నేల మీద ఉండి ప్రజలకు సేవ చెయ్యాలి. అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నట్టు పనిచేయాలి. చిన్న కుటుంబంలోనే సమస్యలు ఉంటాయి. కూటమి అన్న తరువాత చిన్న చిన్న సమస్యలు ఉండటం సహజం. ఇగోలు పక్కన పెట్టి అందరిని కలుపుకొని పనిచేయాలి. రాసి పెట్టుకోండి విడాకులు ఉండవు. రాష్ట్రం బాగుపడాలి, ప్రజలు సంతోషంగా ఉండాలి అంటే మనం కలిసి ఉండాల్సిందే.. అని నారా లోకేశ్ వివరించారు.

# ఉత్తమ నటుడిగా అల్లు అర్జున్

**(1వపేజీ తరువాయి)**ఉత్తమ నటుడిగా అల్లు అర్జున్

ఉత్తమ స్క్రీన్ ప్లే రచయిత: వెంకి అట్లూరి (లక్కీ భాస్కర్)

ఉత్తమ సినిమాటోగ్రఫర్: విశ్వనాథ్ రెడ్డి (గామి)

ఉత్తమ ఎడిటర్: నవీన్ నూలి (లక్కీ భాస్కర్)

ఉత్తమ ఆడియోగ్రాఫర్: అరవింద్ మేనన్ (గామి)

ఉత్తమ కొరియోగ్రాఫర్: గణేశ్ ఆచార్య (దేవర)

ఉత్తమ ఆర్ట్ డైరెక్టర్: నితిన్ జిహానీ చౌదరీ (కల్కి)

ఉత్తమ యాక్షన్ కొరియోగ్రాఫర్: కె. చంద్రశేఖర్ రాథోడ్ (గ్యాంగ్‌స్టర్)

ఉత్తమ మేకప్ ఆర్టిస్ట్: నల్ల శ్రీను (రజాకార్)

ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్: అర్చనా రావు, అజయ్ కుమార్ (కల్కి)

స్పెషల్ జ్యూరీ అవార్డుల కేటగిరీలో!

నటుడు- దుల్కర్ సల్మాన్ (లక్కీ భాస్కర్)

నటి- అనన్య నాగళ్ల (పొట్టేల్)

దర్శకులు- సుజీత్, సందీప్ (క)

నిర్మాతలు- ప్రశాంత్ రెడ్డి, రాజేశ్ కల్లెపల్లి (రాజు యాదవ్)

స్పెషల్ జ్యూరీ స్పెషల్ మెన్షన్: ఫరియా అబ్దుల్లా (మత్తు వదలరా 2)

తెలుగు సినిమాలపై ఉత్తమ పుస్తకం: 'మన సినిమా ఫస్ట్ రీల్' (రెంటాల జయదేవ్)

ఉత్తమ నటుడు - అల్లు అర్జున్ (పుష్ప 2)

ఉత్తమ నటి - నివేదా థామస్(35 ఇది చిన్న కథకాదు)

ఉత్తమ దర్శకుడు - నాగ్ అశ్విన్ (కల్కి)

ఉత్తమ సహాయనటుడు - ఎస్‌జే సూర్య (సరిపోదా శనివారం)

ఉత్తమ సహాయనటి - శరణ్యా ప్రదీప్ (అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్)

ఉత్తమ సంగీత దర్శకుడు - బీమ్స్(రజాకార్)

ఉత్తమ నేపథ్య గాయకుడు - సిద్ శ్రీరామ్ (ఊరి పేరు భైరవకోన)

ఉత్తమ నేపథ్యగాయని - శ్రేయా ఘోషల్(పుష్ప 2)

ఉత్తమ గేయ రచయిత - చంద్రబోస్ (రాజూ యాదవ్)

మొదటి బెస్ట్ ఫీచర్ ఫిల్మ్ - కల్కి

రెండో బెస్ట్ ఫీచర్ ఫిల్మ్ - పొట్టేల్

మూడో బెస్ట్ ఫీచర్ ఫిల్మ్ - లక్కీ భాస్కర్

మొత్తం 11 కేటగిరీల్లో ఈ అవార్డులను వెల్లడించారు. 2014 జూన్ నుంచి 2023 డిసెంబర్? 31 వరకు సంవత్సరానికి ఒక ఉత్తమ చిత్రానికి ఈ అవార్డులను ఇచ్చేవారు. ఆ సంవత్సరాలలో రిలీజ్ అయిన సెన్సార్? చిత్రాలను మాత్రమే పరిగణనలోకి తీసుకున్నారు. 2024 తర్వాత సంబంధించి అన్ని కేటగిరిల్లోనూ అవార్డులు ఇచ్చారు. తెలుగు సినిమాలతో పాటుగా ఉర్దూ చిత్రాలకూ అవార్డుల్లో ప్రాధాన్యతనిచ్చారు. ఉత్తమ దర్శకుడు, ఉత్తమ నటుడు సహా మొత్తం 21 మందికి వ్యక్తిగత, స్పెషల్? జ్యూరీ అవార్డులు ఇచ్చారు. వీటితో పాటు ఎన్టీఆర్, పైడి జయరాజ్, బీఎన్ రెడ్డి, నాగిరెడ్డి - చక్రపాణి , కాంతారావు, రఘుపతి వెంకయ్య పేర్లతో ప్రత్యేక అవార్డులను ప్రకటించారు. జూన్ 14న ఈ అవార్డులను ఇవ్వనున్నట్లు తెలిపారు. 14 సంవత్సరాల తర్వాత తెలంగాణ ప్రభుత్వం ఈ అవార్డులను ప్రకటించింది.

# మీ రుణం తీర్చుకుంటా

**(1వపేజీ తరువాయి)**వచ్చిందంటే అది కార్యకర్తలు, నేతలు త్యాగాలే అని తెలిపారు. మెజార్టీలు అత్యధికంగా వచ్చాయన్నారు. ఏడాది క్రితం రాష్ట్రం విధ్వంస పాలనతో 30 ఏళ్లు వెనక్కు వెళ్లిందని విమర్శించారు. 'కష్టాలు, సవాళ్లను చూసి నేను భయపడలేదు. నేను క్లైమోర్ మైన్‌లకు భయపడలేదు. వీటికి భయపడతానా' అని ప్రశ్నించారు చంద్రబాబు. సైకిళ్లు వేసుకుని కడప మహానాడుకు వచ్చారంటూ.. కోడూరు నుంచి సైకిల్ వేసుకుని వచ్చిన వ్యక్తిని సభా వేదికపై సీఎం చూపించారు. ఇటువంటి కార్యకర్తలు ఏ పార్టీకైనా ఉంటారా అని ప్రశ్నించారు. ఇటువంటి కార్యకర్తలు ఉండటం పార్టీకి అదృష్టం అని అన్నారు.

**భూసమస్య లేకుండా చేస్తా**

అన్న క్యాంటీన్లు తెరవడం, రోడ్లు బాగుచేయడం, పెన్షన్లు 4 వేలు చేయడం, దేవాలయాల్లో అన్నదానం ప్రారంభం విషయాన్ని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గుర్తుచేశారు. కేంద్ర పథకాలు నిధులు డైవర్ట్ చేశారని మండిపడ్డారు. తాను వెంటనే పథకాలను పునరుద్ధరించానని తెలిపారు. తెలుగుదేశం అంటేనే బీసీల పార్టీ అని.. బీసీల కోసం బడ్జెట్‌లో రూ.47 వేల కోట్లు పెట్టామని చెప్పారు. పలు బీసీ వర్గాలకు ఇచ్చిన పథకాలను సీఎం గుర్తుచేశారు. సూర్యఘర్ పథకం కింద ఎస్సీ, ఎస్టీలకు ఫ్రీ గా సోలార్ విద్యుత్ ఇస్తామన్నారు. రైతులకు వ్యవసాయ పంపు సెట్లు వద్ద సోలార్ విద్యుత్ పెట్టుకోవాలని సీఎం చెప్పారు. ఉద్యోగులను గత ప్రభుత్వం అవమానాలకు గురి చేసిందని.. కానీ ఇప్పుడు ఒకటవ తేదీన జీతాలు ఇస్తున్నామని తెలిపారు. వారికి ఇప్పటికే రూ.7 వేల 500 కోట్లు బకాయిలు ఇచ్చామన్నారు. కూటమి రాగానే ల్యాండ్ టైట్లింగ్ చట్టం రద్దు చేశామని తెలిపారు. రాబోయే మహానాడుకు భూ సమస్యలు లేకుండా చేస్తానంటూ ఈ సందర్భంగా సీఎం హామీ ఇచ్చారు.

**ఇక్కడ ఉంది సీబీఎన్.. గుర్తుపెట్టుకోండి**

దేశానికి టెర్రరిస్ట్‌ల వలన చాలా నష్టం జరుగుతోందన్నారు. మన దేశంలో, రాష్ట్రంలో ఆర్థిక ఉగ్రవాదులు వలన నష్టం కలుగుతోందన్నారు. నాసిరకం మద్యం వలన ఆరోగ్య సమస్యలు తలెత్తాయని అన్నారు. గంజాయ్ వలన అనేక మంది భవిష్యత్ నాశనం అయిందని అన్నారు.

# కేబినెట్ ప్రక్షాళన!

**(1వపేజీ తరువాయి)**ల అమలు, ఖర్చు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల విషయం లో అంతా ఒకేతాటిపై ఉంటూ, ఐకమత్యంగా ముందుకెళ్లాలని సీఎం రేవంత్ సూచించినట్లు తెలుస్తోంది. మంత్రులు తమ శాఖలపై మరింత పట్టు సాధించాలని రేవంత్ పేర్కొన్నట్లు సమాచారం. విందు భేటీలో భాగంగా రాష్ట్ర రాజకీయాలపైనా మంత్రులతో సీఎం రేవంత్ చర్చించారు. స్థానిక సంస్థల ఎన్నికలు, క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పరిస్థితి, బీఆర్ఎస్, బీజేపీ వ్యవ రిస్తున్న తీరుపై తమ అభిప్రాయాలు వెల్లడించారు. కేసీఆర్‌కు ఆయన కుమార్తె కవిత రాసిన లేఖ తదనంతర పరిణామాల పైన చర్చించినట్లు సమాచారం. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ పైనా ఈ సమావేశంలో చర్చ చేసినట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్.. టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ మరో సారి రేపు ఢిల్లీ వెళ్తున్నారు. ఈ పర్యటన లో పీసీసీ, మంత్రివర్గ కూర్పుపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని విందులో మంత్రులతో సీఎం పేర్కొన్నట్టు తెలిసింది. స్పష్టత వస్తే జూన్ మొదటివారంలో ఎప్పుడైనా.. ప్రకటిస్తారని తెలిపినట్టు సమాచారం. ఇక విందులో పాల్గొన్న మీనాక్షి నటరాజన్ కూడా పీసీసీ, మంత్రివర్గ కూర్పుపై పలు సూచనలు చేసినట్టు తెలిసింది. మంత్రులకు సీఎం ఇచ్చిన విందు రాత్రి 7.30గంటల నుంచి 12గంటల వరకు కొనసాగింది. ఈ విందు సమావేశంలో మంత్రులు సైతం ఓపెన్‌గా తమ అభిప్రాయాలను.. పలు విషయాలను స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఇక , మంత్రివర్గ విస్తరణ తరువాత పాలనా పరంగా మరిన్ని కీలక నిర్ణయాలకు రేవంత్ సమాయత్తం అవుతున్నారు.

## ఇక అరెస్ట్?

**(1వపేజీ తరువాయి)**హెచ్చరికలు పంపారు. ఆ తర్వాత వైసీపీ కూడా సైలెంట్ గా ఉంటోంది. అయితే సాయిరెడ్డి చెప్పిన సమాచారం నిజమే అయితే మాత్రం జగన్ విషయంలో కూటమి తీసుకునే నిర్ణయం, దాని పర్యవసానాలు ఎలా ఉండబోతున్నా యన్న దానిపై చర్చ జరుగుతోంది. మరోవైపు ఇప్పటికే ఓసారి మద్యం స్కాంలో సాక్షిగా హాజరై సీఐడీ సిట్‌కు పలు వివరాలు వెల్లడించిన సాయిరెడ్డి.. ఇప్పుడు ఈ స్కాంలో జగన్ అరెస్టుపై చెప్పారని భావిస్తున్న రహస్య సమాచారంపై వైసీపీ నేతలు మాత్రం స్పందించడం లేదు. సాయిరెడ్డి వంటి కూటమికి అమ్ముడుపోయిన రోగ్ ఎంపీ చెప్పే మాటలకు విలువేముంటుందని జగన్ స్వయంగా వ్యాఖ్యానించారు.

## వంశీకి ఊరట!

**(1వపేజీ తరువాయి)**వంశీ తన అనారోగ్య కారణాలను వివరిస్తూ.. ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్సకు అనుమతి ఇవ్వాలని కోర్టను కోరారు. ఈ మేరకు పిటిషన్ దాఖలు చేయగా.. కోర్టు విచారణ చేసింది. ప్రభుత్వ ఆస్పత్రి లో చికిత్స సరిగ్గా లేదని కోర్టుకు నివేదించారు. దీంతో, వంశీకి ఎక్కడ చికిత్స అందిస్తారో చెప్పాలని ప్రభుత్వ న్యాయవాదిని కోర్టు ఆదేశించింది. కోర్టుకు నివేదించిన తరువాత వంశీని చికిత్స కోసం తరలించే అవకాశం ఉంది.

## జూన్ 8న చేప ప్రసాదం పంపిణీ

**హైదరాబాద్-నవభూమి:**జూన్ మాసం వచ్చిందంటే చాలు.. తెలంగాణలో.. మరీ ముఖ్యంగా హైదరాబాద్‌లో చేప ప్రసాదం పంపిణీ హడావుడి మొదలవుతుంది. ప్రతి ఏడాది మృగశిర కార్తె సందర్భంగా జూన్ 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లో చేప ప్రసాదం పంపిణీ చేస్తారు. బత్తిని గౌడ్ కుటుంబ సభ్యులు.. ప్రతి ఏటా చేప ప్రసాదం పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంటారు. ఇందుకోసం నగరంలోని వారే కాక రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున జనాలు హాజరవుతుంటారు. హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో చేప ప్రసాదం పంపిణీ చేస్తారు. ఈ ఏడాది కూడా అలానే జరుగుతుందన్నారు బత్తిని కుటుంబ సభ్యులు. ఈ సందర్భంగా గురువారం నాడు వారు మీడియాతో మాట్లాడుతూ.. కీలక వ్యాఖ్యలు చేశారు.ప్రతి ఏడాదిలానే ఈ సంవత్సరం కూడా జూన్ 8వ తేదీన ఉదయం 10 గంటల నుంచి చేప ప్రసాదం పంపిణీ మొదలవుతుందన్నారు బత్తిని కుటుంబ సభ్యులు. మరుసటి రోజు అనగా.. జూన్ 9, ఉదయం 10 గంటల వరకు కార్యక్రమం కొనసాగుతుందని బత్తిని కుటుంబ సభ్యులు చెప్పుకొచ్చారు. ఈ నేపథ్యంలో దగ్గు, ఆస్తమా, దమ్ము, ఉబ్బసం, శ్వాసకోశ సమస్యలతో బాధపడే వారు వచ్చి చేప ప్రసాదం తీసుకోవాలని సూచించారు.ఇక గతేడాది సుమారు 2.5 లక్షల మంది చేప ప్రసాదం తీసుకున్నారని బత్తిని కుటుంబ సభ్యులు చెప్పుకొచ్చారు. ఈ సంవత్సరం ఈ సంఖ్య మరింత పెరిగి.. మూడు లక్షల మంది చేప ప్రసాదం తీసుకుంటారని అంచనా వేస్తున్నామన్నారు. చేప ప్రసాదం కోసం ప్రతి ఏటా రెండు తెలుగు రాష్ట్రాల నుంచి మాత్రమే కాక దేశ నలుమూలల, విదేశాల నుంచి సైతం పెద్ద సంఖ్యలో జనాలు తరలి వస్తారని చెప్పుకొచ్చారు. చేప ప్రసాదం పంపిణీ కార్యక్రమం ప్రశాంతంగా సాగేందుకు ఆయా శాఖల అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించినట్లు బత్తిని కుటుంబ సభ్యులు వెల్లడించారు.ప్రస్తుతం దేశంలో కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో.. మాస్క్‌లు, గ్లౌస్‌లు ధరించి, ఎప్పటికప్పుడు చేతులు శుభ్రం చేసుకుంటూ చేప ప్రసాదం పంపిణీ చేస్తామని వారు చెప్పుకొచ్చారు. అయితే చేప ప్రసాదం తీసుకున్న వారు 45 రోజుల పాటు ఆహార నియమానలు కచ్చితంగా పాటించాలన్నారు. గర్భిణీ స్త్రీలు తప్ప అందరూ దీన్ని తీసుకోవచ్చని స్పష్టం చేశారు.చేపప్రసాదం కోసం తెలంగాణ మత్స్య శాఖ ఈ సంవత్సరం 1.25 లక్షల చేప పిల్లలను అందుబాటులో ఉంచనుందని తెలిపారు. అయితే పోయిన సంవత్సరం చేప ప్రసాదం కోసం వినియోగించే.. ఒక్కో చేపకు రూ. 40 చెల్లించామన్నారు. ఈ ఏడాది ధరపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని తెలిపారు. అంతేకాక 200 మంది వాలంటీర్లు చేప ప్రసాదం కోసం వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సాయం చేస్తారన్నారు. ప్రసాదం కోసం వచ్చే వారి కోసం పలు స్వచ్ఛంద సంస్థలు ఉచిత భోజనం అందించనున్నట్లు తెలిపారు.

## సుప్రీంకోర్టుకు ముగ్గురు కొత్త జడ్జీలు

**న్యూఢిల్లీ-నవభూమి:**సుప్రీంకోర్టులో ముగ్గురు కొత్త న్యాయమూర్తుల నియామకానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు సుప్రీంకోర్టు కొలీజియం చేసిన సిఫార్సులకు గురువారం కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కేంద్రమంత్రి అర్జున్ రామ్ మేఘువల్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. కర్ణాటక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ అంజారియా, గుహవటి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ విజయ్ బిష్ణోయ్?, ముంబై హై కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏఎస్ చందూర్కర్‌ను కొలీజియం సిఫార్స్ చేసింది. వీటిని సీజేఐతో చర్చించిన అనంతరం రాష్ట్రపతి ఆమోదించినట్లు కేంద్ర మంత్రి తెలిపారు.

జస్టిస్ ఎన్వీ అంజారియా : గుజరాత్ హైకోర్టులో 1988లో తన కెరీర్ ప్రారంభించారు జస్టిస్ ఎన్వీ అంజారియా. ఆ తర్వాత 2011 నవంబర్ 21న అడిషనల్ జడ్జీగా, 2013 సెప్టెంబర్? 6న శాశ్వత జడ్జీగా నియమితులయ్యారు. అనంతరం 2024 ఫిబ్రవరి 25న కర్ణాటక హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా ప్రమాణం చేశారు.

జస్టిస్ విజయ్ బిష్ణోయ్ : రాజస్థాన్ హైకోర్టులో 1989 జూలై 8న న్యాయవాదిగా నమోదు చేసుకున్నారు

## ఆ రెండు పథకాలను వారికి రద్దు చేస్తాం..

బెంగళూరు -నవభూమి:కాంగ్రెస్ ప్రభుత్వ గ్యారెంటీల్లో కీలకమైన గృహలక్ష్మి, గృహజ్యోతి పథకాల అనర్హులైన లబ్ధిదారులకు జూలైనుంచి రద్దు చేస్తున్నట్లు సీఎం ఆర్థిక సలహాదారు బసవరాజరాయరెడ్డితెలిపారు. కొప్పళ జిల్లా కుకనూరు పట్టణ అతిథిగృహంలో బుధవారం మీడియాతో ఆయన మాట్లాడారు. గ్యారెంటీ పథకాల్లో అనర్హులైన లబ్ధిదారులకు లాభం కలుగుతోందన్నారు. సర్వేలు జరిపి అనర్హులను తొలగించదలిచామన్నారు. ఒక శాసనసభ నియోజకవర్గానికి ఏడాదికి



గ్యారెంటీ పథకాల ద్వారా రూ.250 కోట్లు చేరుతోందన్నారు. పథకం ప్రజల చెంతకు వెళ్తోందని, అయితే అనర్హులు సైతం లబ్ధి పొందుతున్నారన్నారు. రాష్ట్రస్థాయిలో ప్రత్యేక బృందాలుగా అధికారులను ఏర్పాటు చేసి నియంత్రించాలని సీఎం సిద్ధరామయ్యకు వివరిస్తానన్నారు. ఇళ్లు బాడుగకు ఇచ్చినవారికి గృహజ్యోతి వర్తిస్తోందన్నారు. గృహలక్ష్మి పథకం జీఎస్టీ, ఇన్‌కమ్‌ట్యాక్స్ చెల్లించేవారికి వెళ్తుందోన్నారు. సమగ్రంగా సర్వే జరిపి అర్హులకు మాత్రమే గ్యారెంటీలు అందాల్సిన అవసరం ఉందన్నారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
3 హైదరాబాద్ శుక్రవారం 30 । మే । 2025

## రోహిణి కార్తెలోనే నైరుతి రుతుపవనాలు

చరిత్రలో ఎప్పుడూ ఇలా జరగకపోవచ్చు. కాలం మారింది అనటానికి ఇదే నిదర్శనం. నైరుతి రుతుపవనాలు ముందే వచ్చేశాయి. ఇంకాచెప్పాలంటే, వాతావరణశాఖ అంచనాలను కూడా త్రోసిరాజని జల్లులు కురుస్తున్నాయి. ఉగ్రవేసవి అధికారికంగా ముగియడానికి ఇంకా అనేకరోజులు ఉండగానే, ఏకంగా ఎనిమిది రోజుల ముందే రుతుపవనాలు కేరళను తాకాయి, తెలుగురాష్ట్రాలు కూడా వర్షాలకు తడిసి తరిస్తున్నాయి. రుతుపవనాలు ఇలా హడావుడిపడటం పాతికేళ్ళలో ఇది మూడోసారి, పదహారేళ్ళలో తొలిసారి. 2023లో వారంరోజులు ఆలస్యంగా కేరళను తాకి దేశాన్ని అల్లాడిపోయేట్టు చేసినందుకు కాబోలు, మరుసటి ఏడాది మే 30నే నైరుతి వచ్చి మనకు ఉపశమనాన్ని ఇచ్చింది. ఈ పలకరింపులో ఏ మాత్రం జాప్యం జరిగినా ఎంతటి క్షోభ కలుగుతుందో తెలుసు కనుకనే రైతే కాదు, సామాన్యుడు సైతం పవనాల రాకను స్వాగతిస్తున్నాడు, ముందేవచ్చినందుకు ముచ్చటపడుతున్నాడు. రానున్నరోజుల్లో వర్షాలు విస్తారంగా కురుస్తాయని వాతావరణశాఖ శుభవార్త వినిపించింది. వ్యవసాయాధారిత దేశం కనుక అది నిజం కావాలనీ, అన్నదాత ఆనందించాలనీ నాయకులంతా కోరుకుంటున్నారు. జపాన్‌ను దాటి ప్రపంచ నాలుగవ అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా భారతదేశం ఆవిర్భవించిందని శనివారం నీతి అయోగ్ ప్రకటించింది. ఆర్థికవ్యవస్థ పురోగమనానికి రుతుపవనాలు ఊతాన్నిస్తాయి. ఈ ఏడాది సాధారణం కంటే ఎక్కువ వర్షాలు పడతాయన్నది ఖరీఫ్ పొంగిపొర్లేందుకు అవశ్యకమైన శుభవార్త. 2027లో జర్మనీని సైతం అధిగమించి అతిపెద్ద మూడో ఆర్థిక వ్యవస్థగా భారత్ ప్రభవిస్తుందన్న అంచనాలకు అనుగుణంగా, ఆ అద్భుత పురోగతి సుసాధ్యం కావడానికి రాబోయే సంవత్సరాల్లో సైతం వర్షాలు ఇదేరీతిలో ఉండాలని కోరుకోవాలి. ఆహారధాన్యాల నిల్వలకు లోటేమీలేదు కనుక, మూడునెలల రేషన్ ముందుగానే ప్రజలకు పంచేసి, ఇబ్బడిముబ్బడిగా రాబోతున్న ఉత్పత్తికి గిడ్డంగులను సిద్ధం చేయమంటూ రాష్ట్రాలను కేంద్రం ఇప్పటికే ఆదేశించింది.

గత ఏడాది దేశవ్యాప్తంగా మిగులు వర్షపాతం ఉన్నా పంజాబ్, బిహార్, ఉత్తర్‌ప్రదేశ్ ఇత్యాది రాష్ట్రాల్లో లోటు నమోదుకావడం, మరోపక్క రాజస్థాన్, గుజరాత్ వంటివి మునిగిపోవడం చూశాం. పంటదిగుబడి ఇంకా అధికంగా వర్షాలమీదే ఆధారపడుతున్న ఈ దేశంలో చినుకుపడితే ఆనందం, ఆగితే విషాదం పక్కపక్కనే ఉంటాయి. ఒకచోట కుంభవృష్టి, మరొకచోట అనావృష్టి సహజమైపోయాయి. వాతావరణ మార్పు కారణంగా వర్షపురోజుల సంఖ్య క్రమంగా తగ్గుతూ, కుంభవృష్టితో ప్రళయాలు వచ్చిపడే పాడుకాలం దాపురించింది. ఇరిగేషన్ సౌకర్యాల విస్తరణ జరగకుండా దేశంలో ఎక్కువమంది రైతన్నలు ఇంకా మేఘాలనే నమ్ముకొని వ్యవసాయం చేయడం వారిని ఆర్థిక కష్టాల్లోకి నెట్టేసి, ఆత్మహత్యల వరకూ తీసుకుపోతున్నది. నీటి సౌకర్యాలను మెరుగుపరచి, విత్తనాలనుంచి గిడ్డంగుల వరకూ అన్నింటా అండగా నిలిచి, ప్రకృతిప్రకోపాలకు ప్రత్యక్షంగా బలైపోయే పరిస్థితులనుంచి వారిని బయటకు తీసుకురావాలి. రుతుపవనాలు ముందుగా వచ్చిన ఉత్సాహాన్ని ఢిల్లీ, ముంబై, బెంగుళూరు వంటి మహానగరాలు మునిగిపోతున్న దృశ్యాలు నీరుగారుస్తున్నాయి. మూడోవంతుకంటే ఎక్కువ జనాభా నివసిస్తున్న నగరాలు నాలుగు చినుకులకే అల్లాడిపోతున్నాయి. కాస్తంత తక్కువ వర్షం పడితే, భూగర్భజలాలు అడుగంటిపోవడం, నీటికి అల్లాడిపోవడం, మరోపక్క మేఘాలు కాస్తంత దయతలిస్తే చిగురుటాకుల్లా వొణికిపోవడం సర్వసాధారణమైపోయింది. ఇక, ఈ రుతువులతో సంబంధం లేకుండా నగరాలను ముంచేస్తున్న కుంభవృష్టులకు మన వ్యవస్థలను సంసిద్ధం చేయాల్సిన బృహత్తర కర్తవ్యం మిగిలే ఉంది.వాతావరణమార్పును నివారించడంతో పాటు, సాగు, తాగునీరు, మురుగునీటి వ్యవస్థలను మెరుగుపరుచుకోవాలి. రుతుపవనాల వల్ల వర్షాన్ని పొందుతున్న దేశాల్లో మనదే ప్రధానమైనది, పెద్దదీ అంటారు. దేశం అన్ని రంగాల్లో ఎంత ఎదుగుతున్నా డెబ్బయ్‌శాతం సాగు, తాగునీటిని అవసరాలను తీరుస్తూ, జనాభాలో తొలిస్థానంలో ఉన్న ఈ దేశానికి ప్రాణాన్నిస్తున్న రుతుపవనాల ప్రాధాన్యం లెక్కకు అందనిది. 2009లో పవనాలు ఇప్పటికంటే ముందే వచ్చినా, 23శాతం వర్షలోటుతో దేశాన్ని పొడిబార్చిన సంగతి తెలిసిందే. రాకపోకలే కాదు, విస్తరణలోనూ అనిశ్చితిని కనబరచే రుతుపవనాలకు ఈ ఏడాది ఏ అడ్డంకులు ఏర్పడకూడదని, గత పదిహేనేళ్ళకాలంలో వీటి మంచిచెడులను మరికాస్తంత కచ్చితత్వంతో చెప్పగలుగుతున్న వాతావరణశాఖ అంచనాలకు అనుగుణంగా వాటి పురోగతి, ప్రభావం ఉండాలని కోరుకుందాం. ప్రతీ సంవత్సరం.. మే 31 లేదా జూన్ 1న నైరుతీ రుతుపనాలు కేరళను తాకుతున్నాయి. అక్కడ బాగానే వర్షాలు కురుస్తాయి. కానీ మన ఏపీ, తెలంగాణలో మాత్రం వానలు సరిగా పడేవి కావు. కేరళను నైరుతీ తాకిన తర్వాత.. 2 వారాల తర్వాత గానీ మనకు వర్షాలు వచ్చేవి కావు. ఈసారి మొత్తం మారిపోయింది. కేరళతో సంబంధం లేకుండా.. రుతుపవనాలు.. అన్నివైపుల నుంచీ వచ్చేశాయి. అందుకే తెలుగు రాష్ట్రాలను 15 రోజుల ముందే పలుకరించాయి.మన దేశంలో ఖరీఫ్ సీజన్.. వర్షాకాలంపై ఆధారపడి ఉంటుంది. వర్షాధారిత పంటలను వానాకాలంలో పండిస్తారు. అందువల్ల వర్షాలు అవసరమే. ఐతే.. ఈసారి ప్లాన్ మొత్తం మారింది. 15 రోజుల ముందే వానలు మొదలైపోవడం, భారీగా కురుస్తుండటంతో.. రైతుల అంచనాలు తలకిందులయ్యాయి. చెప్పాలంటే.. వాతావరణ అధికారులు కూడా ఈ అంచనాలు సరిగా వెయ్యలేకపోయారు. వారి అంచనా ప్రకారం.. కేరళను ఈ రుతుపవనాలు మే 30న పలుకరించాలి. ఆ తర్వాత జూన్ 5న ఏపీకి వస్తాయి అనుకున్నారు. కానీ.. అంతా మారిపోయింది. అప్పుడే ఈ గాలులు.. బెంగాల్ దాటి.. ఈశాన్య రాష్ట్రాల దాకా వెళ్లిపోయాయి. జూన్ రాకముందే, సగం ఇండియాని కవర్ చేసేలా ఉన్నాయి.


# కోటి ఆశలతో ప్రారంభమవుతున్న ఏరువాక



**ముందుగానే వచ్చిన రుతుపవనాలు**
**చాలా సంవత్సరాల తర్వాత రోహిణి కార్తెల వస్తున్న వర్షాలు**
**వ్యవసాయ పనుల్లో మునిగిపోయిన రైతులు**

మంచి వర్షాలు కురవాలని, ప్రతి రైతుకు ఆశించిన దిగుబడి రావాలని కోటి ఆశలతో ఏరువాక వ్యవసాయ సంవత్సరం ప్రారంభమవుతుంది. రోహిణి కార్తి తో ప్రారంభమయ్యే వర్షాకాలం వర్షాల కోసం పేద చిన్న కారు సన్న కారు పెద్ద రైతులందరూ కూడా ఎవరికివారు నేలతల్లి నమ్ముకుని పంటలు వేస్తున్నారు. వ్యవసాయం అనుబంధ వృత్తుల వారందరికీ కూడా చేతినిండా పని లభించాలని కోరుకుంటా. ముఖ్యంగా తెలంగాణ ప్రాంతంలో ప్రాంతాలవారీగా భూసారాన్ని బట్టి రైతులు పంటలు వేస్తున్నారు . చాలావరకు 60 శాతం భూభాగంలో వర్షం ఆధారిత పంటలపైనే నమ్ముకుని పంటలు వేస్తున్నారు. గత నాలుగైదు సంవత్సరాలుగా రైతులు అధిక శాతం వరి ధాన్యం, పత్తి ప డించడం పైనే దృష్టి పెడుతున్నారు. వాటిని అమ్ముకోవడంలో సరియైన గిట్టుబాటు ధర రాక ఆందోళన చెందుతున్నారు.






వర్షాకాలం ఖరీఫ్ సీజన్లో ప్రధానంగా తెలంగాణ ప్రాంతంలో ఆరుతడి పంటలైన మొక్కజొన్న, పత్తి, జొన్న అధికంగా పండించగా చిరు పంటలైన కంది, పెసర్లు, బబ్బర్లు , ఉలువలు , నువ్వులు , రాగులు లాంటి పంటలను పండించడానికి రైతులు ఇష్టపడుతున్నారు. సగం వరకు వరి రైతులు ఆయా చెరువుల నీటి లభ్యత ఉన్న ప్రాంతంలో వరి పండిస్తున్నారు. ఏరువాక ప్రారంభం కావడంతో ప్రతి చిన్న పెద్ద రైతులు రుతుపవనాలపై ఎదురుచూస్తున్నారు . చిన్నపాటి వర్షం కురిసిన విత్తనాలు వేయడానికి సిద్ధం చేసుకుంటున్నారు. ఇప్పటికే రైతులు వ్యవసాయ అధికారులను సంప్రదించి కావలసిన విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. ఏరువాక ప్రారంభంతోనే చిన్న చిన్న వర్షాలను దుక్కులను దున్ని విత్తనాలు వేయడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నారు. గతంలో లాగా కాకుండా ప్రస్తుతం ప్రతి రైతు సాంకేతిక పరిజ్ఞానం పైన ఆధారపడి భూసార పరీక్షలు కూడా చేయించుకుని అనుకూలం పైన పంటలు వేయడానికి ముందుకు వస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలలో అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం పంటలతోపాటు చిరుధాన్యాల పంటలు కూడా వేస్తున్నారు. భారతదేశంలో జనాభాలో 80 శాతం మంది వ్యవసాయ ఆధారిత పరిశ్రమలపై ఆధారపడి జీవనం చేస్తున్నారు. రెండు రోజుల క్రితమే కేంద్ర ప్రభుత్వం కొన్ని పంటలు దిగుబడులు పైన మద్దతు ధరను ప్రకటించింది. అయినా ఇంకా రైతులను ఆదుకోవాల్సినటువంటి బాధ్యత అవసరం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపైన ఉంది. పంటలు పండించడం ఒకవైపు అయితే వాటిని విక్రయించడం పెద్ద సమస్యగా మారింది. మొదటినుండి కూడా మధ్యధళా రులు ఇందులో ప్రధాన భూమిక పోషిస్తున్నారు. వర్షాకాలం పంటలు వేయగానే చాలామంది గ్రామీణ ప్రాంతా రైతులు వారి వారి గ్రామాలను వదిలి పరిసర ప్రాంతాల్లోని పట్టణాల్లో కెళ్ళి కూలీనాలీ చేసుకుని వారి కుటుంబాలను పోషించుకుంటారు వ్యవసాయం పైన ఆశించినంత లాభాలు రాకపోవడం, వారి పిల్లల చదువులకు భారం కావడం తో ప్రతి కుటుంబంలోని వారు తప్పనిసరిగా వలస కూలీలుగా మారుతున్నారు.

**ఏరువాక రోహిణి కార్తె ప్రారంభం**

రోజు పెద్ద పెద్ద రైతులందరూ తమ పశువులను వ్యవసాయ పనిముట్లను పూజించి మొదటి విత్తనాలు వేయడం ప్రారంభిస్తారు. ఈ సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ పంటలు బాగా పండి దిగుబడి రావాలని కోరుకుంటారు. తెలంగాణ పంటలలో చెరుకు వరి పత్తి పంటలకు ప్రాధాన్యత నిస్తున్నారు.

**-అస శ్రీరాములు**
**సీనియర్ జర్నలిస్ట్**
**9440037196**

## పసిపిల్లల ప్రాణాలు తీస్తున్న దారుణ పరిస్థితులు



గాజా మొత్తాన్ని ఖాళీచేయిస్తాం, పసిపిల్లలను కూడా వదిలేది లేదంటూ ఇజ్రాయెల్ పాలకులు చేస్తున్న ప్రకటనలు, తదనుగుణంగా మరింత హెచ్చుస్థాయిలో అమానుషంగా సాగుతున్న దాడులు మానవత్వం ఉన్నవారి మనసులు కలిచివేస్తున్నాయి. అత్యంత ఘోరమైన, క్రూరమైన పరిస్థితులను గాజా ఎదుర్కొంటున్నదని, కాస్తంత దయతలచాలని ఇజ్రాయెల్ ప్రధానిని ఐక్యరాజ్యసమితి అధినేత బతిమాలుతున్నారు. గురు,శుక్రవారాల్లో ఇజ్రాయెల్ దాడుల్లో 140మంది పాలస్తీనియన్లు చనిపోతే, ఆకలి మరో నలభైమందిని చంపేసింది. ఆయుధాలతో పాటు ఆకలిని కూడా మారణాయుధంగా ప్రయోగించి ప్రాణాలు తీస్తున్న నెతన్యాహూను అమెరికా మాత్రమే ఆపగలదన్నట్టుగా మిగతాప్రపంచం, మరీముఖ్యంగా అరబ్‌దేశాలు చేతులెత్తేయడం ఆశ్చర్యం, అమానుషం. దాదాపు వందరోజులైంది గాజాలోకి ఆహారం అడుగుపెట్టి. వేలాదిమంది పిల్లలు చావుఅంచున ఉన్నా ఇజ్రాయెల్ అధినేతకు మనసు కరగ లేదు. గాజాలో ప్రవేశం కోసం సరిహద్దుల్లో నిరీక్షిస్తున్న ఆహారపు ట్రక్కులను ఆయన లోపలకు రానివ్వలేదు. అస్త్రాలతో పాటు, ఆకలిని కూడా వాడి ఒక్క పసిగుడ్డును కూడా గాజాలో మిగలనివ్వకుండా మొత్తం ఖాళీచేయించే దిశగా ఆయన పావులుకదుపుతున్నాడు. గాజాను స్వాధీనం చేసుకొని, ఖాళీచేయించి, దానిని ఒక టూరిస్టు రిసార్టుగా మార్చేందుకు అమెరికాకు అప్పగించడం కోసమే ఈ ఊచకోత కొనసాగుతోందన్నది స్పష్టం. కాల్పుల విరమణ ఒప్పందం చక్కగా అమలుజరుగుతూ, తనవద్ద ఉన్న బందీలను అనుకున్నప్రకారం హమాస్ సవ్యంగా అప్పగిస్తున్న దశలో, అమెరికా అధ్యక్షుడు తన మనసులో మాట చెప్పడం, ఆ కాస్తంత శాంతినీ బద్దలు కొడుతూ, ఒక అర్థరాత్రివేళ ఇజ్రాయెల్ మారణాయుధాలతో విరుచుకుపడి ఒకేరోజు ఏకంగా ఆరువందల మందిని హతమార్చడం చూశాం. అలా ఆరంభమైన ఆ ప్రయత్నం నానాటికీ మరింత దుర్మార్గంగా, అమానుషంగా అమలు జరుగుతోంది. ట్రంప్ కళ్ళలో ఆనందం చూడటానికి, ఆయన అనుమతితోనే ఈ మారణకాండను మళ్ళీ మొదలెట్టానని అప్పట్లో చెప్పిన నెతన్యాహూ ఇప్పుడు అదే ఆప్తమిత్రుడి కోరికమీద కాసిన్ని ఆహారధాన్యాలు గాజాలోకి అనుమతించాలని నిర్ణయించుకున్నారు.%ఆకలిచావుల చిత్రాలు చూడటానికి ట్రంప్ దొరవారు ఇష్టపడకపోవడంతో కడివెడు అవసరమైనచోటకు ఒక గరిటెడు పంపడానికి నెతన్యాహూ సరేనన్నారు. ఐదునెలల తరువాత విలేకరుల సమావేశంలో మాట్లాడిన నెతన్యాహూ గాజా మొత్తం ఖాళీ అయ్యేదాకా యుద్ధం ఆగదంటూ ఒకేఒక్కముక్కలో అసలు విషయాన్ని తేల్చేశారు. అమెరికా అధ్యక్షుడి ఆలోచన అద్భుతం, అమోఘం అని తెగమెచ్చుకుంటూ, ఇది పశ్చిమాసియా తీరుతెన్నులనే మార్చేస్తుందన్నారు. లక్ష్యసాధనలో కచ్చితంగా విజయం సాధిస్తామని, ఏడాదిన్నరలోనే అనుకున్నది సాధిస్తానని అంటున్నారు. ఇప్పటికే ఓ అరవైవేలమంది సామాన్యులను ఊచకోతకోసి, సగటున రోజుకోవందమందిని హతమారుస్తున్న నెతన్యాహూ ఈ లక్ష్యసాధనకోసం మరింత దుర్మార్గంగా ప్రవర్తించ బోతున్నారని అర్థం. ఇజ్రాయెల్‌మీద దాడిచేసిన హమాస్‌ను దుంపనాశనం చేస్తానంటూ ఆరంభించిన ఈ యుద్ధాన్ని ఆయన ఇంకా అవేమాటలు వాడుతూ మరో అవసరం కోసం కొనసాగిస్తున్నారు. లక్షలాదిమంది ప్రాణాలను, జీవితాలను ఇజ్రాయెల్‌కు బలిపెట్టిన హమాస్‌ను ఇప్పటివరకూ నెతన్యాహూ ఎంతమేరకు దెబ్బతీయగలిగారో తెలియదు కానీ, గాజామొత్తం నామరూపాల్లేకుండా పోయింది. కంటిఎదుట కన్నబిడ్డలు కన్నుమూస్తున్నా ఏడ్చే ఓపికలేని తల్లులు, ఆకలితో మరణిస్తున్న పిల్లలూ వృద్ధులతో స్మశానంలాగా మారిన గాజాలో ఒక్క ఆస్పత్రిని కూడా మిగలనివ్వలేదు నెతన్యాహూ. బ్రిటన్, ఫ్రాన్స్, కెనడాలకు కాస్తంత మనసుకరిగి, ఆగ్రహం కలిగి, వాణిజ్యచర్చలను బందుపెట్టినందువల్ల ఇజ్రాయెల్ అధినేత ఈ కాస్తంతైనా దిగివచ్చి, నాలుగుమెతుకులు అందించ దానికి ఒప్పుకున్నాడు. అంతేకాని, గాజావాసులకు కడుపునిండా అన్నంపెట్టి, పుట్టినచోటే ఉండనిచ్చే ఆలోచన తనకు లేదని ఆయన తేల్చేశాడు. అగ్రరాజ్యాధినేత అభీష్టానికి అనుగుణంగా, ఆకలితో పూర్తిగా చావనివ్వకుండా ఉంచి, ఆయుధాలతో మిగతాపని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు ఆయన.

## యువత భవితకు ఇంటర్న్‌షిప్ ఊతం

నూట నలభై ఐదు కోట్ల పైచిలుకు జనాభాలో అలరారుతున్న దేశం మనది. వీరిలో తొంభై కోట్లకు పైగా యువత ఉన్నారు. వీరంతా ముప్ఫై ఐదు సంవత్సరాల లోపువారే. ప్రపంచంలోని ఏ ఇతర దేశానికి లేని యువ సంపద మన సొంతం. కాని, చదివిన చదువులకు తగిన పని అనుభవం కలిగినవారు ఎందరు? గణాంకాలు కలవరపాటుకు గురిచేస్తాయి. ఏళ్ళ తరబడి చదువులు చదువుతూ, స్వల్పకాలంలో పని అనుభవాన్ని సాధించగలిగే నైపుణ్యాలను వృద్ధి చేసుకోడంలో యువత ఎందుకు వెనకబడుతున్నారన్నది అందరూ ఆలోచించాలి.'జాతీయ విద్యావిధానం-2020' యువతకు ఉద్యోగ అవకాశాలను పెంచడానికి ఇంటర్న్‌షిప్‌లను వారి చదువులలో భాగం చేసింది. ఇది యువతలో ఆరోగ్యకర పోటీని పెంచటంతోపాటు, వివిధ రకాలైన ఉద్యోగ నైపుణ్యాలను పెంపొందించడానికి సహకరిస్తుంది. వివిధ వృత్తులు, ఉద్యోగాలు, పరిశోధనల్లో ఆసక్తిని పెంపొందించడానికి ఇంటర్న్‌షిప్‌లు ఎంతగానో దోహదం చేస్తాయి. జాతీయ విద్యావిధానం మూడు రకాలైన ఇంటర్న్‌షిప్‌లపై దృష్టి పెట్టాలని విద్యాలయాలకు సూచించింది. వారానికి రెండు నుంచి నాలుగు క్రెడిట్ల బోధన, అభ్యసన గంటలను ఇంటర్న్‌షిప్‌లకు కేటాయించాలని విధానపత్రం సూచిస్తోంది.ఇంటర్న్‌షిప్‌లలో మొదటిరకం వృత్తి నైపుణ్యాలను వృద్ధి చేసుకోడానికి సంబంధించినది. పరిశ్రమలు, కార్యాలయాలతో అనుసంధానమై విద్యార్థులు దీనిని పూర్తి చేయాలి. రెండవది, తాము చదువుతున్న సబ్జెక్టులో పరిశోధన నైపుణ్యాలను వృద్ధి చేసుకోడానికి సంబంధించింది. చదువుకొంటున్న విద్యాలయంలోని ఆచార్యుల పర్యవేక్షణలో ఉంటూ విద్యార్థి పరిశోధన ఇంటర్న్‌షిప్‌ను పూర్తి చేయాలి. ఇందుకోసం, ఇతర విద్యాలయాలు, పరిశోధన సంస్థలతో కూడా కలిసి పనిచేయవచ్చు. మూడవది, సమాజంతో మమేకమై పనిచేయడం. సమాజం పట్ల సానుకూలమైన దృక్పథాన్ని యువతలో పెంపొందింప చేయడానికి ఇది మేలైన మార్గం. ప్రజాప్రయోజనం కోసం పనిచేసే వ్యక్తులు, సంస్థలు, కార్యాలయాలు, ప్రభుత్వ శాఖలు... మొదలైన వాటితో కలిసి పనిచేస్తూ సమాజ చలనసూత్రాలను నేరుగా అధ్యయనం చేసే వీలు దీని ద్వారా యువతకు లభిస్తుంది. ఈ మూడు రకాలైన ఇంటర్న్‌షిప్‌లలో దేనిని ఎంచుకోవాలన్నది విద్యార్థుల అభిరుచిపై ఆధారపడి ఉంటుంది.కళలు, సాహిత్య రంగాలు, సామాజిక శాస్త్రాలు, వృత్తివిద్య, ఖచ్చిన శాస్త్రాలు వంటి అన్ని రంగాలలోను, అన్నిరకాల చదువులలోను ఇంటర్న్‌షిప్‌లను భాగం చేయాలని యూజీసీ మార్గదర్శక సూత్రాలు తెలియజేస్తున్నాయి. స్థాయికి అనుగుణంగా యువతకు ఉన్న ఉపాధి అవకాశాలను పెంచడం దీనిలో గుర్తించదగిన ఒక ప్రధానమైన అంశం. ఒక తరగతి చదివే విద్యార్థులంతా మూస పద్ధతిలో ఒకే రకమైన ఇంటర్న్‌షిప్‌ను ఎంచుకోవలసిన అవసరం లేదు. ఏఏ ఇంటర్న్‌షిప్‌లను ఎంతమంది చేయాలనుకొంటున్నారో విద్యార్థులు, ఆచార్యులు కలిసి నిర్ణయించుకోవచ్చు. డిగ్రీ పూర్తయ్యేలోపు ఇటువంటి ఇంటర్న్‌షిప్‌లలో ఏ ఒక్కటైనా పూర్తి చేయాలని విధానపత్రం నిర్దేశిస్తోంది.ఒకప్పుడు సైన్సు, ఇంజనీరింగ్, సాంకేతిక విద్యలకు సంబంధించిన కోర్సులను అభ్యసిస్తున్న విద్యార్థులు మాత్రమే ఇంటర్న్‌షిప్‌లను పూర్తి చేసేవారు. ఇప్పుడు అన్ని రకాల చదువులు చదివే విద్యార్థులు చేయదగిన అంశాలు ఇబ్బడిముబ్బడిగా అందుబాటులో ఉన్నాయి. తాము మంచి వ్యక్తులుగా ఎదగడమే కాకుండా, సమాజాన్ని వృద్ధిచేయడానికి కావలసిన నైపుణ్యాలను ఎన్నిటినో ఇంటర్న్‌షిప్‌ల ద్వారా యువత సాధించుకోవచ్చు. వీటిని అందుకోడానికి యువత తమను తాము ఎంతగా సమాయత్తం చేసుకొంటే మన సమాజాలు అంతగా వృద్ధి చెందుతాయి.ఇంతకు ముందుకాలాల్లో లేని ఎన్నో విద్యావకాశాలను జాతీయ విద్యావిధానం ఇప్పటి యువతకు అందిస్తోంది. డిగ్రీలు పూర్తయ్యేవరకు విద్యార్థులకు ఆయా విషయాల్లో పని అనుభవం లేకపోతే ఉద్యోగాల కల్పన కష్టం అవుతుంది. అందుకే ఏఐసీటీఈ వంటి సంస్థలు సాంకేతిక విద్యకు సంబంధించి నమూనా ప్రణాళికలను అందిస్తున్నాయి. వీటి ఆధారంగా ఆయా రాష్ట్రాలు తగిన కార్యాచరణను ప్రారంభిస్తున్నాయి. కృత్రిమమేధ, సైబర్ సెక్యూరిటీ, మెషిన్ లెర్నింగ్... వంటి అంశాలలో పాఠశాల స్థాయినుంచి తర్ఫీదును ఇచ్చేందుకు కొన్ని రాష్ట్రాలలో ప్రణాళికలు సిద్ధం అవుతున్నాయి. సంబంధిత సంస్థలు, పరిశ్రమలతో అవగాహన ఒప్పందాలను చేసుకొని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో చదువుకొంటున్న విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు అందించడానికి సిద్ధం అవుతున్నాయి. మరికొన్ని విద్యాసంస్థలు మరో అడుగు ముందుకేసి అంతర్జాతీయ పరిశోధన సంస్థలు, పరిశ్రమలతో ఇంటర్న్‌షిప్‌ల కోసం అవగాహన ఒప్పందాలను చేసుకొంటున్నాయి.విద్యార్థి దశలో చేసే ఇంటర్న్‌షిప్‌లు వారి మూర్తిమత్వ వికాసంలో గణనీయమైన మార్పులను తీసుకువస్తాయి. బృందంగా ఏర్పడి పనిచేయడానికి తగిన కౌశలాలను పెంచుతాయి. వ్యక్తిగతమైన బలహీనతలను అధిగమించి, సామూహికమైన బలాలను ప్రజోపయోగ్య మైన రీతిలో వాడే అవకాశం చిక్కుతుంది. తమ ప్రతిభను ఏయే రంగాలలో సానపెట్టుకోవచ్చో యువతకు అనుభవంలోకి వస్తుంది. విభిన్నమైన పని వాతావరణాలు, పని సంస్కృతులపై అవగాహన, గౌరవం పెంచుకోడానికి ఇంటర్న్‌షిప్‌లు ఎంతగానో సహకరిస్తాయి. సాధించిన నైపుణ్యంతో ఎక్కడైనా గెలవవచ్చనే ధీమా పెరుగుతుంది. మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా నవీకరణ చెందడానికి, సమతుల్యాన్ని సాధించడానికి ఇంటర్న్‌షిప్‌లు సహకరిస్తాయి.సమాజ వృద్ధికి దోహదపడే నిర్ణయాలు తీసుకోడానికి ఇంటర్న్‌షిప్‌లలో పొందే పని అనుభవం యువతకు ఎంతగానో సహకరిస్తుంది. స్పష్టమైన ఆలోచనలతో ముందుకు సాగే స్థైర్యాన్ని ఇంటర్న్‌షిప్‌లు కలిగిస్తాయి. బృందంలో కలిసి పని చేయగలగడంతోపాటు, నాయకత్వ లక్షణాలు అలవడతాయి.



## జాతకంలో కుజ దోషమా.. ఈ అంగారక ఆలయాన్ని దర్శించండి



జాతకంలో కుజ దోషమా.. వివాహం ఆలస్యం అవుతుందా.. ఈ అంగారక ఆలయాన్ని దర్శించండి.. ఎక్కడంటే తమిళనాడులో చిన్న పెద్ద ఆలయాలు వేలాదిగా ఉన్నాయి. వీటిల్లో కొన్ని ఆలయాలు ప్రపంచప్రసిద్ధిచెందినవి. అలాంటి ఆలయాల్లో ఒకటి కుజుడు ఆలయం. తిరునెల్వేలి జిల్లాలోని తామిరబరణి నది ఒడ్డున ఉన్న కొడగనల్లూర్ కైలాసనాథర్ ఆలయం. ఇది నవ గ్రహాల్లో ఒకటైన అంగారక గ్రహానికి అంకితం చేయబడిన ఆలయంగా పరిగణించబడుతుంది. ఈ ఆలయ చరిత్ర ఋషి, యువరాజు, పాముతో ముడిపడి ఉంది. జాతకంలో కుజ సమస్య ఉంటే ఈ గుడికి వెళ్లి పూజలు చేయించుకోవడం వలన ఫలితం ఉంటుంది. ఈ రోజు ఆలయం గురించి తెల్సుకుందాం..జాతకంలో కుజ దోషమా.. వివాహం ఆలస్యం అవుతుందా.. ఈ అంగారక ఆలయాన్ని దర్శించండి.. ఎక్కడంటేతమిళనాడు తిరునెల్వేలి జిల్లాలో తరగని జీవనదిలా ప్రవహించేతామిరబరణి నది ఒడ్డున నిర్మించిన దేవాలయాలలో 9 గ్రహాలను పూజిస్తారు. ఇందులో సూర్యభగవానుడి ఆలయం పాపనాశంలోని పాపనాథర్ స్వామి ఆలయం, చంద్రుని ఆలయం చేరన్ మహాదేవిలోని అమ్మనాథర్ ఆలయం ఉన్నాయి. అయితే కొడగనల్లూరులోని కైలాసనాథర్ ఆలయం తొమ్మిది గ్రహాలలో అత్యంత ముఖ్యమైన గ్రహంగా పరిగణించబడే అంగారక గ్రహానికి చెందిన ఆలయం ఉంది.. ఈ ఆలయం గురించి పురాణం కథ, ఆలయ ప్రత్యేకతలతో సహా వివిధ సమాచారాన్ని ఈ రోజు మనం తెలుసుకుందాం.. ఈ ఆలయం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4.30 నుంచి 7 గంటల వరకు భక్తుల సందర్శనార్థం తెరిచి ఉంటుంది.కుజుడి ఆలయ చరిత్ర చాలా సంవత్సరాల క్రితం ఈ ప్రాంతంలో ఒక ఋషి తపస్సు చేస్తూ ఉండేవాడట. తండ్రి తపస్సుకి ఋషి కొడుకు సహాయం చేసేవాడు. ఒక రోజు రుషి కొడకు కట్టెలు సేకరించడానికి అడవిలోకి వెళ్ళాడు. ఆ సమయంలో ఆ ప్రాంతం గుండా వెళుతున్న ఒక యువరాజు, రాజ్యాభివృద్ధి కోసం ఒక యజ్ఞం చేయాలని భావించి, తపస్సు చేస్తున్న మునిని మేల్కొలపడానికి ప్రయత్నించాడు. యజ్ఞం గురించి అడగాలని ఆశించిన యువరాజు నిరాశ చెందాడు.ఎన్ని ప్రయత్నాలు చేసినా ఆ ముని తపస్సు ను నుంచి లేవలేదు. దీంతో యువరాజుకి కోపం వచ్చి.. ఋషికి సమీపంలో చచ్చి పడి ఉన్న పామును తీసుకొచ్చి.. ఆ ముని మెడలో వేసి వెళ్ళిపోయాడు. ఇంతలో, కట్టెలు సేకరించడానికి వెళ్ళిన కొడుకు తిరిగి వచ్చి తన తండ్రి మెడలో చచ్చిన పామును చూసి చాలా ఆగ్రహించాడు. తన దివ్య దృష్టితో యువరాజు ఇలా చేశాడని తెలుసుకుని ఆ బాలుడు నేరుగా రాజభవనానికి వెళ్లి. తన తండ్రి మెడలో చచ్చిన పాముని వేసి అవమానించావు కనుక.. నీ తండ్రి పాము కాటుతో మరణిస్తాడు అని ముని బాలకుడు శపించాడు. దీని తరువాత మహారాజు జాతకాన్ని పరిశీలించిన జ్యోతిష్కులు రాజుకు సర్ప గండం ఉందని తెలియజేశారు. అప్పుడు తన తండ్రి ప్రాణాలను కాపాడుకునేందుకు యువరాజు.. మహారాజు నివసించేందుకు ఒక రాజభవనాన్ని నిర్మించాడు. పాము కాదు కదా కనీసం చీమ కూడా ఆ భవనంలో వెళ్ళలేనంతగా ఏర్పాట్లు చేశాడు. అయితే ఒకానొక సమయంలో మహా రాజు ఒక మామిడి పండు తింటున్నప్పుడు.. దానిలో దాగి ఉన్న పాము రాజును కరిచింది. అతను మరణించాడు.పాము తాను చేసిన పాపం నుంచి బయటపడాలని భావించింది. అప్పుడు పాము విష్ణువు అనుగ్రహం కోసం ధ్యానం చేసింది. అప్పుడు విష్ణువు ప్రత్యక్షం అయి ఒక పరిహారాన్ని సూచించాడు. శివుడిని పూజించడం ద్వారా మాత్రమే పాపం తొలగిపోతుందని చెప్పాడు. దీని తరువాత పాము శివుడిని పూజించి పాపం నుంచి విముక్తి పొందింది. శివుడు కైలాసం నుంచి పాము పాపాన్ని తొలగించడానికి వచ్చాడు కనుక ఈ ఆలయానికి కైలాసనాథర్ ఆలయం అని పేరు పెట్టారని పురాణం కథనం.

# మావోయిస్టు కీలక నేత కుంజాం హిడ్మా అరెస్ట్



**భువనేశ్వర్-నవభూమి:** మావోయిస్టు పార్టీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్ అయిన ఘటన మరువక ముందే.. మరో కీలక నేతను ఒడిశా పోలీసులు అరెస్టు చేశారు. ఛత్తీస్‌గఢ్ బీజాపూర్ జిల్లాలోని జనగూడకు చెందిన కుంజాం హిడ్మాను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఒడిశా పోలీసులు, డిస్ట్రిక్ట్ వాలంటరీ ఫోర్స్ బృందాలు ప్రత్యేక ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో బోయిపరిగూడ పోలీసు స్టేషన్ పరిధిలోని పెటగూడ గ్రామ సమీపంలోని అడవుల్లో హిడ్మాను పోలీసులు అరెస్టు చేశారు. ఈ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారని పక్కా సమాచారం అందడంతోనే.. పోలీసులు అక్కడ కూంబింగ్ నిర్వహించినట్లు ఉన్నతాధికారులు పేర్కొన్నారు. కూంబింగ్ నిర్వహిస్తుండగా పోలీసులకు మావోయిస్టులు తారసపడ్డారు. దీంతో మావోయిస్టులకు, పోలీసు బలగాలకు మధ్య ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. అయితే చాలా మంది మావోయిస్టులు అక్కడ్నుంచి పారిపోయారు. మావోయిస్టు కుంజాం హిడ్మా మాత్రం అక్కడున్న చెట్ల పొదల్లో తలదాచుకున్నాడు. పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత అతను హార్డ్‌కోర్ మావోయిస్టు హిడ్మా అని పోలీసుల విచారణలో తేలింది.

# పీఓకే మనదే.. అక్కడి ప్రజలూ మనవాళ్లే



**న్యూఢిల్లీ-నవభూమి:**పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ మనదే అని.. అక్కడ ఉండే ప్రజలు కూడా మన వాళ్లే అని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. భౌగోళికంగా విడిపోయినా అక్కడి ప్రజలకు.. ఇండియాతో ధృడమైన సంబంధాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఏదో ఒకరోజు వారంతా మన దేశంలో ఏకం అవుతారని.. అయితే ఆరోజు ఎంతో దూరంలో లేదని చెప్పారు. సీఐఐ బిజినెస్ సదస్సులో ఇవాళ ఆయన మాట్లాడుతూ.. ఉగ్రవాదం పట్ల భారత్ తన వ్యూహాన్ని రీడిజైన్, రీ డిఫైన్ చేసిందని స్పష్టం చేశారు. గ్రేట్ ఇండియా సంకల్పమే మా లక్ష్యం అని వివరించారు.నేడు దేశ రాజధాని ఢిల్లీలోని సీఐఐ బిజినెస్ సదస్సులో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగానే జాతిని ఉద్దేశించి మాట్లాడుతూ.. కీలక వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా పాక్ ఆక్రమిత కశ్మీర్ భారత దేశంతో భౌగోళికంగా విడిపోయినా పీఓకే ప్రజలు రాజకీయంగా ఏదో ఒకరోజు మనతో కలుస్తారని తెలిపారు. అయితే ఆరోజు ఎంతో దూరంలో లేదని.. పీఓకే దానంతట అదే ఇండియాలోకి తిరిగి వస్తుందని వ్యాఖ్యానించారు. అక్కడున్న వారికి భారత్‌తో మంచి సంబంధాలు ఉన్నాయని.. గ్రేట్ ఇండియానే మా సంకల్పం అని చెప్పుకొచ్చారు. అక్కడ కొందరు మాత్రమే తప్పుదారి పట్టారని పేర్కొన్నారు.మనకు ఏమైనా చేసే శక్తి ఉన్నప్పటికీ... సంయమనం కూడా చాలా అవసరం అని రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యానించారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా దేశ భద్రతకు మేకిన్ ఇండియా ముఖ్యం అని ప్రూవ్ అయిందన్నారు. అందుకే భారత్ తన వ్యూహాన్ని రీడిజైన్, రీ డిఫైన్ చేసిందని స్పష్టం చేశారు. అందులో భాగంగానే ఫైటర్ జెట్లు, క్షిపణి వ్యవస్థలను నిర్మించడంతో పాటు కొత్త తరం యుద్ధ సాంకేతికతల పైనా దృష్టి పెట్టామన్నారు. ముఖ్యంగా ఆపరేషన్ సిందూర్ సమయంలో ఉపయోగించిన దేశీయంగా అభివృద్ధి చెందిన వ్యవస్థలు ప్రపంచం మొత్తాన్ని ఆశ్చర్యానికి గురి చేశాయన్నారు. శత్రు కవచాన్ని దాటుకుని వెళ్లగలమని అందరికీ నిరూపించామన్నారు.పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రస్థావరాలే లక్ష్యంగా దాడులు చేసిన వీటిని ఉపయోగించగా.. మన ఆయుధాలు ఎలా ధ్వంసం చేశాయో అందరూ చూశారని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. మనం తలుచుకుంటే ఇంకా చేయగలం అని.. బలంతో పాటు నిగ్రహం, సమన్వయం కూడా పాటించాలనే ఉద్దేశంతోనే ఆగినట్లు వెల్లడించారు. అలాగే ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్ కు తన చేసిన తప్పు వల్ల భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందనేది స్పష్టంగా అర్థమైందన్నారు.

## రక్షణరంగ కాంట్రాక్టులపై ఎయిర్ చీఫ్ మార్షల్ అసంతృప్తి



ఆపరేషన్ సిందూర్ దేశ విజయం అని ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ అన్నారు. త్రివిధ దళాలు కలిసి ఈ ఆపరేషన్‌ను సమర్థవంతంగా అమలు చేసినట్లు చెప్పారు. ఈ ఆపరేషన్ విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి భారతీయుడికీ ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఇక ఇదే సమయంలో రక్షణ రంగంలోని కాంట్రాక్టులపై ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు.గురువారం దిల్లీలో జరిగిన బిజినెస్ సమ్మిట్‌లో ఏపీ సింగ్ పాల్గొని మాట్లాడారు. 'మేము సత్యమార్గాన్ని ఎంచుకున్నాం. దేవుడు కూడా ఇందులో మాకు తోడుగా ఉన్నాడని భావిస్తున్నా. అందుకే ఆపరేషన్ సిందూర్ విజయవంతంమైంది. ఇది దేశ విజయం. ఈ ఆపరేషన్‌ను త్రివిధ దళాలు పకడ్బందీగా ప్రణాళిక ప్రకారం నిర్వహించాయి. ఈ ఆపరేషన్ విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి భారతీయుడికీ నేను కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను' అని ఆయన తెలిపారు.ఇదే కార్యక్రమంలో రక్షణ రంగంలోని కాంట్రాక్టులపై కీలక వ్యాఖ్యలు చేశారు. రక్షణ రంగంలోని ప్రధాన కాంట్రాక్టులపై సంతకాలు జరుగుతాయి కానీ.. డెలివరీలు మాత్రం ఉండవని వ్యాఖ్యానించారు. ఇక్కడ టైమ్‌లైన్ ప్రధాన సమస్యగా మారిందని పేర్కొన్నారు. ఒక్క ప్రాజెక్టు కూడా సకాలంలో పూర్తైన దాఖలాలు లేవన్నారు. తేజస్ ఎంకే1 చాలా ఆలస్యమైందంటూ తన అసంతృప్తి వెలిబుచ్చారు. ఇక తేజస్ ఎంకే2 ప్రొటోటైప్ అందుబాటులోకే రాలేదన్నారు. ఇక ఆమ్కా ఫైటర్‌కు సంబంధించి ఇప్పటి వరకు నమూనా విమానం కూడా రాలేదంటూ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సాక్షాత్తు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఎదుటే ఎయిర్ చీఫ్ మార్షల్ ఈ వ్యాఖ్యలు చేశారు.

## యూట్యూబర్ భయ్యా సన్నీ యాదవ్ అరెస్ట్..!



**హైదరాబాద్-నవభూమి:** యూట్యూబర్ భయ్యా సన్నీ యాదవ్‌ను నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ( అధికారులు అరెస్టు చేశారు. ఇటీవల బైక్‌పై పాకిస్తాన్ టూర్‌కు వెళ్లిన సన్నీ యాదవ్‌ను చెన్నై విమానాశ్రయంలో ఎన్ఐఏ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. పాకిస్తాన్ టూర్ వివరాలను ఎన్ఐఏ అధికారులు సేకరిస్తున్నారు.బెట్టింగ్ యాప్ ప్రమోషన్ల కేసులో యూ ట్యూబ్ ఇన్‌ఫ్లూయెన్సర్, అంతర్జాతీయ బైక్ రైడర్ బయ్యా సన్నీ యాదవ్‌పై సూర్యాపేట జిల్లా పోలీసులు లుక్‌ఔట్ సర్క్యులర్ జారీ చేసిన సంగతి తెలిసిందే. బెట్టింగ్ యాప్ ప్రమోషన్ల విషయంలో ఈ ఏడాది మార్చి 5న సూర్యాపేట జిల్లా నూతనకల్ పోలీసు స్టేషన్‌లో సన్నీ యాదవ్‌పై కేసు నమోదైంది.విచారణలో భాగంగా సన్నీ యాదవ్ విదేశాల్లో ఉన్నట్లు నాడు పోలీసులు గుర్తించారు. సన్నీ యాదవ్ వాఘా సరిహద్దు గుండా పాకిస్తాన్ దేశంలోకి వెళ్లినట్లు పోలీసులు అనుమానించారు. పాకిస్తాన్ బైక్ టూర్‌ను పూర్తి చేసినట్లు ఇటీవల సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన సన్నీ యాదవ్ తిరిగి ఇండియాకు రాగా, చెన్నై ఎయిర్‌పోర్టులో పోలీసులు ఆయనను అరెస్టు చేశారు.

## అమర్‌నాథ్ యాత్రకు భారీ బందోబస్తు..

### 42 వేల మంది భద్రతా సిబ్బంది మోహరింపు



**న్యూఢిల్లీ-నవభూమి:** అమర్‌నాథ్ యాత్ర(కు సమయం ఆసన్నమైంది. జూలై 3వ తేదీ నుంచి ఆగస్టు 9వ తేదీ వరకు ఆ యాత్ర జరగనున్నది. ఈ నేపథ్యంలో జమ్మూకశ్మీర్‌లో భారీ భద్రతను ఏర్పాటు చేస్తున్నారు. ఈ మేరకు కేంద్ర హోంశాఖ నిర్ణయం తీసుకున్నది. కేంద్ర సాయుధ పోలీసు దళాలకు(సీఏపీఎఫ్) చెందిన సుమారు 580 కంపెనీల సిబ్బందిని మోహరించనున్నారు. అంటే సుమారు 42 వేల మంది భద్రతా సిబ్బంది అమర్‌నాథ్ రూట్లో విధులను నిర్వర్తించనున్నారు.ఇప్పటికే 424 కంపెనీల బలగాలను కేంద్ర పాలిత ప్రాంతానికి పంపించారు. ఇక మిగితా 80 కంపెనీల దళాలు ఆపరేషన్ సింధూర్ సమయంలో అక్కడకు పంపారు. వాళ్లను కూడా వివిధ లొకేషన్లకు మార్చుతున్నట్లు చెప్పారు. అమర్‌నాథ్ యాత్రికులకు పూర్తి స్థాయి రక్షణ కల్పిస్తున్నట్లు కేంద్ర బలగాలు పేర్కొన్నాయి. తక్షణమే కేంద్ర బలగాలు జమ్మూకశ్మీర్‌లో పొజిషన్ తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసినట్లు కేంద్ర హోంశాఖ అధికారులు తెలిపారు. ఏప్రిల్ 22న జరిగిన పెహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో భద్రతను పటిష్టం చేస్తున్నారు.సీఏపీఎఫ్‌కు చెందిన అయిదు కంపెనీల్లో సీఆర్పీఎఫ్, బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్, ఐటీబీపీ, ఎస్ఎస్బీ ఉన్నాయి. గురువారం జమ్మూ విజిట్ సమయంలో భద్రతాను కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా సమీక్షించనున్నారు. సీఆర్పీఎఫ్ డైరెక్టర్ జనరల్ జ్ఞానేంద్ర ప్రతాప్ ఇప్పటికే అమర్‌నాథ్ యాత్రపై సమీక్ష నిర్వహించారు. బీఎస్ఎఫ్ డీజీ దల్జిత్ సింగ్ చౌదరీ కూడా త్వరలో సమీక్ష నిర్వహించనున్నారు.అమర్‌నాథ్ యాత్రకు రెండు మార్గాల్లో వెళ్తారు. అనంత్‌నాగ్ జిల్లాలోని పెహల్గామ్ దారి 48 కిలోమీటర్లు ఉంటుంది. ఇక గందేర్‌బల్ జిల్లాలోని బల్తాల్ రూట్‌లో 14 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి ఉంటుంది.

## మత ఘర్షణలను ఎదుర్కొనేందుకు ప్రత్యేక దళాన్ని ఏర్పాటు చేసిన కర్నాటక సర్కారు

**బెంగుళూరు-నవభూమి:** కర్నాటక సర్కారు కొత్త ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రంలో జరిగే మత ఘర్షణలను ఎదుర్కొనేందుకు కొత్త దళాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పింది. మూడు కంపెనీలతో ఆ దళం ఉంటుందని పేర్కొన్నది. దక్షిణ కన్నడ, శివమొగ్గం, ఉడిపి జిల్లాల్లో ఆ స్పెషల్ యాక్షన్ ఫోర్స్ .. మతఘర్షణ వివాదాలపై దృష్టి పెట్టనున్నది. దీనికి సంబంధించిన ఆదేశాలను మే 28వ తేదీన రిలీజ్ చేశారు. ఆ ఆదేశాల ప్రకారం ఆ దళంలో 248 మంది ఆఫీసర్లు ఉంటారు. సీనియర్ డీఐజీపీ కూడా దీంట్లో ఉంటారు.యాంటీ నక్సల్ ఫోర్స్ నుంచి 248 మందిని తీసుకోనున్నారు. మతపరమైన ఘర్షణలు, ప్రేరేపిత ఘటనలు, విద్వేష ప్రసంగాలకు సంబంధించిన ఇంటెలిజెన్స్ సమాచారాన్ని సేకరించడం ఆ స్పెషల్ యాక్షన్ ఫోర్స్ తొలి ప్రాధాన్యత అవుతుంది. రాష్ట్రంలో శాంతి, సామరస్యం ఏర్పడడానికి కమ్యూనిటీ నేతలతో చర్చలు నిర్వహించాలని ఆదేశించినట్లు హోంశాఖ మంత్రి జీ పరమేశ్వర తెలిపారు.

## కన్నబిడ్డ కోసం కాటికెళ్లేందుకు సిద్ధమైన వృద్ధురాలు



**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రతీ తల్లి తన బిడ్డల కోసం ఏమైనా చేస్తుంది. ఎంత కష్టమైనా పడుతూ వారికి మంచి జీవితాలను ఇవ్వాలనుకుంటుంది. అందుకోసం రాత్రి, పగలూ తేడా లేకుండా పని చేస్తుం టుంది. ఇక బిడ్డలకు ఏమైనా అవుతుందని తెలిస్తే.. తన ప్రాణాలను ఫణంగా పెట్టైనా సరే వారి ప్రాణాలును కాపాడుకునేం దుకు ప్రయత్నిస్తుంటుంది. ఇదంతా మనకు తెలిసిందే. సినిమాలతో పాటు నిజ జీవితంలోనూ ఇలాంటి ఎన్నో కథనలను మనం ఇప్పటి వరకు చూశాం. అచ్చంగా అలాంటో మరో కథే ఇప్పుడు వెలుగులోకి వచ్చింది. ముఖ్యంగా కన్నబిడ్డ ప్రాణాలు కాపాడేందుకు కాటికి కాళ్లు చాపిన వృద్ధురాలు సైతం యోధురాలిగా మారి తన కిడ్నీని దానం చేసింది. 85 ఏళ్ల తల్లి తన 50 ఏళ్ల కుమార్తె కోసం ప్రాణాలకు తెగించి కిడ్నీ దానం చేయగా.. అంతా షాక్ అవుతున్నారు.రాజస్థాన్ జైపూర్‌లోని 85 ఏళ్ల బుధో దేవికి.. 50 ఏళ్ల కుమార్తె గుడ్డీ దేవి ఉంది. అయితే గుడ్డీ దేవికి చాలా ఏళ్లుగా ఆరోగ్యం బాగాలేదు. ముఖ్యంగా ఆమెకు కిడ్నీలు పాడు కాగా.. కొన్ని నెలలుగా డయాలసిస్ చేయించుకుంటుంది. అయితే ఇంతకాలం బాగానే ఉన్నప్పటికీ ఈమధ్య ఆరోగ్యం మరింత క్షీణించింది. దీంతో గుడ్డీ దేవి %హామీ% వైద్య కళాశాల ఆస్పత్రికి వెళ్లగా.. పరీక్షించిన వైద్యులు ఆమెకు రెండు కిడ్నీలు మార్చాల్సిందేనని చెప్పారు. దీంతో గుడ్డీ దేవి కుటుంబ సభ్యులు దాతల కోసం విపరీతంగా వెతికారు. కానీ రోజురోజుకూ పరిస్థితి మరింత క్షీణిస్తుండగా.. దాతల మాత్రం దొరకలేదు.దీంతో గుడ్డీ దేవి తల్లి 85 ఏళ్ల బుధో దేవి.. కుమార్తెకు తన కిడ్నీని ఇస్తానని చెప్పింది. ఇంత వయసు ఉన్న వారు ఇవ్వకూడదన్నా.. నా ప్రాణాలు పోయినా సరే బిడ్డను కాపాడుకుంటానని పట్టుబట్టింది. దీంతో కుటుంబ సభ్యులు బుధో దేవిని ఆస్పత్రికి తీసుకు వెళ్లారు. ఇదే విషయాన్ని వైద్యులకు చెప్పగా.. ఆమెను పరీక్షించారు. రిస్క్ ఎక్కువగానే ఉన్నప్పటికీ.. బుధో దేవి చాలా ఆరోగ్యంగా ఉండగా శస్త్ర చికిత్స చేసేందుకు వైద్యులు ఒప్పుకున్నారు. ఈక్రమంలోనే బుధో దేవి కిడ్నీని తీసి గుడ్డీ దేవికి అమర్చారు. అయితే వయసు ఎక్కువ ఉండడంతో.. ఏవైనా ఇబ్బందులు వస్తాయేమోనని రెండు, మూడు రోజులు అబ్జర్వేషన్‌లో పెట్టారు. ఇద్దరూ పూర్తిగా కోలుకున్న తర్వాత డిశ్చార్జ్ చేశారు.అయితే దీనిపై కళాశాల వైద్యులు మాట్లాడుతూ.. సాధారణంగా 60 నుంచి 65 ఏళ్ల వారే కిడ్నీ దానం చేయడాన్ని అత్యంత రిస్క్‌గా భావిస్తామని అన్నారు. కానీ 85 ఏళ్ల వయసు కల్గిన బుధో దేవి.. తన కుమార్తెను కాపాడుకోవడం కోసం ముందుకు రావడం స్ఫూర్తిదాయకం అన్నారు. ప్రతీ తల్లి.. తన బిడ్డల కోసం ఇలా ఏమైనా చేయగల్గుతారన్నారు. ముఖ్యంగా బుధే దేవి ఆరోగ్య పరంగానే కాకుండా మానసికంగా కూడా చాలా ఆరోగ్యంగా ఉందని.. అందుకే శస్త్ర చికిత్స విజయవంతం అయిందని డాక్టర్ ధనుంజయ్ అగర్వాల్ వెల్లడించారు.

## పాక్ నేతలతో కలిసి ర్యాలీలో పాల్గొన్న పహల్గాం ఉగ్రదాడి మాస్టర్ మైండ్



**పాక్-నవభూమి:**పహల్గాం ఉగ్రదాడి వెనుక మాస్టర్ మైండ్‌గా భావిస్తున్న లష్కరే తోయిబా కమాండర్ సైఫుల్లా కసూరి పాక్‌లో ప్రత్యక్షమయ్యారు. తాజాగా అక్కడ చేపట్టిన ఓ ర్యాలీలో పాక్ రాజకీయ నాయకులు, ఇతర వాంటెడ్ ఉగ్రవాదులతో కలిసి కనిపించారు.దేశ అణు పరీక్షల వార్షికోత్సవం సందర్భంగా పాకిస్థాన్ మర్కాజీ ముస్లిం లీగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో అతడు పాల్గొని ప్రసంగించాడు. ఇందుకు సంబంధించిన వీడియో తాజాగా బయటకు వచ్చింది. ర్యాలీలో సైఫుల్లా కసూర్ మాట్లాడుతూ.. 'పహల్గాం ఉగ్రదాడిలో నన్ను ప్రధాన సూత్రధారిగా పేర్కొంటున్నారు. ఇప్పుడు నా పేరు ప్రపంచ వ్యాప్తంగా మార్మోగిపోతోంది' అంటూ వ్యాఖ్యానించారు. కొన్ని నిమిషాల పాటు ప్రసంగించిన సైఫుల్లా భారత వ్యతిరేక నినాదాలు చేశాడు. ఇదే ర్యాలీలో లష్కరే తోయిబా వ్యవస్థాపకుడు హఫీజ్ సయీద్ కుమారుడు మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది తల్హా సయీద్ కూడా పాల్గొన్నాడు. అతడు కూడా భారత వ్యతిరేకతను పెంచేలా ప్రసంగించాడు. ఈ మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్టులు అక్కడి రాజకీయ నేతలతో వేదికను పంచుకోవడం ప్రస్తుతం చర్చనీయాంశమవుతోంది.గత నెల 22న జమ్ము కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడి జరిగిన విషయం తెలిసిందే. మినీ స్విట్జర్లాండ్‌గా పేరొందిన బైసరన్ ప్రాంతంలో ప్రకృతి అందాలను ఆస్వాదిస్తున్న పర్యాటకులపై అడవిలో నుంచి హఠాత్తుగా ప్రత్యక్షమైన ఉగ్రవాదులు విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. మహిళలు, పిల్లలను వదిలిపెట్టి కంటికి కనిపించిన పురుషులను కాల్చుకుంటూ పోయారు. ఈ దాడిలో సుమారు 26 మంది ప్రాణాలు కోల్పోయారు. ముగ్గురు, నలుగురు ఉగ్రవాదులు ఈ ఘాతుకానికి పాల్పడినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.ఈ ఉగ్రదాడి వెనుక పాకిస్థాన్‌కు చెందిన నిషేధిత ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబా టాప్ కమాండర్ హస్తం ఉన్నట్లు తెలిసింది. ఈ మారణహోమానికి ప్రధాన సూత్రధారిగా సైఫుల్లా కసూరి అలియాస్ ఖలీదే అని నిఘా వర్గాలు గుర్తించాయి. ఉగ్రదాడికి అతడే ప్లాన్ చేసినట్లు సమాచారం. పాక్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌కు చెందిన ఖలీద్‌ను కరుడుగట్టిన ఉగ్రవాదిగా ఎన్ఐఏ పేర్కొంటోంది. ప్రస్తుతం అతడు ఇస్లామాబాద్ కేంద్రంగా ఉగ్రకార్యకలాపాలు చేపడుతున్నట్లు సమాచారం. ఐఎస్ఐ, పాక్ ఆర్మీతో ఇతడికి సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు సమాచారం. ఖలీద్‌తోపాటు ఈ దాడికి ప్లాన్ చేసిన వారిలో పీవోకేకి చెందిన ఇద్దరు వ్యక్తులు హస్తం ఉందని నిఘా సంస్థలు గుర్తించినట్లు ఇప్పటికే వార్తలు వచ్చాయి.

## రేప్ కేసులో సుప్రీం సంచలనం



**న్యూఢిల్లీ-నవభూమి:**అత్యాచారం కేసులో అరెస్ట్ అయిన 23 ఏళ్ల సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు చేస్తూ.. సుప్రీం కోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ముఖ్యంగా 9 నెలలుగా నిందితుడు జైల్లో ఉన్నప్పటికీ అభియోగాలు నమోదు చేయకపోవడాన్ని జస్టిస్ బి.వి నాగరత్న, జస్టిస్ సతీశ్ చంద్ర ధర్మాసనం తీవ్రంగా పరిగణించింది. బాధితురాలు 40 ఏళ్ల వివాహిత అని గుర్తు చేస్తూనే.. ఆమేమీ చిన్న పిల్ల కాదని, ఒంటి చేత్తో చప్పట్లు కొట్టలేరని వ్యాఖ్యానించింది. అంటే ఈ కేసులో ఆమె తప్పు కూడా ఉందని, కావాలనే బాధితురాలు నిందితుడి వెంట వెళ్లిందని చెప్పుకొచ్చింది.

**అసలీ కేసు ఏమిటంటే?**

40 ఏళ్ల వయసు కల్గిన ఓ మహిళ దుస్తుల వ్యాపారం చేస్తోంది. అయితే సోషల్ మీడియా ద్వారా తన వ్యాపారాన్ని విస్తరించుకోవడానికి 2021లో ఓ ఇన్‌ఫ్లూయెన్సర్‌ను కలిసింది. వ్యాపార ప్రకటన చేయమని అతడిని కోరగా.. ఐఫోన్ కనిస్తే చేస్తానని చెప్పాడు. దీంతో ఆమె అతడికి ఐఫోన్ కొనిచ్చింది. కానీ అతడు దీన్ని అమ్మాలని చూడగా ఇద్దరి మధ్య గొడవ జరిగింది. అయితే ఫోన్ అమ్మగా వచ్చిన డబ్బులు అన్నీ ఆమెకే ఇచ్చేసి.. రూ.20 వేలు మాత్రం అతడు ఉంచుకున్నాడు. డబ్బులు ఇచ్చే నెపంతో జమ్మూ నుంచి నోయిడాలోని ఆమె ఇంటికి వచ్చాడు. ఆ తర్వాత వీరిద్దరూ కలిసి వ్యాపార సంబంధ వీడియోల చిత్రీకరణ కోసం జమ్మూలోని అనేక ప్రదేశాల్లో తిరిగారు.

ఈక్రమంలోనే అతడు ఆమెకు మత్తు కలిపిన మిఠాయిలు తినిపించి తనపై అత్యాచారానికి పాల్పడ్డట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ముఖ్యంగా ఆ సమయంలో తన నగ్న చిత్రాలు తీసుకుని రెండున్నరేళ్లపాటు వేధింపులకు గురి చేసినట్లు పేర్కొంది. అలాగే అనేక మార్లు బెదిరించి డబ్బులు కూడా గుంజాడని ఫిర్యాదులో తెలిపింది. దీంతో పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు. అయితే ఇతడు అరెస్ట్ అయి 9 నెలల కావస్తున్నా బాధితురాలు అభియోగాలు నమోదు చేయలేదు. దీంతో నిందితుడు బెయిల్ ఇవ్వాలంటూ సుప్రీం కోర్టును ఆశ్రయించగా.. న్యాయస్థానం విచారణ చేపట్టింది.ఈక్రమంలోనే బాధితురాలిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. నిందితుడికి మధ్యంతర బెయిల్ మంజూరు చేస్తూ.. జస్టిస్ బి.వి నాగరత్న, జస్టిస్ సతీశ్ చంద్ర ధర్మాసనం ప్రశ్నించింది. బాధితురాలు 40 ఏళ్ల వివాహిత అని చెబుతూనే.. ఆమేమీ చిన్న పిల్ల కాదని వ్యాఖ్యానించింది. ఒంటి చేత్తో చప్పట్లు కొట్టలేరని.. మహిళ కావాలనే యువకుడితో వెళ్లిందని చెప్పింది. ఇద్దరూ కలిసే జమ్మూకు 7 సార్లు వెళ్లారని.. ఇందుకు మహిళ భర్త కూడా అభ్యంతరం తెలపలేదని వ్యాఖ్యానించింది. ఇలాంటప్పుడు ఏ ఆధారాలతో యువకుడిపై ఐపీసీ సెక్షన్ 376 కింద కేసు పెట్టారని ఢిల్లీ పోలీసులను ప్రశ్నించింది. అలాగే నిందితుడిని ట్రయల్ కోర్టులో ప్రవేశ పెట్టి, నిబంధనలకు లోబడి మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని ఆదేశాలు జారీ చేసింది.

అంతేకాకుండా నిందితుడు బెయిల్‌పై విడుదల అయిన తర్వాత మళ్లీ బాధితురాలిని కలవకూడదని షరతులు పెట్టింది. బెయిల్ షరతులను ఉల్లంఘిస్తే మళ్లీ అరెస్ట్ చేయాల్సి వస్తుందని.. కాబట్టి నిందితుడు జాగ్రత్తగా నడుచుకోవాలని సూచించింది. అత్యాచార కేసులో అత్యున్నత న్యాయస్థానం ఇలాంటి తీర్పును ఇవ్వగా.. దేశవ్యాప్తంగా చర్చకు దారి తీసింది.

## ఎంపీలు తిరుగుతున్నారు.. ఉగ్రవాదులు కూడా: జైరాం రమేశ్ వివాదాస్పద వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ-నవభూమి:** కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. పెహల్గామ్‌లో దాడికి పాల్పడిన ఉగ్రవాదులు అక్కడ, ఇక్కడ ఫ్రీగా తిరుగుతున్నారని, అలాగే పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్న మన ఎంపీల బృందం కూడా ప్రపంచ దేశాలు తిరుగుతున్నట్లు ఆయన ఆరోపించారు. పెహల్గామ్ ఉగ్రదాడికి పాల్పడిన ఉగ్రవాదులు మరో నాలుగు దాడుల్లో పాల్గొన్నట్లు చెప్పారు. కానీ వాళ్లు స్వేచ్ఛగా తిరుగుతున్నట్లు తెలిపారు. ఏఎన్ఐ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ ఈ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. మన ఎంపీలు, ఉగ్రవాదులు కూడా స్వేచ్ఛగా తిరుగుతున్నట్లు ఆరోపించారు.కాంగ్రెస్ వేసిన ప్రశ్నలకు బీజేపీ సమాధానం ఇవ్వడం లేదని ఆయన పేర్కొన్నారు. బీజేపీ కేవలం తమ పార్టీని మాత్రమే టార్గెట్ చేస్తున్నదన్నారు. ఉగ్రవాదులను ఆ పార్టీ టార్గెట్ చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీపై అటాక్ చేయడం కాదు, ఉగ్రవాదులను అంతం చేయాలన్నారు. పాకిస్థాన్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. ఉగ్రవాదులను అరెస్టు చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీపై మిస్సైళ్లను వదులుతున్నారని జైరాం రమేశ్ ఆరోపించారు.


## ఆశ్రమానికి ఆర్మీ చీఫ్



**న్యూఢిల్లీ-నవభూమి:**భారత సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది బుధవారం మధ్యప్రదేశ్‌లోని చిత్రకూట్‌లో ఉన్న ఆధ్యాత్మిక గురువు జగద్గురు రాంభద్రాచార్య ఆశ్రమాన్ని సందర్శించి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా గురుదక్షిణ కింద పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌ను స్వాధీనం చేసుకోవాలని ఆర్మీ చీఫ్‌ను రాంభద్రాచార్య, ని కోరారు. జనరల్ ఉపేంద్ర ద్వివేది ఆశ్రమ సందర్శన సమయంలో జగద్గురు రాంభద్రాచార్య మాట్లాడుతూ., లంకలో ఉన్న రావణుని నివాసానికి వెళ్లే ముందు హనుమంతుడికి ఇచ్చిన 'రామనామ దీక్ష'నే తామూ స్వీకరించామని తెలిపారు. అనంతరం ఇద్దరి మధ్య ఆధ్యాత్మిక చర్చ జరిగింది. అలాగే సైన్యాధిపతి అక్కడ ఉన్న సన్యాసులతో, వారి శిష్యులతో కూడా మాట్లాడారు.జగద్గురు రాంభద్రాచార్య ప్రముఖ ఆధ్యాత్మిక గురువు, సంస్కృత పండితుడు, తత్వవేత్త. ఆయన అనేక గ్రంథాలు రచించారు. చిన్నతనంలోనే దృష్టిని కోల్పోయినా కానీ విజ్ఞానపరంగా అద్భుత ప్రతిభావంతులు. దివ్య జ్ఞానంతో శాస్త్రాలు, తత్వాలు, వేదాలు, ఉపనిషత్తులు, రామాయణంపై విస్తృతంగా రచనలు చేశారు. ఆయన స్థాపించిన తులసీపీఠం ఆశ్రమం విద్య, సంస్కృతి, సేవా కార్యకలాపాలకు కేంద్రంగా ఉంది. దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా విద్యా సేవలను అందించే సంస్థలు ఆయన ఆధ్వర్యంలో నడుస్తున్నాయి. ఆయన సేవలకు భారత ప్రభుత్వం పద్మవిభూషణ్ పురస్కారంతో 2015లో సత్కరించింది.ఏప్రిల్ 22న పహల్గామ్ ఉగ్రదాడిలో 26 మంది మరణాలకు ప్రతిస్పందనగా భారత్ మే 7న 'ఆపరేషన్ సింధూర్' చేపట్టి పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసింది. ఈ దాడులతో రగిలిపోయిన దాయాది.. భారత్ సైనిక స్థావరాలు, సామాన్య పౌరులను టార్గెట్ చేసుకుని దాడులకు యత్నించింది. దీంతో నాలుగు రోజుల పాటు భారత్ - పాక్ సరిహద్దులో కాల్పుల కొనసాగాయి. చివరకు మే 10న కాల్పుల విరమణకు ఇరు దేశాలూ అంగీకరించారు. ప్రస్తుతం సరిహద్దులో పరిస్థితి కొంత కుదుటపడినా... అధికారిక వర్గాలు 'ఆపరేషన్ సింధూర్ ఇంకా కొనసాగుతోంది' అని స్పష్టం చేశాయి. ఈ నేపథ్యంలో మరోసారి పాక్ ఆక్రమిత కశ్మీర్ విలీనంపై జోరుగా చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో ఆధ్యాత్మిక గురువు తనకు గురుదక్షిణగా పీఓకేను కోరడం ప్రాధాన్యత సంతరించుకుంది.ఇటీవల పలు సందర్భాల్లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజనాథ్ సింగ్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోవల్ వంటి కీలక నేతలు పీఓకే భారత్‌కు చెందిందేనని, అది తిరిగి మన ఆధీనంలోకి రావాలనే స్పష్టమైన వ్యాఖ్యలు చేశారు. పార్లమెంటులో 1994లో ఆమోదించిన తీర్మానంలో కూడా ఇదే ఉద్దేశ్యం వ్యక్తమైంది. పీఓకే ప్రజలు సైతం తమను భారత్‌లో కలపాలని ఆందోళనలు, నిరసనలు కొన్ని రోజులుగా సాగిస్తున్నారు. ఆపరేషన్ సిందూర్ అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ జాతినుద్దేశించి ప్రసంగిస్తూ.. పాక్‌తో చర్చలు అంటూ జరిగితే పీఓకే విలీనం, ఉగ్రవాదంపై మాత్రమే అని స్పష్టం చేశారు.

## రెండు బస్సులు ఢీ.. ఇద్దరు మృతి.. అనేక మందికి గాయాలు

**లాతూర్-నవభూమి:**మహారాష్ట్రలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రైవేట్ ట్రావెల్స్‌కు చెందిన రెండు బస్సులు బలంగా ఢీ కొన్నాయి ఈ ఘటనలో ఇద్దరు ప్రయాణికులు మృతి చెందగా.. పదుల సంఖ్యలో గాయాలపాలయ్యారు. ఈ ఘటన లాతూర్-సోలాపూర్ హైవేపై గురువారం ఉదయం చోటు చేసుకుంది.వివరాల్లోకి వెళితే.. తుల్జాపూర్-లాతూర్ మార్గంలోని ఆశివ్ ఫాటా సమీపంలో రెండు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు ఢీ కొన్నాయి. పూణె నుంచి లాతూర్‌కు వెళుతున్న టూరిస్ట్ బస్సు అదే మార్గంలో వెళ్తున్న బస్సును వెనుక నుంచి బలంగా ఢీ కొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదం తీవ్రంగా ఉండటంతో ఇద్దరు ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారు. సుమారు 20 మంది వరకూ గాయాలపాలయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ఐదు అంబులెన్సుల్లో గాయపడిన వారిని చికిత్స నిమిత్తం లాతూర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



## పాక్ ఐఎస్ఐకు స్పైగా వ్యవహరిస్తోన్న మరో వ్యక్తి అరెస్ట్




**న్యూఢిల్లీ-నవభూమి:**పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ భారత్‌లో చేస్తున్న గూఢచర్యం తవ్వేకొద్దీ బయటకొస్తోంది. భారత్‌లో వినాశకర వాతావరణం సృష్టించడమే లక్ష్యంగా భారత పౌరులనే టార్గెట్ చేసుకుని పెద్ద నెట్ వర్క్ నడుపుతోంది సంస్థ. భారత పౌరులకు రకరకాల ఆశలు చూపి తన దారిలోకి తెచ్చుకుని భారత రహస్యాలు చేజిక్కించుకుంటోంది. ఇటీవల కాలంలో ఇలా పాక్ వలలో చిక్కుకున్న వాళ్లు చాలా మందే బయటకొస్తున్నారు. తాజాగా రాజస్థాన్‌కు చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగి పాకిస్థాన్ కోసం స్పై కార్యకలాపాలు చేసినట్టు తెలుస్తోంది. రాజస్థాన్ స్టేట్ ఎంప్లాయ్‌మెంట్ ఆఫీస్‌లో పనిచేసే సకూర్ ఖాన్ మగళియార్‌ను సీఐడీ, ఇంటెలిజెన్స్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఇతను గత రాష్ట్ర ప్రభుత్వంలో ఒక మంత్రికి పర్సనల్ సెక్రటరీగానూ వ్యవహరించినట్టు సమాచారం. అయితే, దర్యాప్తు వర్గాలు మాత్రం రాజకీయ లింక్‌లపై ఎలాంటి వ్యాఖ్యలు ఇప్పటివరకూ చేయలేదు. పాక్ సరిహద్దుల్లోని జైసల్మేర్ జిల్లా బరోడా గ్రామం ఇతడి స్వస్థలం. సదరు మాజీ మంత్రిదీ ఇదే గ్రామం.కాగా, సకూర్‌ఖాన్ వ్యవహారాలపై అనుమానం వచ్చిన దర్యాప్తు సంస్థలు గత కొన్ని వారాలుగా నిఘా పెట్టాయి. ఖాన్ మొబైల్‌లో పలు పాకిస్థానీ ఫోన్ నంబర్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. పాక్‌ను దాదాపు ఏడుసార్లు సందర్శించినట్లు అతడు ఒప్పుకున్నాడు. ఇప్పటివరకు అతడి ఫోన్‌లో ఎటువంటి మిలిటరీ సమాచారం లేదని అధికారులు చెప్పారు. అయితే, అతను కొన్ని ఫైల్స్‌ను డిలీట్ చేసినట్లు గుర్తించారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
5 హైదరాబాద్ శుక్రవారం 30 । మే । 2025

## పాక్‌కు గూఢచర్యం.. కాంగ్రెస్ నేత మాజీ పీఏ అరెస్ట్



**న్యూఢిల్లీ-నవభూమి:**పాక్ కోసం గూఢచర్యం వ్యవహారం ప్రస్తుతం దేశ వ్యాప్తంగా సంచలనం రేపుతోంది. ఈ వ్యవహారంలో ఇప్పటికే పలువురు భారతీయులు అరెస్టైన విషయం తెలిసిందే. తాజాగా గూఢచర్యం అరోపణలతో కాంగ్రెస్ నేత వద్ద పనిచేసిన మాజీ పీఏని దర్యాప్తు అధికారులు అరెస్ట్ చేశారు.రాజస్థాన్ రాష్ట్ర ఉపాధి కార్యాలయంలో పనిచేస్తున్న సకూర్ ఖాన్ మగళియార్ ను సీఐడీ, ఇంటెలిజెన్స్ అధికారులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. అతడిది పాక్ సరిహద్దుల్లోని జైసల్మేర్ జిల్లా బరోడా గ్రామం. పాకిస్థాన్ నిఘా సంస్థ ఐఎస్ఐకి ఆయన కీలక సమాచారం చేరవేస్తున్నారన్నది ప్రధాన ఆరోపణ. ఆయన ఇటీవలే ఆరు నుంచి ఏడుసార్లు పాక్‌కు వెళ్లి వచ్చినట్లు కూడా అధికారులు గుర్తించారు.పాకిస్థాన్ రాయబార కార్యాలయ అధికారితో, పాక్ ఇంటర్-సర్వీసెస్ ఇంటెలిజెన్స్ (ఐఎస్ఐ)తో అతనికి సంబంధాలు ఉన్నాయని అధికారులకు సమాచారం అందింది. దీంతో నిఘా సంస్థలు కొంతకాలంగా అతనిని గమనిస్తున్నాయి. 'సకూర్ అనుమానాస్పద కార్యకలాపాల గురించి ఉన్నత స్థాయి నుంచి మాకు సమాచారం అందింది. ఆ సమాచారాన్ని నిర్ధారించుకుని, ప్రశ్నించేందుకే అతడిని అరెస్ట్ చేశాం' అని ఎస్పీ సుధీర్ చౌధ్రీ మీడియాకు తెలిపారు. కాగా, సకూర్ ఖాన్ గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో మాజీ మంత్రి అయిన షేల్ మొహమ్మద్‌కు వ్యక్తిగత సహాయకుడిగా పనిచేశాడు. మొహమ్మద్, ఖాన్ ఒకే గ్రామానికి చెందినవారు. దీంతో ఈ వ్యవహారం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

## ధారావి రీడెవలప్‌మెంట్ మాస్టర్ ప్లాన్‌కు మహాసర్కారు ఆమోదం



**ముంబై- నవభూమి:** ఆసియాలోని అతిపెద్ద మురికివాడ ముంబైలోని ధారావిని ఆధునీకరించేందుకు మాస్టర్ ప్లాన్‌ను మహారాష్ట్ర సర్కారు ఆమోదించింది. ధారావి పరిరక్షణ, సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ఆ ప్రణాళిక అమలు చేయనున్నారు. రీడెవలప్మెంట్ ప్రక్రియ నేపథ్యంలో ధారావి సామాజిక, సాంస్కృతిక గుర్తింపునకు ఎటువంటి నష్టం ఉండదని ప్రభుత్వం చెప్పింది. ధారావి పునర్ నిర్మాణం ప్రాజెక్టును నవభారత్ మెగా డెవలపర్స్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థకు అప్పగించారు. సీఎం ఫడ్నవీస్ నేతృత్వంలో జరిగిన మీటింగ్‌లో ఈ ప్లాన్‌కు అప్రూవల్ చేశారు. అర్బన్ డెవలప్మెంట్ శాఖ మంత్రి ఏకనాథ్ షిండేతో పాటు ధారావి రీడెవలప్మెంట్ ప్రాజెక్టు సీఈవో ఎస్వీఆర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.


యూపీలో ఎన్‌కౌంటర్.. షార్ప్‌షూటర్ కాల్చివేత %జుఅఎశీబత్‌వతీ%: లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌కు చెందిన షార్ప్‌షూటర్ నవీన్ కుమార్ ఇవాళ ఎన్‌కౌంటర్ అయ్యాడు. ఉత్తరప్రదేశ్‌లోని హాపుర్ కొత్వాలి ఏరియాలో ఆ ఎన్‌కౌంటర్ జరిగింది. యూపీ పోలీసు శాఖకు చెందిన స్పెషల్ టాస్క్ ఫోర్స్, ఢిల్లీ పోలీసులు ఆ ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్నారు.

## యూపీలో ఎన్‌కౌంటర్.. షార్ప్‌షూటర్ కాల్చివేత




**న్యూఢిల్లీ-నవభూమి:** లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌కు చెందిన షార్ప్‌షూటర్ ఇవాళ ఎన్‌కౌంటర్( అయ్యాడు. ఉత్తరప్రదేశ్‌లోని హాపుర్ కొత్వాలి ఏరియాలో ఆ ఎన్‌కౌంటర్ జరిగింది. యూపీ పోలీసు శాఖకు చెందిన స్పెషల్ టాస్క్ ఫోర్స్, ఢిల్లీ పోలీసులు ఆ ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్నారు. షార్ప్‌షూటర్ నవీన్ కుమార్‌పై పలు కేసులు ఉన్నాయి. అతనిపై మర్డర్ కేసులు కూడా ఉన్నాయి. మహారాష్ట్ర కంట్రోల్ ఆఫ్ ఆర్గనైజ్డ్ క్రైం యాక్ట్ కింద కూడా అతనిపై కేసులు నమోదు చేసినట్లు పోలీసు ఆఫీసర్ వెల్లడించారు.హాపుర్ కొత్వాలి ఏరియాలో నేరగాళ్లతో నోయిడా యూనిట్ ఎస్టీఎఫ్, ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసుల మధ్య ఎదురుకాల్పులు జరిగినట్లు ఏడీజీపీ అమితాబ్ యశ్ తెలిపారు. ఆ కాల్పుల్లో కుమార్‌కు తీవ్ర గాయాలైనట్లు చెప్పారు. ఆస్పత్రికి తీసుకెళ్లగా డాక్టర్లు అతను మృతిచెందినట్లు నిర్ధారించారని పోలీసులు తెలిపారు.ఘజియాబాద్ జిల్లాలోని లోని గ్రామ నివాసితుడైన కుమార్.. లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌లో యాక్టివ్ షార్ప్‌షూటర్‌గా ఉన్నాడు. గ్యాంగ్ సభ్యులైన హసిమ్ బాబాతో చాలా సన్నితంగా కలిసి పనిచేసినట్లు ఏడీజీపీ తెలిపారు. ఢిల్లీ, యూపీల్లో మొత్తం 20కి పైగా కేసులు అతనిపై నమోదు అయినట్లు పోలీసు అధికారి చెప్పారు.2008లో ఢిల్లీలో ఆర్మ్స్ యాక్టు ప్రకారం సీమాపురి పోలీసు స్టేషన్‌లో కుమార్‌పై కేసు నమోదు అయ్యింది. 2009లో సాహిబాబాద్ ఏరియాలో ఓ మర్డర్ చేశాడతను. 2021లో గ్యాంగ్‌స్టర్ చట్టం కింద యూపీలో అతనిపై కేసు బుక్కైంది.

## కదులుతున్న కారుపై ఓ జంట అసభ్యకర ప్రవర్తన.. షాకిచ్చిన పోలీసులు




**న్యూఢిల్లీ-నవభూమి:**గత కొన్ని రోజులుగా యువత రెచ్చిపోతున్నారు. పబ్లిక్‌గానే హద్దులు మీరి ప్రవర్తిస్తున్నారు. బైక్, కారులో ప్రయాణిస్తూ చుట్టూ ఎవరున్నారనేది కూడా చూడకుండా.. అదేదో ఫ్యాషన్ అన్నట్లు నడిరోడ్డుపై పబ్లిక్‌గానే రొమాన్స్ చేస్తూ వార్తల్లోకెక్కుతున్నారు. ఇలాంటి ఘటనలు ఉత్తరాదిన ఎక్కువగా చోటు చేసుకున్నాయి. ఏపీ, తెలంగాణలోనూ వెలుగుచూశాయి. తాజాగా ఈ సంస్కృతి కర్ణాటకకు పాకింది.ఓ జంట బెంగళూరు నగర రోడ్లపై రాత్రిపూట అసభ్యకరంగా ప్రవర్తించారు. కదులుతున్న కారు సన్‌రూఫ్ నుంచి బయటకు వచ్చి హద్దులు మీరి ప్రవర్తించారు. ఈ ఘటన ట్రినిటీ రోడ్డులో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. అదే సమయంలో అటుగా వెళ్తున్న వాహనదారులు ఈ తతంగాన్నంతా వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయగా.. ప్రస్తుతం ఆ వీడియో వైరల్ అవుతోంది. దీనిపై పోలీసులు చర్యలు తీసుకున్నారు. వీడియో ఆధారంగా కేసు నమోదు చేసిన పోలీసులు.. నంబర్ ప్లేట్ ఆధారంగా ఆ జంటను గుర్తించారు. వారికి రూ.1,500 ఫైన్ వేశారు. ఇందులో ప్రమాదకరంగా కారును డ్రైవ్ చేసినందుకు రూ.వెయ్యి కాగా, పబ్లిక్ ట్రాఫిక్ రూల్స్‌ను పాటించని కారణంగా రూ.500 ఫైన్‌గా వేశారు.

# ఆ ప్రాంతాల ప్రజలకు ఆయుధాల లైసెన్సులు



**న్యూఢిల్లీ-నవభూమి:**అస్సాంలోని బీజేపీ ప్రభుత్వం ఓ సంచలన నిర్ణయం తీసుకుంది. అస్సాంలోని సున్నితమైన, మారుమూల ప్రాంతాల్లో నివసించే ప్రజలకు మరింత భద్రతను కల్పించడం కోసం అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ కీలక నిర్ణయం తీసుకున్నారు. స్థానిక ప్రజలకు ఆయుధాల లైసెన్సులు జారీ చేస్తున్నట్టు సీఎం కీలక ప్రకటన జారీ చేశారు. మైనార్టీలు ఎక్కువ ప్రాంతాల్లో అలాగే బంగ్లాదేశ్ సరిహద్దు ప్రాంతాల్లో.. మారుమూల ప్రాంతాల్లో నివసించే స్థానిక, ఆదివాసీ ప్రజలకు భద్రత కోసం.. వారికి ఈ ఆయుధ లైసెన్సులు ఇవ్వాలని అస్సాం కేబినెట్ నిర్ణయం తీసుకున్నట్టు హిమంత బిశ్వ శర్మ పేర్కొన్నారు.
రాజధాని గౌహతిలోని లోక్ సేవా భవన్‌లో జరిగిన అస్సాం కేబినెట్ సమావేశం తర్వాత.. మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాలను ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ మీడియాకు వివరించారు. ఇందులో భాగంగానే ఈ ఆయుధాల లైసెన్సులు విషయాన్ని వెల్లడించారు. అయితే ఏ ప్రాంతాల్లో నివసించే ప్రజలకు ఆయుధాల లైసెన్స్‌లు ఇవ్వాలి అనేది రాష్ట్ర ప్రభుత్వమే గుర్తిస్తుందని వెల్లడించారు. అంతేకాకుండా ఆయుధాల లైసెన్స్‌ల కోసం దరఖాస్తు చేసుకునేవారికి ఇంతకుముందు ఎలాంటి నేర చరిత్ర లేకుండా ఉండాలని కండీషన్ పెట్టారు.
1971 నుంచి 1985 వరకు జరిగిన అస్సాం అల్లర్ల నుంచి.. తమకు ఆయుధాల లైసెన్స్‌లు ఇవ్వాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అయితే ఈ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు సీఎం హిమంత బిశ్వ శర్మ వెల్లడించారు. ప్రజల డిమాండ్ నెరవేర్చడమే కాకుండా.. వారి భూములను కాపాడుకోవడానికి.. జాతి, సంస్కృతిని రక్షించుకోవడానికి ఈ నిర్ణయం ఉపయోగపడుతుందని తెలిపారు.దేశంలోని అన్ని రాష్ట్రాలతో పోల్చితే.. అస్సాం చాలా భిన్నమైన, సున్నితమైన రాష్ట్రమని.. హిమంత బిశ్వ శర్మ చెప్పారు. కొన్ని ప్రాంతాల్లో నివసిస్తున్న అస్సామీ ప్రజలు భయం భయంగా బతుకుతున్నారని పేర్కొన్నారు. అయితే స్థానికులు అయి ఉండి.. అర్హత కలిగిన వారికి మాత్రమే తమ ప్రభుత్వం లైసెన్సులు ఇస్తుందని వివరించారు. ఈ కేటగిరీలో ధుబ్రి, మోరిగావ్, బార్‌పేట, నాగావ్, దక్షిణ సల్మారా-మాంకాచార్ వంటి ప్రాంతాలు ఉన్నాయని స్పష్టం చేశారు. ఈ ప్రాంతాల్లో ఉన్న ప్రజలు మైనార్టీలుగా ఉన్నారని అస్సాం సీఎం తెలిపారు.

## ప్రియుడితో పారిపోయేందుకు వివాహిత స్కెచ్



**అహ్మదాబాద్-నవభూమి:** అప్పటికే ఆ మహిళకు పెళ్లి అయి భర్త ఉన్నాడు. కానీ మరో వ్యక్తితో ప్రేమలో పడింది. ఎలాగైనా సరే అతడితోనే కలిసి జీవించాలనుకుంది. ప్రియుడితో కలిసి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోతే.. భర్త సహా మెట్టినిల్లు, పుట్టింటి వాళ్ల తనకోసం వెతుకుతారని ఓ ప్లాన్ వేసింది. తాను చనిపోయినట్లు వారిని నమ్మిస్తే ఇక ఎప్పటికీ ఎలాంటి సమస్యా ఉండదని భావించింది. ఇదే విషయాన్ని ప్రియుడికి చెప్పి.. రోడ్డుపై వెళ్తున్న ఓ అమాయక వ్యక్తిని చంపించింది. ఆపై ఆ మృతదేహానికి తన డ్రెస్సు, పట్టీలు పెట్టి పెట్రోల్ పోసి మరీ కాల్చేసింది. ఆపై ప్రియుడితో కలిసి పారిపోయింది. కానీ మృతదేహం సగమే కాలగా.. అది పురుషుడిదని గ్రామస్థులు గుర్తించారు. దీంతో కథ మొత్తం అడ్డం తిరిగింది.గుజరాత్ పాటన్ జిల్లా సంతాల్‌పూర్ తాలూకా జఖోట్రా గ్రామానికి చెందిన వ్యక్తితో.. 22 ఏళ్ల గీతా అహిర్‌కు గతంలోనే పెళ్లి జరిగింది. అయితే ఇప్పటికే వివాహం అయి భర్తతో కలిసి ఉన్న ఆమె అదే మండలానికి చెందిన 21 ఏళ్ల భరత్‌తో ప్రేమలో పడింది. భర్తకు తెలియకుండానే చాటుమాటుగా ప్రేమాయణం సాగించింది. వివాహేతర సంబంధం కూడా నడిపించింది. అయితే ఇలా దొంగచాటుగా జీవితాంతం కలిసి ఉండడం కష్టం అని.. ప్రియుడితోనే జీవితాన్ని పంచుకోవాలనుకుంది. కానీ తానలా ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోతే ఇటు మెట్టినిల్లు, అటు పుట్టింటి వాళ్లు కచ్చితంగా తన కోసం వెతుక్కుంటూ వస్తారని భావించింది.అలా జరగకుండా ఉండాలంటే తాను చనిపోయినట్లు అందరినీ నమ్మించాలనుకుంది. అదే విషయాన్ని ప్రియుడు భరత్‌కు చెప్పింది. అందుకోసం ఓ అద్భుతమైన ప్లాన్ కూడా వేసింది. ముఖ్యంగా దృశ్యం, దృశ్యం-2 సినిమాలు చూసి మరీ పథక రచన చేసింది. ఎవరైనా అనామకులను చంపి ఆ మృతదేహానికి తన డ్రెస్సు, పట్టీలు పెట్టి.. పెట్రోల్ పోసి మరీ కాల్చేయాలని నిర్ణయించుంది. ఇందుకోసం ఎవరినైనా చంపాలని ప్రియుడు భరత్‌కు చెప్పగా.. అతడు రోడ్డుపై వెళ్తున్న 56 ఏళ్ల అమాయక వ్యక్తి హర్జీభాయ్ సోలంకిని హత్య చేశాడు. ఆపై మృతదేహాన్ని జఖోట్రా గ్రామ శివారుకు చేర్చాడు. అందరూ పడుకున్నాక గీతా అహిర్‌కు ఫోన్ చేసి విషయం చెప్పాడు. దీంతో ఆమె ఎవరి కంటా పడకుండా ఇంటి నుంచి వచ్చేసింది.ఆపై తన డ్రెస్సును మృతదేహానికి వేసింది. అలాగే తన కాళ్లకు ఉన్న పట్టీలు తీసి అతడికి తొడిగింది. ఆ తర్వాత శవంపై పెట్రోల్ పోసి నిప్పంటించారు. ఏమీ తెలియనట్లుగా అక్కడి నుంచి జారుకున్నారు. అయితే ఉదయం లేచే సరికి గీతా అహిర్ కనిపించకపోవడంతో భర్త.. కుటుంబ సభ్యులు ఆమె కోసం వెతుకులాట ప్రారంభించారు. ఊరంతా వెతకగా.. చివరకు గ్రామ శివారు వద్ద ఓ మృతదేహం కాలిపోయిందని తెలుసుకుని అక్కడకు వెళ్లారు. సగం కాలిన డ్రెస్సు, పట్టీలు చూసి ముందుగా గీత మృతదేహమే అనుకున్నారు. అంత్యక్రియలు కూడా చేయాలనుకున్నారు. కానీ శవాన్ని పరిశీలించి చూడగా.. అది ఓ పురుషుడి మృతదేహం అని గుర్తించారు. దీంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు.ఇలా పోలీసులు రంగంలోకి దిగి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. పురుషుడి మృతదేహానికి గీతా అహిర్ బట్టలు ఉండగా.. ఆమే ఏదైనా తప్పు చేసి ఉంటుందని ఆమె కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ముఖ్యంగా ఆమె ఎక్కువగా ఎవరితో ఫోన్ మాట్లాడిందో చూసి ఆ ఫోన్ లొకేషన్ ఆధారంగా ఈమె పాలన్‌పూర్ రైల్వే స్టేషన్లో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే వెళ్లి గీతా అహిర్ సహా ఆమె ప్రియుడు భరత్‌ను అరెస్ట్ చేశారు. తమదైన స్టైల్లో విచారించగా.. వీరిద్దరూ తాము చేసిన తప్పును ఒప్పుకున్నారు.

## యూనీఫామ్ లేని యుద్ధ వీరుడు.. ఆపరేషన్ సిందూర్‌లో జవాన్లకు సాయం..




**జమ్మూ కాశ్మీర్- నవభూమి:**ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని 9 ఉగ్రవాద స్థావరాలపై దాడులు చేసింది. ఈ దాడుల్లో.. 100 మందికి పైగా ఉగ్రవాదులు చనిపోయారు. పెద్ద సంఖ్యలో ఉగ్రవాదులు చనిపోవటంతో పాకిస్తాన్ రెచ్చిపోయింది. భారత్‌పై యుద్ధానికి కాలు దువ్వింది. సరిహద్దు ప్రాంతాలపై మిస్సైల్స్, డ్రోన్ దాడులు చేసింది. ఇదే అదునుగా పాక్ ఆర్మీ కూడా సరిహద్దుల దగ్గర కాల్పులకు తెగబడింది. యుద్ధం నేపథ్యంలో సరిహద్దు ప్రాంతాల్లోని భారత ప్రజలు తీవ్రంగా భయపడిపోయారు. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలీక అల్లాడిపోయారు.భయంతో బయటకు రావటమే మానేశారు. కానీ, ఒక్కడు తప్ప. ఆ ఒక్కడు చావుకు భయపడలేదు.. యుద్ధానికి అసలే భయపడలేదు. పాకిస్తాన్ సేనలతో పోరాడుతున్న జవాన్ల దగ్గరకు వెళ్లాడు. వారికి తన వంతు సాయం చేశాడు. ఇంతకీ ఆ బాలుడు చేసిన సాయం ఏంటో తెలియాలంటే.. ఈ మొత్తం స్టోరీ చదవాల్సిందే. భారత్, పాక్ యుద్ధం సమయంలో భారత సైనికులు పంజాబ్, ఫిరోజాపూర్ జిల్లాలోని పలు గ్రామ పొలాల్లో క్యాంపులు వేశారు. శత్రు దేశానికి తగిన విధంగా సమాధానం చెబుతూ ఉన్నారు. శ్రవణ్ సింగ్ అనే 10 ఏళ్ల బాలుడు తమ పొలంలో ఉన్న జవాన్ల క్యాంపు దగ్గరకు వెళ్లాడు.అది కూడా జవాన్ల కోసం నీళ్లు, పాలు, లస్సీ తీసుకుని వెళ్లాడు. అలా ఒక్కసారి మాత్రమే కాదు.. చాలా సార్లు తీసుకుని వెళ్లాడు. ఆ వయసులోని పిల్లలు గట్టిగా శబ్ధం వినపడితేనే భయపడతారు. అలాంటిది శ్రవణ్ సింగ్ మాత్రం ఎలాంటి భయం లేకుండా జవాన్లకు సాయం చేశాడు. అతడి ధైర్య సాహసాలు, చేసిన సాయాలను ఇండియన్ ఆర్మీ గుర్తించింది. మేజర్ జనరల్ రంజిత్ సింగ్ మన్రల్.. శ్రవణ్ సింగ్‌ను పిలిపించి సత్కరించాడు. ఈ సందర్భంగా శ్రవణ్ మాట్లాడుతూ.. ' నేను భయపడలేదు. నేను పెద్దవాడినయ్యాక సైనికుడు అవ్వాలని అనుకుంటున్నాను. నేను సైనికుల కోసం నీళ్లు, లస్సీ, పాలు, ఐస్ క్రీములు తీసుకెళ్లేవాడిని. వారు నన్ను ఎంతో ప్రేమగా చూసుకునే వారు' అని అన్నాడు. ఇక, శ్రవణ్ గురించి తెలుసుకుంటున్న వారు అతడ్ని ప్రశంసిస్తున్నారు.


## భారతీయులు మృతి.. అందుకు కారకులకు జైలుశిక్ష

**వాషింగ్టన్-నవభూమి:** మనుషుల అక్రమ రవాణా చేసే క్రమంలో నలుగురు భారతీయుల మరణానికి కారణమైన ఇద్దరికి జైలు శిక్ష ఖరారు చేసినట్లు యూఎస్‌లోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్ స్పష్టం చేసింది. ఈ కేసులో హర్షకుమార్ రమణ్‌లాల్ పటేల్‌కు 10 ఏళ్లు, స్టీవ్ ఆంథోనీ షాండ్‌కి ఆరు ఏళ్లు జైలు శిక్ష విధించినట్లు డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్ వెల్లడించింది. భారత్ నుంచి కెనడాకు స్టూడెంట్ వీసాలపై భారతీయులను తీసుకువచ్చి.. అటు నుంచి వారిని అమెరికాకు అక్రమంగా వీరిద్దరు తరలించారని డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్ నిర్ధారించింది. ఈ నలుగురు మృతుల్లో మూడేళ్ల చిన్నారితోపాటు 11 ఏళ్ల బాలికా ఉందని తెలిపింది. 2022, జనవరిలో హర్షకుమార్, స్టీవ్ ఆంథోనిలు.. కెనడా నుంచి 11 మంది భారతీయులను అక్రమంగా అమెరికాకు తరలించే ప్రయత్నం చేశారు. ఆ సమయంలో వాతావరణం ఏ మాత్రం అనుకూలించ లేదు. భారీ మంచు తుఫాన్ వచ్చింది. అందులో చిక్కుకుని ఈ నలుగురు భారతీయులు మరణించారు.
అయితే వీరు యూఎస్‌కు అక్రమ మార్గంలో తరలివస్తున్న సమయంలో మిన్నెసోటా మంచులో వ్యాన్ చిక్కుకుంది. దీనిని యూఎస్ బోర్డర్ పెట్రోల్ ఏజెంట్ గుర్తించారు.
కానీ అందులో ఎవరు ప్రయాణం చేయడం లేదంటూ వారికి స్టీవ్ సమాధానమిచ్చాడు. అదే సమయంలో ఇంతలో మరో ఐదుగురు వ్యక్తులు పంట పొలాల ప్రాంతం నుంచి బయటకు వచ్చారు. వారిలో ఒకరు తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో.. అత్యవసర పరిస్థితుల్లో అతడిని విమానంలో ఆసుపత్రికి తరలించారు.

## సౌదీలో పాకిస్థాన్ పరువుతీసిన అసదుద్దీన్ ఒవైసీ




**న్యూఢిల్లీ-నవభూమి:**పాకిస్థాన్‌పై ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. భారత్ పట్ల తన వ్యతిరేక విధానాన్ని హిందూ-ముస్లిం సమస్యగా చూపించేందుకు పాకిస్థాన్ చేస్తోన్న దుష్ప్రచారాన్ని ఆయన ఎండగట్టారు. భారత్‌లో 24 కోట్ల మందికిపైగా ముస్లింలు ఉన్నారని గర్వంగా చెప్పుకోగలమని, భారత్‌కు ఎంతో మంది గొప్ప ఇస్లామిక్ పండితులు ఉన్నారని ఆయన అన్నారు. 'పాకిస్థాన్ అరబ్ దేశాలు... ముస్లిం ప్రపంచానికి తప్పుడు సందేశాన్ని ఇస్తోంది. మేము ముస్లిం దేశం, కానీ భారత్ కాదు అనే ప్రచారాన్ని పాకిస్థాన్ ప్రాజెక్ట్ చేస్తోంది. భారత్‌లో 240 మిలియన్లకుపైగా ముస్లింలు గర్వంగా జీవిస్తున్నారు. మా ఇస్లామిక్ పండితులు ప్రపంచంలోని ఎవరితోనైనా వాదించగలరు. వారు అద్భుతమైన అరబిక్ మాట్లాడగలరు. భారత్ ముస్లిం దేశం కాదని, ముస్లింలపై దాడులు చేస్తున్నారని పాకిస్థాన్ చెబుతోంది ఇది పూర్తిగా దుష్ప్రచారం" అని ఒవైసీ తెలిపారు. ఉగ్రవాద సంస్థలకు మద్దతివ్వడాన్ని ఆ దేశం ఆపితే, దక్షిణాసియాలో స్థిరత్వం ఏర్పడుతుందని ఆయన అన్నారు.
పహల్గామ్ ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్‌అనంతరం భారత ప్రభుత్వం చేపట్టిన అంతర్జాతీయ దౌత్య కార్యక్రమంలో భాగంగా అసదుద్దీన్ ఒవైసీతో కూడిన భారతీయ ప్రతినిధి బృందం సౌదీ అరేబియా చేరుకుంది. సౌదీ ప్రభుత్వ ఉన్నతాధికారులు, పాలకులను ఈ బృందం కలిసి.. భారత్‌పై పాకిస్థాన్ చేస్తోన్న కుట్రలను వివరించింది. ఈ సందర్భంగా ఒవైసీ మాట్లాడుతూ.. పాక్‌పై తీవ్ర విమర్శలు చేశారు. మే 9 ఘటనను ప్రస్తావిస్తూ.. భారత సైనిక శక్తిపై పాకిస్థాన్ దుష్ప్రచార చేసిందని విమర్శించారు. 'ఆ రోజున వారి తొమ్మిది వైమానిక స్థావరాలే లక్ష్యంగా దాడులు జరిపాం. భారత్ తలచుకుంటే వాటిని పూర్తిగా ధ్వంసం చేయవచ్చు. కానీ మేము హెచ్చరికలు మాత్రమే చేశాం.. ' మే 7న తొమ్మిది ఉగ్రవాద కేంద్రాలను ధ్వంసం చేశాం. అక్కడ హతమైన ఉగ్రవాదుల్లో ఒకరు అమెరికా నిషేధిత జాబితాలో ఉన్నాడు," అని ఆయన వెల్లడించారు.పాకిస్థాన్‌ను మళ్లీ ఎఫ్ఏటీఎఫ్ గ్రే లిస్టులో చేర్చాలని ఒవైసీ డిమాండ్ చేశారు. 'ఉగ్రవాదులకు నిధులను అడ్డుకునే మార్గం అదే. పాకిస్థాన్ ఆర్మీ చీఫ అసీమ్ మునీర్‌ను ఫీల్డ్ మార్షల్‌గా ప్రకటించిన వేళ, మొహమ్మద్ ఏహసాన్ అనే అమెరికా గుర్తించిన ఉగ్రవాది ఆయన పక్కనే కూర్చున్నాడు. ఇద్దరూ చేతులు కలిపిన ఫొటోలు కూడా ఉన్నాయి. ఇది స్పష్టంగా పాకిస్థాన్ ఉగ్రవాద మద్దతుకు నిదర్శనం.'ముంబయి 26/11 ఉగ్రదాడి గురించి మాట్లాడుతూ, మన్మోహన్ సింగ్ ప్రభుత్వమే అన్ని ఆధారాలను పాకిస్థాన్‌కు అప్పగించిందని చెప్పారు. 'ఆ తర్వాత ఏమీ జరగలేదు. కానీ పాకిస్థాన్‌ను ఎఫ్ఏటీఎఫ్ గ్రే లిస్టులో చేర్చిన తర్వాతే ముందడుగు పడింది. జర్మనీలో ఒక సమావేశంలో భారత్ సజీద్ మీర్‌ను నిర్దోషిగా కాకుండా నిందితుడిగా చూడాలని కోరింది. అప్పటివరకు పాకిస్థాన్ అతను చనిపోయాడని చెబుతూ వచ్చింది. తర్వాతే అతను బతికే ఉన్నాడని ముందు ఒప్పుకుంది. చివరికి అతడిని ఉగ్రవాదం కాకుండా మనీ లాండరింగ్ కేసులో శిక్షించారు' అని పాక్ దుర్నీతిని ఎత్తిచూపారు.'భారత్ న్యాయ ప్రక్రియను అనుసరించి అజ్మల్ కసబ్‌కు మరణశిక్ష విధించింది. అతడు విచారణలో పలు విషయాలను వెల్లడించాడు. పాకిస్థాన్ నుంచి వచ్చిన ఉగ్రవాదుల మధ్య జరిగిన టెలిఫోన్ సంభాషణలను మా ఏజెన్సీలు రికార్డ్ చేశాయి. "భయపడకండి, ఎక్కువ మందిని చంపండి.. మీకు జన్నత్ లభిస్తుంది అని వారు (పాక్) ఉగ్రవాదులను ఉత్సాహపరిచారు' అని ఒవైసీ వివరించారు.ఈ ప్రతినిధి బృందంలో బీజేపీ ఎంపీ బైజయంత్ పాండా నేతృత్వం వహించగా, నిషికాంత్ దూబే, ఫాంగ్నాన్ కోన్యాక్, రేఖా శర్మ, సత్నాం సింగ్ సందూ (నామినేటెడ్ ఎంపీ), మాజీ దౌత్యవేత్త హర్ష్ శ్రింగ్లా ఉన్నారు. వారు సౌదీ అరేబియా, కువైట్, బహ్రెయిన్, అల్జీరియా దేశాల్లో పర్యటించారు.



## ట్రంప్‌నకు భారీ షాక్.. టారిఫ్‌లపై అమెరికా కోర్టు స్టే

**వాషింగ్టన్-నవభూమి:**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కి మరోసారి కోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఏప్రిల్ 2న లిబరేషన్ డే పేరుతో ప్రకటించిన ప్రతీకార సుంకాలపై ట్రేడ్ కోర్టు బుధవారం స్టే విధించింది. అమెరికాకు ఎక్కువ మొత్తంలో వస్తువులను విక్రయించి.. తమ నుంచి తక్కువకే కొనుగోలు చేస్తోన్న దేశాలపై ట్రంప్ టారిఫ్‌లు విధించిన విషయం తెలిసిందే. ఈ విషయంలో ట్రంప్ తన అధికార పరిధిని మించి వ్యవహరించారని కోర్టు వ్యాఖ్యానించింది. జాతీయ అత్యవసర పరిస్థితుల్లో అసాధారణమైన, అత్యవసరమైన ముప్పులను ఎదుర్కొనేందుకు రూపొందించిన ఇంటర్నేషనల్ ఎమర్జెన్సీ ఎకనామిక్ పవర్స్ యాక్ట్ ఆధారంగా ప్రపంచవ్యాప్తంగా టారిఫ్‌లు విధించే అధికారం తనకు ఉందని ట్రంప్ పేర్కొన్నారు. కానీ కోర్టు దీనిని వ్యతిరేకించింది. అంతేకాదు, సుంకాలపై స్టే విధించడం వల్ల ప్రపంచవ్యాప్తంగా అనేక ప్రతికూలతలు ఎదురవుతాయని, ఇటీవల భారత్ పాకిస్థాన్ సైనిక ఘర్షణలు దీని వల్లే ఆగిపోయాయంటూ ట్రంప్ యంత్రాంగం చేసిన వాదనలను కోర్టు పరిగణనలోకి తీసుకోలేదు.
ఆధారంగా ట్రంప్ తీసుకొచ్చిన టారిఫ్‌లతో భారత్-పాకిస్థాన్ మధ్య యుద్ధాన్ని ఆపేశారని కోర్టుకు తెలిపారు. ఏప్రిల్ 22న జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం రెండు అణ్వాయుధ శక్తుల మధ్య ఉద్రిక్తతలు తలెత్తిన నేపథ్యంలో ట్రంప్ మౌలికంగా జోక్యం చేసుకుని టారిఫ్ ప్రోత్సాహంతో కాల్పుల విరమణ సాధించారని పేర్కొన్నారు. జూలై 7 నాటికి అనేక దేశాలతో ట్రేడ్ ఒప్పందాలను ఖరారు చేయాల్సిన నేపథ్యంలో, ఈ అంశం "సున్నితమైన దశలో" ఉందని వారు కోర్టుకు తెలియజేశారు.
కోర్టు ఏం చెప్పింది?: న్యూయార్క్‌లోని మన్‌హట్టన్‌కు చెందిన ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం..ఆధారంగా అధ్యక్షుడికి పరిమితి లేని అధికారాలను కాంగ్రెస్ అప్పగించలేదని స్పష్టం చేసింది. చట్టం ప్రకారం, జాతీయ అత్యవసర పరిస్థితుల్లో అసాధారణ ముప్పును ఎదుర్కొనేందుకు అవసరమైన ఆర్థిక ఆంక్షలు మాత్రమే అధ్యక్షుడు విధించగలరు' అని పేర్కొంది. అమెరికా రాజ్యాంగం ప్రకారం అంతర్జాతీయ వాణిజ్యంపై నియంత్రణ అధికారం కేవలం కాంగ్రెస్ మాత్రమే ఉందని వివరించింది. 'అధ్యక్షుడికి టారిఫ్‌లను విధించే అధికారం ఉందా? లేదా? అనేది కోర్టు వ్యాఖ్యానించదు. అది చట్టపరంగా అనుమతించబడదని మాత్రమే కోర్టు స్పష్టం చేస్తుంది' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. టారిఫ్ అధికార పరిమితిని దాటి ఉపయోగించుకోవడం రాజ్యాంగ ధిక్కరణే అవుతుందని తెలిపింది.
ట్రంప్ యంత్రాంగం స్పందన:కోర్టు తీర్పు వెలువడిన వెంటనే ట్రంప్ యంత్రాంగం అప్పీల్ దాఖలు చేసింది. న్యాయస్థానం స్టే విధించడం విదేశాలపై టారిఫ్‌లు విధించే శక్తిని తగ్గించడమేనని, ఇది వ్యూహాత్మకంగా ఆర్థిక సాధనాలను ఉపయోగించేందుకు ఆటంకం కలిగిస్తుందని తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో అమెరికా వ్యూహాత్మక ప్రయోజనాలను ఇది దెబ్బతీయచ్చని అన్నారు. ఏప్రిల్ 2న ట్రంప్ అమెరికా ప్రధాన వాణిజ్య భాగస్వాములపై ట్రంప్ టారిఫ్‌లు ప్రకటించారు. ప్రాథమికంగా 10% టారిఫ్ విధించి, ముఖ్యంగా చైనా, యూరోపియన్ యూనియన్ వంటి దేశాలపై ఎక్కువ టారిఫ్‌లు విధించారు.కానీ, అమెరికా ఆర్థిక మార్కెట్లపై తీవ్ర ప్రభావం పడటంతో కొన్ని దేశాలపై టారిఫ్‌లు తాత్కాలికంగా నిలిపివేశారు. మే 12న, చైనాపై విధించిన భారీ టారిఫ్‌లను తాత్కాలికంగా తగ్గించినట్లు ట్రంప్ ప్రభుత్వం ప్రకటించింది. రెండు దేశాలు పరస్పరం 90 రోజుల పాటు టారిఫ్‌లను తగ్గించుకోవడానికి అంగీకరించాయి. ఇక, భారత్‌తోనూ జులై 8లోగా ఒప్పందానికి ట్రంప్ గడువు విధించిన విషయం తెలిసిందే.



## కాలి గోళ్లను ఇలా కాపాడుకోవాలి...



పరిశుభ్రత పాటించకపోవడం వల్ల కాలి గోళ్లలో ఫంగస్ చేరుతుంది. దీంతో గోళ్ల మీద నలుపు, పసుపు రంగు మచ్చలు ఏర్పడుతుంటాయి. ఒక్కోసారి గోళ్ల చివర్లలో విపరీతమైన నొప్పి వస్తూ ఉంటుంది. తరచూ బొటనవేళ్ల గోళ్లకు ఇలా జరుగుతుంది. ఈ సమస్యలన్నింటినీ పోగొట్టుకోవడానికి నిపుణులు సూచిస్తున్న చిట్కాలు ఇవే...ఒక వెడల్పాటి టబ్‌లో బకెట్ వేడి నీళ్లు పోసి అందులో అర కప్పు యాపిల్ సైడర్ వెనిగర్ లేదా వైట్ వెనిగర్ వేసి కలపాలి. ఈ నీళ్లలో పాదాలు ఉంచాలి. అరగంట తరవాత మంచినీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా రెండు రోజులకు ఒకసారి చేస్తూ ఉంటే కాలి గోళు మామూలు స్థితికి వస్తాయి.రెండు వెల్లులి రెబ్బలను పొట్టు తీసి బాగా దంచి ఈ మిశ్రమాన్ని ఫంగస్ సోకిన గోళ్ల మీద పూతలా రాయాలి. వెల్లుల్లిలో ఉండే అలిసిన్ అనే యాంటీ ఫంగల్ ఏజెంట్ ప్రభావవంతంగా పనిచేసి ఫంగ్‌సను నిరోధిస్తుంది.ఒక గిన్నెలో ఒక చెంచా బేకింగ్ సోడా వేసి రెండు చెంచాల నీళ్లు పోసి పేస్టులా కలపాలి. ఈ మిశ్రమాన్ని కాలి గోళ్ల మీద రాయాలి. ఇరవై నిమిషాల తరవాత గోరువెచ్చని నీటితో పాదాలు కడిగేసుకుంటే గోళ్ల నొప్పి తగ్గుతుంది.ఫంగస్ చేరి నల్లగా మారిన గోళ్ల మీద కొద్దిగా నిమ్మరసం లేదా టీట్రీ ఆయిల్ లేదా కొబ్బరినూనె చుక్కలు వేసి పావుగంటసేపు ఉంచాలి. తరవాత వేడినీళ్లతో శుభ్రం చేసుకోవాలి. ఇలా రోజుకు రెండుసార్లు చేస్తూ ఉంటే వారం రోజుల్లో గోళ్లు ఆరోగ్యంగా తయారవుతాయి.వెడల్పాడి గిన్నె నిండుగా వేడినీళ్లు తీసుకుని అందులో రెండు చెంచాల ఉప్పు, ఒక చెంచా పసుపు వేసి బాగా కలపాలి. ఈ నీళ్లలో పాదాలు ఉంచి అరగంట తరవాత మంచినీళ్లతో శుభ్రం చేసుకోవాలి. ఇలా వారానికి ఒకసారి చేస్తూ ఉంటే కాలి గోళ్లు పూర్తిగా శుభ్రపడతాయి.

# షుగర్ వ్యాధి లివర్‌ను కూడా వదలదా?



మధుమేహం కాలేయంతో పాటు ఇతర అవయవాలపైనా ప్రభావం
నిరంతర అలసట కాలేయ సమస్యకు తొలి సంకేతం
చర్మం, కళ్లు పసుపు రంగులోకి మారడం కాలేయ వైఫల్యానికి సూచన
పొత్తి కడుపులో నొప్పి, వాపు కాలేయ సమస్యకు సంకేతాలు
మూత్రం రంగు మారడం, మలంలో మార్పులు కూడా ముఖ్యమైన లక్షణాలేఆకలి తగ్గడం, కారణం లేకుండా బరువు తగ్గడం ప్రమాదకరమే!

మధుమేహం, నేటి ఆధునిక జీవనశైలిలో అనేకమందిని పట్టిపీడిస్తున్న దీర్ఘకాలిక వ్యాధి. రక్తంలో చక్కెర స్థాయిలు అదుపు తప్పడం వల్ల తలెత్తే ఈ సమస్య, కేవలం చక్కెరకే పరిమితం కాకుండా శరీంలోని అనేక కీలక అవయవాలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా, మన శరీరంలో జీవక్రియల కర్మాగారంగా పిలువబడే కాలేయంపై మధుమేహం ప్రభావం అత్యంత ప్రమాదకరమైనది. సకాలంలో గుర్తించి సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే, కాలేయ వైఫల్యానికి దారితీసే అవకాశం ఉంది. మధుమేహం ఉన్నవారు తమ కాలేయం ఆరోగ్యంగా ఉందో లేదో తెలుసుకోవడానికి కొన్ని ముఖ్యమైన లక్షణాలపై దృష్టి సారించాలి.

**ప్రధాన లక్షణాలు**

1.అంతుచిక్కని అలసట: సాధారణంగా పనిచేసిన తర్వాత అలసట రావడం సహజం. కానీ, ఎంత విశ్రాంతి తీసుకున్నా తగ్గని నిరంతరమైన అలసట మిమ్మల్ని పట్టిపీడిస్తుంటే, అది కాలేయ సమస్యకు తొలి హెచ్చరిక కావచ్చు. కాలేయం దెబ్బతిన్నప్పుడు శరీరంలోని విషపదార్థాలను సరిగా బయటకు పంపలేదు. ఇవి రక్తంలో చేరి తీవ్రమైన నీరసాన్ని కలిగిస్తాయి. మధుమేహగ్రస్తులలో ఈ లక్షణం మరింత స్పష్టంగా కనిపించవచ్చు.

2. చర్మం, కళ్లు పసుపు పచ్చగా మారడం (కామెర్లు): కాలేయ సమస్యలకు ఇది ఒక స్పష్టమైన సంకేతం. బిలిరుబిన్ అనే పసుపు రంగు పదార్థం రక్తంలో అధికంగా చేరినప్పుడు చర్మం, కంటిలోని తెల్లటి భాగం పసుపు రంగులోకి మారతాయి. దెబ్బతిన్న కాలేయం బిలిరుబిన్‌ను సరిగా విసర్జించలేకపోవడమే దీనికి కారణం. మధుమేహం ఉన్నవారిలో కామెర్లు కనిపిస్తే తక్షణ వైద్య సహాయం అవసరం.

3. పొత్తి కడుపులో నొప్పి, వాపు: కాలేయం కుడివైపు ఉదరభాగంలో ఉంటుంది. ఈ ప్రాంతంలో తరచుగా నొప్పిగా ఉండటం, లేదా పొత్తి కడుపు ఉబ్బినట్లు, నీరు చేరినట్లు అనిపించడం కూడా కాలేయ సమస్యను సూచిస్తుంది. ముఖ్యంగా కుడివైపు పైభాగంలో నొప్పి లేదా అసౌకర్యం ఉంటే అనుమానించాల్సిందే.

4. మూత్రం, మలం రంగులో మార్పులు: మూత్రం ముదురు పసుపు లేదా గోధుమ రంగులోకి మారడం, మలం తెల్లగా లేదా బంకమన్ను రంగులో రావడం వంటివి కాలేయ పనితీరు మందగించిందనడానికి సంకేతాలు. బిలిరుబిన్ స్థాయిలలో మార్పుల వల్లే ఈ లక్షణాలు కనిపిస్తాయి.

5. ఆకలి మందగించడం, బరువు తగ్గడం: కారణం లేకుండా ఆకలి తగ్గడం, ఆహారం రుచించకపోవడం, దీని ఫలితంగా అకారణంగా బరువు తగ్గిపోవడం కూడా కాలేయ సమస్యల వల్లే జరగవచ్చు. జీర్ణక్రియలో కాలేయం పాత్ర కీలకమైనది కాబట్టి, దాని పనితీరు దెబ్బతింటే ఈ మార్పులు సహజం.

మధుమేహం ఉన్నవారు పైన పేర్కొన్న లక్షణాలలో ఏవైనా గమనిస్తే ఏమాత్రం అశ్రద్ధ చేయకుండా వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుకోవడం, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ద్వారా కాలేయ సమస్యల ముప్పును తగ్గించుకోవచ్చు.

# తొలకరి వర్షంలో తడిస్తే ఇన్ని లాభాలా



ఈ సారి చాలా త్వరగా వర్షాకాలం ప్రారంభం అయ్యింది. రోహిణి కార్తిలోనే వానలు దంచికొడుతున్నాయి. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇక మండే ఎండల నుంచి కాస్త ఉపశమనం దొరికినట్లు అయ్యింది. అయితే చాలా మంది వర్షంలో తడుస్తుంటారు. మరి ఇలా వర్షం నీటిలో తడుస్తూ స్నానం చేయడం ఆరోగ్యానికి మంచిదేనా? దీనిపై ఆరోగ్య నిపుణులు ఏమంటున్నారో ఇప్పుడు మనం వివరంగా తెలుసుకుందాం.

వర్షం అంటే చాలా మందికి ఇష్టం ఉంటుంది. చిరు జల్లులు పడుతుంటే, ఆ వాన నీటిలో తడుస్తూ చాలా మంది సంతోషంగా ఫీల్ అవుతారు. ఇక చిన్నపిల్లల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనే లేదు. వర్షం పడుతుందంటే చాలు వారు వర్షంలో తడవకుండా అస్సలు ఉండలేరు.

వర్షం అంటే చాలా మందికి ఇష్టం ఉంటుంది. చిరు జల్లులు పడుతుంటే, ఆ వాన నీటిలో తడుస్తూ చాలా మంది సంతోషంగా ఫీల్ అవుతారు. ఇక చిన్నపిల్లల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనే లేదు. వర్షం పడుతుందంటే చాలు వారు వర్షంలో తడవకుండా అస్సలు ఉండలేరు.కొందరు ఆనందంగా తడిస్తే మరికొంత మంది పనుల నిమిత్తం వర్షంలో తడవాల్సి వస్తుంది. అయితే ఎలా తడిచినా సరే, ఈ వర్షంలో తడవడం ఆరోగ్యానికి మంచిదా ? కాదా అనే డౌట్ చాలా మందిలో ఉంటుంది. పెద్ద వారు మాత్రం చిన్నపిల్లలను వర్షంలో తడవకూడదు అనారోగ్య సమస్యలు వస్తాయంటారు. మరి ఇందులో నిజం ఎంత ఉన్నదంటే?అయితే వర్షంలో తడవడం ఆరోగ్యానికి మంచిదేనంట. దీని వలన మన మనస్సుకు ప్రశాంతత కలగడమే కాకుండా శరీర ఆరోగ్యం కూడా చాలా వరకు మెరుగు పడుతుందంట. అంతే కాకుండా ఇది చాలా ఆనందాన్ని కలిగిస్తుందంట. శరీరాన్ని, మనసును రీ ఫ్రెష్ చేస్తుందంట. చర్మంపై పేరుక పోయిన దుమ్ము, ధూళిని తెలిగిస్తుంది.

అయితే వర్షంలో తడవడం ఆరోగ్యానికి మంచిదేనంట. దీని వలన మన మనస్సుకు ప్రశాంతత కలగడమే కాకుండా శరీర ఆరోగ్యం కూడా చాలా వరకు మెరుగు పడుతుందంట. అంతే కాకుండా ఇది చాలా ఆనందాన్ని కలిగిస్తుందంట. శరీరాన్ని, మనసును రీ ఫ్రెష్ చేస్తుందంట. చర్మంపై పేరుక పోయిన దుమ్ము, ధూళిని తెలిగిస్తుంది.

అలాగే వర్షం నీరులో ఆరోగ్యానికి మేలు చేసేవి అనేక ఉంటాయయంట. ముఖ్యంగా వర్షపు నీటిలో పీహెచ్ స్థాయి తక్కువగా ఉండటం వలన ఇది శరీరంలో ఎండార్ఫిన్లు, సెరోటోనిన్ హార్మోన్లు విడుదలవుతాయి.ఇవి మనసుకు, శరీరాన్నికి ఆనందాన్ని కలిగిస్తాయంట. చాలా సంతోషంగా ఉండేలా చేస్తాయంట.

అలాగే వర్షం నీరులో ఆరోగ్యానికి మేలు చేసేవి అనేక ఉంటాయయంట. ముఖ్యంగా వర్షపు నీటిలో పీహెచ్ స్థాయి తక్కువగా ఉండటం వలన ఇది శరీరంలో ఎండార్ఫిన్లు, సెరోటోనిన్ హార్మోన్లు విడుదలవుతాయి.ఇవి మనసుకు, శరీరాన్నికి ఆనందాన్ని కలిగిస్తాయంట. చాలా సంతోషంగా ఉండేలా చేస్తాయంట.

అంతే కాకుండా వర్షపు నీటిలో స్నానం చేయడం వలన రోగనిరోధక శక్తి పెరుగుతుంది. అలాగే ఒత్తిడిని తగ్గించి,మనిషిని చాలా యాక్టివ్ చేస్తుందంట. అయితే వర్షపు నీరు వలన ఇన్ని ప్రయోజనాలు ఉన్నప్పటికీ, ఎక్కువ సేపు వర్షంలో తడవడం కూడా ఆరోగ్యానికి మంచిది కాదు అని చెబుతున్నారు వైద్య నిపుణులు.

అంతే కాకుండా వర్షపు నీటిలో స్నానం చేయడం వలన రోగనిరోధక శక్తి పెరుగుతుంది. అలాగే ఒత్తిడిని తగ్గించి,మనిషిని చాలా యాక్టివ్ చేస్తుందంట. అయితే వర్షపు నీరు వలన ఇన్ని ప్రయోజనాలు ఉన్నప్పటికీ, ఎక్కువ సేపు వర్షంలో తడవడం కూడా ఆరోగ్యానికి మంచిది కాదు అని చెబుతున్నారు వైద్య నిపుణులు.

## బొట్టు ఇలా...



ముఖాకృతికి అనుగుణంగా బిందీ ఎంచుకుంటే ముఖం మరింత ఆకర్షణీయంగా కనిపిస్తుంది. గుండ్రటి, దీర్ఘవృత్త, చతురస్ర, కోల, హృదయాకార ముఖాలకు తగిన బిందీ రకాల వివరాలు ఇందులో ఉన్నాయి.

మహిళలు సాధారణంగా గుండ్రని బొట్టు లేదా చిన్న బిందీ పెట్టుకుంటారు. పార్టీలు, వివాహాది శుభకార్యాలు... ఇలా సందర్భాన్ని అనుసరించి రకరకాల బిందీలను ఎంపిక చేసుకుంటూ ఉంటారు. ముఖాకృతికి తగ్గట్టుగా బిందీని పెట్టుకుంటే ముఖం మరింత ఆకర్షణీయంగా కనిపిస్తుంది. ఎవరికి ఏ రకం బిందీ బాగుంటుందో తెలుసుకుందాం...

గుండ్రని ముఖం ఉన్నవారు పొడవాటి బిందీని పెట్టుకోవాలి. దీనివల్ల ముఖం కొద్దిపాటి కోలగా ఆకర్షణీయంగా కనిపిస్తుంది. చిన్న కుందనాలు లేదా మెరిసే రాళ్లు ఉన్న బిందీలు వీరికి బాగా నప్పుతాయి.

దీర్ఘవృత్తాకారపు ముఖం ఉన్నవారికి నుదురు పెద్దగా ఉంటుంది. వీరికి అన్ని రకాల బిందీలు చక్కగా నప్పుతాయి. మరీ పెద్దగా మరీ చిన్నగా కాకుండా మధ్యస్థంగా ఉన్న బిందీని ఎంపిక చేసుకుంటే బాగుంటుంది. బంగారు రంగు గుండ్లు అమర్చిన బిందీలు వీరికి ప్రత్యేకమైన అందాన్నిస్తాయి.

చతురస్రాకారపు ముఖం ఉన్నవారికి నుదుటితోపాటు చెక్కిళ్లు కూడా వెడల్పుగా ఉంటాయి. వీరు గుండ్రంగా ఉండే పెద్ద బిందీలు పెట్టుకుంటే అందంగా కనిపిస్తారు. బిందీ కింది భాగంలో చిన్న రాయి లేదా పూస ఉండేలా చూసుకుంటే ముఖం ఆకర్షణీయంగా ఉంటుంది.కోల ముఖం ఉన్నవారికి వెడల్పాటి డిజైన్ల బిందీలు, అర్ధచంద్రా కారంలో ఉన్నవీ బాగా నప్పుతాయి. వీటివల్ల ముఖం సమతుల్యంగా కనిపిస్తుంది. వీరికి మెరిసే రాళ్లు ఉన్న బిందీలు బాగుంటాయి. బిందీ కింద చిన్న చుక్క అదనపు అందాన్నిస్తుంది.

హృదయాకారపు ముఖం ఉన్నవారికి గుండ్రనివి, నక్షత్రాకారపు బిందీలు బాగుంటాయి. చుట్టూ మెరిసే రాళ్లు లేదా గుండ్లు లేదా చిన్న పూసలు పేర్చిన బిందీలు పెట్టుకుంటే వీరు ఆకర్షణీయంగా కనిపిస్తారు.

## లెట్స్ పిల్లో టాక్!



ప్రస్తుతం భార్యాభర్త.. ఇద్దరూ ఉద్యోగాలు చేయాల్సిన పరిస్థితులు. ఓవైపు ఆఫీస్.. ఇంటి పనులంటూ ఉరుకులు పరుగులు. మరోవైపు పిల్లలు, వారి చదువులు. పెద్దవాళ్ల బాధ్యతలు! వెరసి.. క్షణం తీరికలేని జీవితాలు! దంపతులకు కాస్తంత సమయం దొరకడం కూడా గగనమే అవుతున్నది. ఒకవేళ దొరికినా.. ఇద్దరూ ఏకాంతంగా గడపడం కూడా కష్టంగా మారుతున్నది. ఫలితంగా.. భార్యాభర్తల మధ్య దూరం పెరుగుతున్నది. ఈ సమస్యకు 'పిల్లో టాక్' ఓ పరిష్కారం చూపుతున్నది.

దంపతులు ఎంత సన్నిహితంగా ఉంటే.. వారి మధ్య బంధం అంత బలంగా ఉంటుంది. మనసు విప్పి మాట్లాడుకుంటేనే.. సాన్నిహిత్యం పెరుగుతుంది. కానీ, ఈ ఉరుకుల పరుగుల జీవితంలో చాలామందికి అలాంటి సమయం దొరకడం లేదు. దొరికినా.. కొంతమంది తమ భాగస్వామితో అన్ని విషయాల్నీ స్వేచ్ఛగా చెప్పుకోలేకపోతున్నారట. తమ ఇష్టాయిష్టాలు, భవిష్యత్తు లక్ష్యాల గురించి పంచుకోవడానికీ ఆసక్తి చూపించడం లేదట. చెబితే భాగస్వామి ఎలా రియాక్ట్ అవుతారో.. తమ ఇష్టాయిష్టాలు, లక్ష్యాలను గౌరవిస్తారో లేదోనన్న సందిగ్ధమే ఇందుకు కారణమని నిపుణులు అంటున్నారు. ఇలాంటి వాళ్లు 'పిల్లో టాక్'తో ఒక్కటవ్వొచ్చని చెబుతున్నారు.


**మనసులు దగ్గర..**

రాత్రిపూట పడకగదిలో భార్యాభర్తలు ఇద్దరూ ఏకాంతంగా, మనసు విప్పి మాట్లాడుకోవడమే.. పిల్లో టాక్! దీనివల్ల భార్యాభర్తల శరీరాల్లో 'ఆక్సిటోసిన్' అనే ప్రేమ హార్మోన్ విడుదలవుతుంది. ఇది మానసిక సమస్యలను దూరం చేస్తుంది. మనసుకు ప్రశాంతత చేకూరుస్తుంది. దంపతుల మధ్య దూరం తగ్గడంతోపాటు ఒకరినొకరు అర్థం చేసుకునే సమయం చిక్కుతుంది. భాగస్వామి మనసులో కోరికలు తెలుసుకోవడంతోపాటు వాటిని నెరవేర్చడానికీ అవకాశం ఉంటుంది. అందుకే.. భార్యాభర్తలు రోజంతా ఎంత బిజీగా ఉన్నా.. రాత్రిపూట కనీసం ఓ అరగంటైనా మనసు విప్పి, ఏకాంతంగా మాట్లాడుకోవాలని మానసిక నిపుణులు సూచిస్తున్నారు.

**ఇవి వద్దే వద్దు..**

అయితే, చాలామంది 'పిల్లో టాక్'లో లేనిపోని సమస్యలను ముందేసుకుంటారు. దొరక్కదొరక్క దొరికిన సమయాన్ని దుర్వినియోగం చేసుకుంటారు. ఎప్పుడో జరిగిన గొడవలు, ఆఫీస్ సమస్యలు, పిల్లల చదువులు, పెద్దల ఆరోగ్యానికి సంబంధించిన విషయాలను చర్చిస్తుంటారు. ఇలాంటి చర్చలవల్ల సరదాగా సాగాల్సిన సమయం.. వృథాగా గడిచిపోతుంది.ఒక్కోసారి పాతగొడవలు ముందుకొచ్చి.. దంపతుల మధ్య దూరం పెరిగే ప్రమాదమూ ఉంటుంది. వాటికి బదులుగా పెళ్లినాటి జ్ఞాపకాలు, హనీమూన్ మధురానుభూతులు, ఇచ్చిపుచ్చుకున్న కానుకలు, ఇద్దరి మధ్య జరిగిన సరదా సంఘటనలు.. ఇలాంటివి గుర్తుకు తెచ్చుకుంటే మంచిది. ఇలాంటి సంభాషణలతో ఇద్దరి మధ్య అనుబంధం మరింత దృఢంగా మారుతుంది.

# హెల్త్ బిట్స్



హెల్త్ బిట్స్ అధిక రక్తపోటు ఉన్నవాళ్లు ఆపిల్, అరటిపండ్లు తింటే మంచిదట. 'ఫ్రాంటియర్స్ ఇన్ న్యూట్రిషన్' అనే జర్నల్‌లో ప్రచురితమైన ఓ అధ్యయనం ఈ విషయం వెల్లడించింది. వారంలో మూడు నుంచి ఆరుసార్లు ఆపిల్ గానీ లేదంటే అరటిపండ్లుగానీ తిన్నవారు అన్ని రకాలైన కారణాల వల్ల మరణించే ముప్పు 40 శాతం వరకు తక్కువగా ఉందట.

**బీపీకి మంచి పండ్లు**

అధిక రక్తపోటు ఉన్నవాళ్లు ఆపిల్, అరటిపండ్లు తింటే మంచిదట. 'ఫ్రాంటియర్స్ ఇన్ న్యూట్రిషన్' అనే జర్నల్‌లో ప్రచురితమైన ఓ అధ్యయనం ఈ విషయం వెల్లడించింది. వారంలో మూడు నుంచి ఆరుసార్లు ఆపిల్ గానీ లేదంటే అరటిపండ్లుగానీ తిన్నవారు అన్ని రకాలైన కారణాల వల్ల మరణించే ముప్పు 40 శాతం వరకు తక్కువగా ఉందట. అయితే దీనికి కారణం ఏంటనేది మాత్రం పరిశోధకులు ఇదమిత్థంగా తేల్చలేదు. కాకపోతే అరటిపండ్లలో పొటాషియం పుష్కలంగా ఉంటుంది. ఇది రక్తపోటును తగ్గించడంలో దోహదపడుతుంది. కాగా పియర్స్, ద్రాక్ష, అనాస పండ్ల నుంచి ఇలాంటి ప్రయోజనాలు దక్కవట.

**వీరికి నాక్టూరియా సమస్య**

ఇప్పుడు ఎక్కువసేపు టీవీలు, స్మార్ట్‌ఫోన్లలో వీడియోలు చూసేవాళ్లే కనిపిస్తున్నారు. అయితే రోజుకు అయిదు గంటలకంటే ఎక్కువ వీడియోలు చూసేవాళ్లలో రాత్రిళు తరచుగా మూత్రానికి వెళ్లాల్సి వచ్చే నాక్టూరియా అనే సమస్య తలెత్తుతుందట. ఇది రాత్రి నిద్రకు ఆటంకం కలిగించడమే కాకుండా అధిక రక్తపోటు, గుండె కవాటాల వ్యాధుల ముప్పును పెంచుతుందట. టీవీలు, వీడియోలు చూడటానికి నాక్టూరియాకు మధ్య సంబంధం ఏంటనేది తెలియదు. ఎక్కువసేపు తెరలకు అతుక్కుపోయి కూర్చోవడం టైప్ 2 డయాబెటిస్ ముప్పును పెంచుతుంది. నాక్టూరియా ముప్పు కారకాల్లో టైప్ 2 డయాబెటిస్ ఒకటి కావడం గమనార్హం. అంతేకాకుండా వీడియోలు చూస్తూ నీళ్లు, ఇతర పానీయాలు తీసుకుంటూ ఉంటారు.

ఇది కూడా తరచుగా మూత్రానికి దారితీస్తుందని పరిశోధకులు వెల్లడించారు. ఈ అధ్యయనం 'న్యూరోయూరాలజీ అండ్ యూరోడైనమిక్స్'లో ప్రచురితమైంది. స్క్రీనింగ్ టైం తగ్గించుకోవాలి మరి!

# తిన్న ఆహారం జీర్ణం కాలేదా ?
# ఈ చిట్కాలు పాటించండి..!



తిన్న ఆహారం సరిగ్గా జీర్ణం కాకపోతే ఎవరికైనా ఇబ్బందిగానే ఉంటుంది. గ్యాస్, అసిడిటీ, మలబద్ధకం వంటి సమస్యలు అజీర్ణం కారణంగానే వస్తాయి. ఇవి వచ్చాయంటే ఎవరైనా మరిన్ని ఇబ్బందులు పడాల్సి ఉంటుంది. ఈ క్రమంలో కొందరికి జీర్ణాశయంలో మంట పుడుతుంది కూడా. ముఖ్యంగా పొట్ట పై భాగంలో ఇలా అనిపిస్తుంది. కొవ్వు పదార్థాలు, ఫ్రై చేయబడిన ఆహారం, ఇతర జంక్ ఫుడ్స్ తినడం కారణంగా ఎవరికైనా అజీర్ణ సమస్య వస్తుంది. అలాగే వేళ తప్పించి భోజనం చేయడం, మద్యపానం, ధూమపానం, బాక్టీరియా ఇన్‌ఫెక్షన్ తదితర కారణాల వల్ల కూడా కొందరిలో అజీర్ణ సమస్య వస్తుంటుంది. అయితే కింద సూచించిన పలు చిట్కాలు పాటిస్తే అజీర్ణ సమస్య నుంచి ఉపశమనం పొందవచ్చు. తిన్న ఆహారం సరిగ్గా జీర్ణమవుతుంది. మరి ఆ

**చిట్కాలు ఏమిటో ఇప్పుడు చూద్దామా..!**

1. అజీర్ణ సమస్యకు అల్లం చక్కని పరిష్కారాన్ని చూపుతుంది. ఒక గ్లాస్ నీటిలో కొద్దిగా అల్లం ముక్కలు వేసి ఆ నీటిని బాగా మరిగించాలి. అనంతరం అల్లంలో ఉండే సారం ఆ నీటిలోకి చేరుతుంది. అప్పుడు ఆ నీటిని వేడిగా ఉండగానే తాగేయాలి. ఇలా చేయడం వల్ల ఆహారం త్వరగా జీర్ణమవుతుంది. అజీర్ణ సమస్య బాధించదు. అలాగే అల్లం ముక్కలను దంచి రసం తీసి ఆ రసాన్ని సేవించినా చాలు, సమస్య నుంచి ఉపశమనం లభిస్తుంది.
2. ఒక గ్లాస్ నీటిలో కొద్దిగా బేకింగ్ సోడాను కలిపి తాగితే అజీర్ణ సమస్య బాధించదు. నీటికి బదులుగా తేనె, నిమ్మరసంలను కూడా ఉపయోగించవచ్చు.
3. ఒక గ్లాస్ నీటిలో 1 టీస్పూన్ యాపిల్ సైడర్ వెనిగర్‌ను కలిపి తాగితే అజీర్ణ సమస్య నుంచి ఉపశమనం లభిస్తుంది. అవసరం అనుకుంటే ఆ మిశ్రమంలో తేనె కూడా కలుపుకోవచ్చు.
4. ఒక గ్లాస్ నీటిలో కొన్ని సోంపు గింజలను వేసి బాగా మరిగించాలి. అనంతరం ఆ నీటిని వడకట్టి వేడిగా ఉండగానే తాగాలి. దీంతో ఆహారం త్వరగా జీర్ణమవుతుంది.
5. గుప్పెడు వాము తీసుకుని అందులో కొంత ఉప్పు వేసి బాగా నలిపి ఆ మిశ్రమాన్ని తినాలి. వెంటనే నీరు తాగాలి. దీంతో గ్యాస్, అసిడిటీ, అజీర్ణం తగ్గుతాయి.






నవభూమి

www.navabhoomi.in
www.epaper.navabhoomi.in


# వరుస నష్టాలకు బ్రేక్.. 320 పాయింట్లు లాభపడిన సెన్సెక్స్



**న్యూఢిల్లీ-నవభూమి:**గత రెండ్రోజులుగా ఎదురవుతున్న కాస్త బ్రేక్ పడింది. గురువారం దేశీయ సూచీలు లాభాలను ఆర్జించాయి. అంతర్జాతీయ మార్కెట్లలో సానుకూల సంకేతాలతో పాటు విదేశీ మదుపర్లు అమ్మకాలు కొనసాగిస్తుండడం, ప్రధాన షేర్లలో కొనుగోళ్లు దేశీయ సూచీలను నడిపించాయి. దీంతో వరుసగా నష్టాలను చవిచూస్తున్న సెన్సెక్స్, నిఫ్టీ ఈ రోజు లాభాలను ఆర్జించాయి .బుధవారం ముగింపు (81, 312)తో పోల్చుకుంటే గురువారం ఉదయం దాదాపు 250 పాయింట్ల లాభంతో మొదలైన సెన్సెక్స్ ఉదయం కాసేపు లాభనష్టాలతో దోబూచులాడింది. ఆ తర్వాత ప్రధాన షేర్లలో అమ్మకాలు మొదలు కావడంతో లాభాల బాట పట్టాయి. గురువారం సెన్సెక్స్ 81, 106 – 81,816 శ్రేణి మధ్యలో కదలాడింది. చివరకు సెన్సెక్స్ 320 పాయింట్ల నష్టంతో 81, 633 వద్ద రోజును ముగించింది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడింది. చివరకు 81 పాయింట్ల లాభంతో 24, 833 వద్ద రోజును ముగించింది.సెన్సెక్స్‌లో అదానీ పోర్ట్స్, ఎటర్నల్, టాటా స్టీల్, ఇండస్ ఇండ్ బ్యాంక్, ఇన్ఫోసిస్ షేర్లు లాభాల్లో ముగిశాయి. ఐటీసీ, బజాజ్ ఫైనాన్స్, ఆసియన్ పెయింట్స్, ఎన్టీపీసీ షేర్లు నష్టాలను మూటగట్టుకున్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 315 పాయింట్ల లాభంతో రోజును ముగించింది. బ్యాంక్ నిఫ్టీ 129 పాయింట్లు లాభపడింది.

## ఐఫోన్ల ఎగుమతుల్లో చైనాను దాటిన భారత్



**న్యూఢిల్లీ-నవభూమి:** భారత్ నుంచి అమెరికాకు ఐఫోన్ల ఎగుమతులు చైనాను మించిపోయాయి. మార్కెట్ పరిశోధక సంస్థ ఓండియా (గతంలో క్యానలిస్) డేటా ప్రకారం.. గత నెలలో అమెరికాకు మేడ్ ఇన్ ఇండియా ఐఫోన్ల సరఫరా వార్షిక ప్రాతిపదికన 76 శాతం వృద్ధితో దాదాపు 30 లక్షల యూనిట్లకు పెరిగింది. అదే సమయంలో చైనా నుంచి అమెరికాకు ఐఫోన్ల ఎగుమతులు మాత్రం 76 శాతం తగ్గి 9 లక్షల యూనిట్లకు పడిపోయాయి. అమెరికాకు ఐఫోన్ల ఎగుమతుల విషయంలో భారత్ తొలిసారిగా చైనాను అధిగమించింది.

**4 నెలల్లో 1.15 కోట్ల ఐఫోన్ల ఎగుమతులు**

ఈ ఏడాదిలో గడిచిన నాలుగు నెలల్లో (జనవరి–ఏప్రిల్) భారత్ నుంచి అమెరికాకు 1.15 కోట్ల ఐఫోన్లు ఎగుమతయ్యాయి. అదే సమయంలో చైనా నుంచి 1.32 కోట్ల ఐఫోన్ల సరఫరా జరిగింది. నాలుగు నెలల కాలానికి చూస్తే, ఇప్పటికీ చైనానే అగ్రగామిగా ఉన్నప్పటికీ నెలవారీ గణాంకాలను పరిశీలిస్తే భారత్ నుంచి సరఫరా భారీగా పెరుగుతూ వస్తోంది.

**భారత్‌పై యాపిల్ ఫోకస్**

ఐఫోన్ల తయారీ కోసం యాపిల్ కేవలం చైనా పైనే ఆధారపడకుండా భారత్‌ను ప్రత్యామ్నాయ వేదికగా ఎంచుకుంది. కరోనా సంక్షోభ కాలం నుంచే భారత మార్కెట్ నుంచి తన ఉత్పత్తుల సరఫరా కోసం భారీగా పెట్టుబడులు పెడుతూ వచ్చింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల ప్రభావాన్ని తగ్గించుకునేందుకు భారత్‌లోని తన థర్డ్ పార్టీ వెండార్ల నుంచి ఈ ఏడాది ఐఫోన్ల సేకరణను భారీగా పెంచింది.

## నాట్కో ఫార్మా లాభం రూ 406 కోట్లు

**హైదరాబాద్-నవభూమి:** నాట్కో ఫార్మా మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికానికి రూ.406 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభం ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంలో నమోదు చేసిన రూ.386.3 కోట్లతో పోలిస్తే ఇది ఐదు శాతం ఎక్కువ. ఇదే సమయంలో కంపెనీ ఆదాయం 16 శాతం పెరిగి రూ.1,287.3 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే క్యూ4లో కంపెనీ స్థూల లాభం 10.2 శాతం వృద్ధితో రూ.548 కోట్లుగా నమోదైంది. అయితే ఇదే సమయంలో నిర్వహణ లాభాలు మాత్రం 46.55 శాతం నుంచి 44.89 శాతానికి పడిపోయాయి.ఆర్థిక సంవత్సరం మొత్తానికి : 2024–25 ఆర్థిక సంవత్సరం మొత్తానికి కంపెనీ రూ.4,784 కోట్ల ఆదాయంపై రూ.1,883.4 కోట్ల నికర లాభం నమోదు చేసింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 2024–25లో ఆదాయం 16 శాతం పెరిగితే, నికర లాభం ఏకంగా 36 శాతం పెరిగింది. అయితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) అంత ఆశాజనకంగా ఉండక పోవచ్చని కంపెనీ హెచ్చరించింది. కంపెనీ ఆదాయం 20 శాతం, నికర లాభం 30 శాతం వరకు క్షీణించే ప్రమాదం ఉందని తెలిపింది. అమెరికా మార్కెట్‌లో ఎదురవుతున్న ధరల ఒత్తిడి, అంతర్జాతీయ ఉద్రిక్తతలు, ఆర్ అండ్ డీ ఖర్చులు పెరిగిపోవడం ఇందుకు కారణమని పేర్కొంది. దీంతో బీఎస్ఈలో కంపెనీ షేర్లు బుధవారం 1.78 శాతం నష్టం తో రూ.862.45 వద్ద ముగిశాయి.

## ఎన్ఎస్ఈతో వి హబ్ ఎంఓయూ



**హైదరాబాద్-నవభూమి:**నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్‌తో (ఎన్ఎస్ఈ) తెలంగాణకు చెందిన వి హబ్ ఫౌండేషన్ అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. బుధవారం జరిగిన కార్యక్రమంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు శ్రీధర్ బాబు, సీతక్క సమక్షంలో ఇరువర్గాల ప్రతినిధులు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ ఒప్పందంలో భాగంగా ఎన్ఎస్ఈ, వి హబ్ ఫౌండేషన్ కలిసి రాష్ట్రంలో పలు కార్యక్రమాలు చేపట్టనున్నాయి. ఇన్వెస్టర్ల అవగాహన కార్యక్రమాల(ఐఏపీ) ద్వారా ఆర్థిక అక్షరాస్యతను ప్రోత్సహించడం, ఐపీఓ ద్వారా నిధుల సమీకరణ, ఎన్ఎస్ఈలోని ఎస్ఎంఈ ప్లాట్‌ఫామ్ 'ఎమర్జ్'లో షేర్లను నమోదుపై మహిళా ఆంత్రప్రెన్యూర్ల నిర్వహణలోని ఎంఎస్ఎంఈల్లో అవగాహన పెంచడం, విద్యార్థులకు బీఎఫ్ఎస్ఐ రంగంలో సమగ్ర శిక్షణ వంటి కార్యక్రమాలను నిర్వహించనున్నాయి.

## 8 నెలల కనిష్ఠానికి పారిశ్రామికోత్పత్తి



**న్యూఢిల్లీ-నవభూమి:** దేశంలో పారిశ్రామికోత్పత్తి 8 నెలల కనిష్ఠానికి పడిపోయింది. కేంద్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన డేటా ప్రకారం.. గత నెలలో పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) 2.7 శాతానికి జారుకుంది. మాన్యుఫాక్చరింగ్, మైనింగ్, విద్యుత్ రంగాల పేలవ పనితీరు ఇందుకు కారణం. గత ఏడాది ఏప్రిల్‌లో ఐఐపీ 5.2 శాతంగా నమోదైంది. కాగా ఈ మార్చి నెల ఐఐపీని గతంలో ప్రకటించిన 3 శాతం నుంచి 3.9 శాతానికి పెంచింది. గత నెలలో తయారీ రంగ ఉత్పత్తి వృద్ధి 3.4 శాతానికి తగ్గగా.. మైనింగ్ ప్రొడక్షన్ 0.2% క్షీణించింది.

# టాప్ బ్యాంకుల్లో పర్సనల్ లోన్ వడ్డీ రేట్లు ఇవే



**న్యూఢిల్లీ-నవభూమి:**కొంతకాలంగా ప్రపంచ దేశాల్లో ద్రవ్యోల్బణం పెరుగుతుండటంతో.. బ్యాంకులు లోన్లపై వడ్డీ రేట్లు పెంచుతున్నాయి. చాలా కాలంగా పర్సనల్ లోన్లపై వడ్డీ రేట్లు గరిష్ట స్థాయిల్లోనే ఉన్నాయి. దీంతో ఈ క్రమంలోనే.. వ్యక్తిగత రుణాలు తీసుకున్నవారు అధిక వడ్డీ రేట్లతో సతమతమవుతున్నారు. మీరు కొత్త లోన్ తీసుకోవాలని ప్లాన్ చేస్తున్నా, లేదా ఇప్పటికే ఉన్న అధిక వడ్డీ లోన్‌ను మేనేజ్ చేయడానికి కష్టపడుతున్నా, ప్రస్తుత రేట్లు ఇంకా తిరిగి చెల్లింపు వ్యూహాల గురించి తెలుసుకోవడం చాలా ముఖ్యం. మీ చేతుల్లో ఉన్న అధిక వడ్డీ భారాన్ని తగ్గించుకోవడానికి నిపుణులు చెబుతున్న కీలక సూచనల గురించి కూడా మనం తెలుసుకుందాం.ప్రస్తుతం దేశంలోని టాప్ ప్రైవేట్, ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో పర్సనల్ లోన్లపై వడ్డీ రేట్ల గురించి చూద్దాం. అతిపెద్ద ప్రైవేట్ బ్యాంకు.. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో కనీసం 10.50 శాతం నుంచి 21 శాతం వరకు వడ్డీ రేట్లు ఉన్నాయి. అతిపెద్ద ప్రభుత్వ బ్యాంకు.. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో 10.30 శాతం నుంచి 15.30 శాతంగా ఉన్నాయి. ఐసీఐసీఐ బ్యాంకులో 10.85 శాతం నుంచి 16.65 శాతంగా వడ్డీ రేట్లు ఉండగా.. ఇక కోటక్ మహీంద్రా బ్యాంకులో ఇది 10.99 శాతం నుంచి 24 శాతంగా ఉంది.

ఈ రేట్లు ఇంకా దరఖాస్తుదారుడి క్రెడిట్ ప్రొఫైల్, లోన్ మొత్తం, టెన్యూర్ ఆధారంగా మారుతుంటాయి. లోన్ గురించి ఏమైనా సమాచారం కోసం నేరుగా బ్యాంకును సంప్రదించండి. మంచి క్రెడిట్ స్కోరు ఉన్న వారికి చాలా బ్యాంకులు.. ప్రీ అప్రూవ్డ్ పర్సనల్ లోన్స్ ఆఫర్ చేస్తుంటాయి. ఇతర బ్యాంకుల్లో పర్సనల్ లోన్ వడ్డీ రేట్లను పోల్చుకొని తీసుకోవడం బెస్ట్ అని చెబుతున్నారు నిపుణులు.అధిక వడ్డీ వ్యక్తిగత రుణాల నియంత్రణ గురించి మాట్లాడిన ఫిన్‌కేదా ఛైర్మన్ అండ్ ఎండీ.. మనీష్ గోయల్ మాట్లాడుతూ "కొత్త అప్పులకు దూరంగా ఉండండి. ఖర్చుల్ని నిశితంగా పర్యవేక్షించండి ఇంకా మిగతా డబ్బుల్ని అధిక వడ్డీ రుణాల వైపు మళ్లించండి. సాధ్యమైతే రీఫైనాన్స్ చేయండి లేదా రుణాల్ని మెర్జ్ చేయండి.' అని ఆయన వివరించారు.సూచనలు..

ముందుగా, మీ ఆదాయం, ఖర్చులు ఇంకా ప్రస్తుతం ఉన్న అప్పుల్ని జాగ్రత్తగా అంచనా వేయండి. ఇది మీ తిరిగి చెల్లింపు సామర్థ్యాన్ని అర్థం చేసుకోవడానికి, ఇంకా మీరు చేసే పొరపాట్లను గుర్తించడానికి సహాయపడుతుంది.

అధిక వడ్డీ ఉన్న ఎక్కువ రుణాల్ని తక్కువ వడ్డీ రేట్లతో ఒకే లోన్‌గా మెర్జ్ చేయడంపై దృష్టి పెట్టండి. దీన్నే రుణ ఏకీకరణ అంటారు. ఇది ఈఎంఐలను సరళీకృతం చేయడానికి సహాయపడుతుంది.

మీ రుణదాతతో నిజాయితీగా చర్చించడం వల్ల వడ్డీ రేట్లు ఏమైనా తగ్గొచ్చు. మీరు మీ రుణాలపై మరింత మెరుగైన నిబంధనలు ఇంకా షరతులు (ఉదాహరణకు, తక్కువ వడ్డీ రేటు, సులభమైన తిరిగి చెల్లింపు విధానం, ఎక్కువ కాలపరిమితి లేదా ఫ్లోటింగ్ వడ్డీ రేటు నుండి ఫిక్స్‌డ్ వడ్డీ రేటుకు మారడం) అందించమని అభ్యర్థించవచ్చు.

ప్రణాళిక, తిరిగి చెల్లింపు సామర్థ్యం, రుణ కాలపరిమితి ఇంకా మొత్తం అప్పులను ఎలా నిర్వహించాలి అనే విషయాలపై మీకు ఇంకా సందేహాలు ఉంటే, అప్పుడు ఒక ఆర్థిక సలహాదారుడితో మీ సమస్యలను చర్చించడం ఎల్లప్పుడూ మంచిది. ఒక నిపుణుడు మీకు మంచి నిర్ణయం తీసుకోవడానికి సహాయపడతారు.

భవిష్యత్తు కోసం పొదుపు చేయడం ప్రారంభించినప్పుడు, మొదట మీ మూడు నుంచి ఆరు నెలల ఖర్చులను కవర్ చేసేలా నిధిని కూడబెట్టండి. ఇది వైద్య ఖర్చులు, ప్రమాదాలు వంటి అత్యవసర పరిస్థితులు ఏర్పడినప్పుడు వెంటనే అప్పు తీసుకోవలసిన అవసరాన్ని నివారిస్తుంది.

మంచి క్రెడిట్ ప్రొఫైల్‌ను నిర్వహించడం చాలా ముఖ్యం. అధిక క్రెడిట్ స్కోర్ తక్కువ వడ్డీ రేటుతో రుణం లేదా ప్రీమియం క్రెడిట్ కార్డును సులభంగా పొందడానికి మీ అవకాశాలను పెంచుతుంది. అధిక క్రెడిట్ వినియోగాన్ని నివారించడానికి మీరు మీ ఈఎంఐలను ఇంకా రుణ తిరిగి చెల్లింపులను సకాలంలో చెల్లించాలి.

# ఎమర్జెన్సీగా డబ్బులు కావాలా?



**న్యూఢిల్లీ-నవభూమి:** జీవితంలో ఎప్పుడో ఒకప్పుడు ఊహించని ఆర్థిక అవసరాలు ఎదురవడం సహజం. అలాంటి సమయాల్లో వెంటనే డబ్బు సమకూర్చుకోవడం చాలా ముఖ్యం. అలాగే కష్టం. చాలామంది వ్యక్తిగత రుణాలు తీసుకోవాలని అనుకుంటారు, కానీ వాటికి మంచి క్రెడిట్ స్కోరు తప్పనిసరి. మరి క్రెడిట్ స్కోరు బాగా లేని వారికి లేదా తక్కువ వడ్డీకే పెద్ద మొత్తంలో రుణం కావాలనుకునే వారికి పరిష్కారం లేదా? ఉంది. అదే పూచీకత్తు రుణం. మీ వద్ద ఉన్న విలువైన ఆస్తులను పూచీకత్తుగా (హామీగా) పెట్టి బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి సులభంగా రుణాలు పొందొచ్చు. ఇలాంటి రుణాలకు మీ క్రెడిట్ స్కోరుతో పెద్దగా పని ఉండదు, ఎందుకంటే మీ ఆస్తిని హామీగా తీసుకుని రుణం ఇస్తారు. ఈ రుణాలకు వడ్డీ రేట్లు కూడా సాధారణంగా తక్కువగా ఉంటాయి.ఏయే ఆస్తులపై పూచీకత్తు రుణం పొందొచ్చు?

పూచీకత్తు రుణం పొందడానికి మీరు కొన్ని కేటగిరీల ఆస్తులను హామీగా పెట్టవచ్చు. అందులో కొన్నింటి గురించి మనం ఇప్పుడు తెలుసుకుందాం. పీపీఎఫ్: కేంద్ర ప్రభుత్వ గొప్ప పథకాల్లో ఒకటైన పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ . దీంట్లో వరుసగా 15 సంవత్సరాలు పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. దీనిపై ప్రస్తుతం 7.10 శాతం వడ్డీ రేటు ఉంది. అయితే ఇక్కడ ఈ ఖాతా కలిగిన వారు అకౌంట్ తెరిచి 3-6 సంవత్సరాల మధ్య అప్పటివరకు ఉన్నటువంటి పీపీఎఫ్ అకౌంట్ బ్యాలెన్స్‌పై 25 శాతం వరకు లోన్ పొందొచ్చు. ప్రభుత్వం ఇచ్చే వడ్డీ రేటు కన్నా ఒక శాతం అదనపు వడ్డీ పడుతుంది.గోల్డ్ లోన్: అత్యవసరంగా.. చాలా ఈజీగా లోన్ పొందాలంటే బంగారంపైనా తీసుకోవచ్చు. ఇక్కడ బ్యాంకులు కనీసం 8.75 శాతం వడ్డీ రేటు వసూలు చేస్తున్నాయి. ఇక్కడ బంగారం తాకట్టు పెట్టాల్సి ఉంటుంది. లోన్ అనేది గోల్డ్ వాల్యూపై 50–70 శాతం వరకు వస్తుంది. కనీసం రూ. 20 వేల నుంచి గరిష్టంగా రూ. 1.50 కోట్ల వరకు కూడా గోల్డ్ లోన్ తీసుకోవచ్చు. లోన్ టెన్యూర్ 3–5 ఏళ్లు. ఇంకా నిమిషాల్లోనే డబ్బులు వచ్చేస్తాయి.కారుపై రుణం: చాలా బ్యాంకులు, రుణ జారీ సంస్థలు కారును కూడా హామీగా పెట్టుకొని లోన్లు ఇస్తుంటాయి. కారు కొత్త మోడలే అయ్యుండి.. ఎక్కువ రీసేల్ వాల్యూ కలిగి ఉన్నట్లయితే మంచి లోన్ లభించే అవకాశం ఉంటుంది. ఇంకా మీ క్రెడిట్ ప్రొఫైల్ బట్టి కారు విలువపైన 50–150 శాతం వరకు కూడా లోన్ పొందే అవకాశం ఉంటుంది. బ్యాంకుల్ని బట్టి వడ్డీ రేట్లు 11–23 శాతం మధ్య ఉండొచ్చు.లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీపై: మీకు జీవిత బీమా పాలసీ ఉన్నా కూడా లోన్ పొందొచ్చు. ఇక్కడ దీని సరెండర్ వాల్యూపై 85–90 శాతం వరకు అదే బీమా సంస్థలో ఇన్సూరెన్స్ డాక్యుమెంట్ తాకట్టు పెట్టుకొని బ్యాంకులు లోన్ ఇస్తాయి. అయితే బ్యాంకుల్లో ప్రాసెసింగ్ టైమ్ ఎక్కువ.స్థిరాస్తిపై లోన్: ఎలాంటి వివాదాల్లేని, మంచి విలువ ఉన్న ఆస్తులపై బ్యాంకులు లోన్లు ఇస్తుంటాయి. ఇక్కడ వడ్డీ రేట్లు 9.25 శాతం నుంచి ప్రారంభమవుతాయి. ఆస్తి విలువలో 50–60 శాతం వరకు లోన్ పొందొచ్చు. లోన్ పేమెంట్స్ డిఫాల్ట్ కాకుండా చూసుకోవాలి. లేకపోతే బ్యాంకులు ఆస్తి వేలం వేసే అవకాశం ఉంటుంది.మ్యూచువల్ ఫండ్స్, షేర్లు: ఇంకా మ్యూచువల్ ఫండ్లు, స్టాక్స్‌ను కూడా తాకట్టు పెట్టుకొని బ్యాంకులు 50 శాతం వరకు లోన్లు ఇస్తాయి. లోన్ తిరిగి చెల్లించే సమయంలో కూడా వీటిపై రుణ గ్రహీతలు డివిడెండ్ పొందుతుండొచ్చు.పూచీకత్తు రుణం బెనిఫిట్స్.. మీ క్రెడిట్ స్కోరు తక్కువగా ఉన్నా రుణం లభిస్తుంది.

ఆస్తులను హామీగా పెడతారు కాబట్టి వడ్డీ రేట్లు తక్కువగా ఉంటాయి.

వ్యక్తిగత రుణాలతో పోలిస్తే పెద్ద మొత్తంలో రుణం పొందవచ్చు.

కొన్ని రుణాలకు (బంగారం, ఫిక్స్‌డ్ డిపాజిట్) వేగంగా రుణం మంజూరవుతుంది.

అత్యవసరంగా నగదు అవసరమైనప్పుడు, ఈ పూచీకత్తు రుణాలు ఒక సురక్షితమైన, నమ్మకమైన పరిష్కారాన్ని అందిస్తాయి.

## దేశంలో బంగారం, వెండి ధరలు ఇవీ



**న్యూఢిల్లీ-నవభూమి:**దేశంలో పసిడి ధరలు మరోసారి స్వల్పంగా తగ్గాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, నేడు 10 గ్రాముల 24 క్యారెట్‌ల మేలిమి బంగారం ధర సుమారు రూ.10 మేర తగ్గి 97,620కు చేరుకుంది. 22 క్యారెట్‌ల 10 గ్రాముల బంగారం కూడా స్వల్పంగా తగ్గి 89,490కు చేరుకుంది. ఇక 18 క్యారెట్‌ల బంగారం కూడా స్వల్పంగా తగ్గింది. ప్రస్తుతం 10 గ్రాముల ధర రూ.73,220గా ఉంది. ఇక కిలో వెండి ధర నిన్నటితో పోలిస్తే రూ.100 మేర తగ్గి రూ 99,900కు చేరుకుంది.

వివిధ నగరాల్లోని బంగారం ధరలు (24కే, 22కే,18కే)

చెన్నై –?97,470బీ ?89,340బీ ?73,590
–ముంబై –?97,470బీ ?89,340బీ ?73,100
–దిల్లీ –?97,620బీ ?89,490బీ ?73,220
–కోల్‌కతా –?97,470బీ ?89,340బీ ?73,100
–బెంగళూరు – ?97,470బీ ?89,340బీ ?73,100
–హైదరాబాదు– ?97,470బీ ?89,340బీ ?73,100

బంగారం ధరలు అధికంగా ఉండటంతో వినియోగదారుల అభిరుచి మారుతోందని కొందరు నగర వ్యాపారులు చెబుతున్నారు. నగల తయారీ కోసం సాధారణంగా వినియోగించే 22 క్యారెట్‌ల బంగారానికి బదులు వినియోగదారులు 18 క్యారెట్ల బంగారం వైపు మళ్లుతున్నట్టు చెబుతున్నారు. నగల అమ్మకాలు స్వల్పంగా పెరిగినా కూడా ఒక్కో వినియోగదారుడు కొనే సగటు బంగారం విలువ మాత్రం తగ్గిందని చెబుతున్నారు. మారుతున్న కస్టమర్ల అభిరుచికి తగ్గట్టుగా తాము నగలు డిజైన్ చేస్తున్నట్టు కూడా కొందరు వ్యాపారులు తెలిపారు. బంగారం ధరల్లో తీవ్ర అస్థిరత నెలకొన్న నేపథ్యంలో అనేక మంది బంగారంపై పెట్టుబడులను వాయిదా వేసుకుంటున్నట్టు కూడా తెలిపారు.

గతేడాది బంగారం ధరలు సుమారు 45 శాతం మేర పెరిగాయి. ఈ ఏడాది ఇప్పటివరకూ 25 శాతం మేర పెరుగుదల కనిపించింది. దీంతో, జనాలు పసిడి కొనుగోలుకు మొగ్గు చూపట్లేదు. ఇక బంగారం స్వచ్ఛతను క్యారెట్లలో కొలుస్తారన్న విషయం తెలిసిందే. 24 క్యారెట్ బంగారం 99.9% స్వచ్ఛమైనది. 22 క్యారెట్ బంగారంలో 91% బంగారం, మిగిలిన 9% రాగి, వెండి, జింక్ వంటి లోహాలు కలుస్తాయి. మోసాల బారిన పడకుండా ఉండేందుకు హాల్ మార్క్ ఉన్న బంగారు నగలను మాత్రమే కొనుగోలు చేయాలని అనుభవజ్ఞులు చెబుతున్నారు.

# టాటా గ్రూప్‌లో కీలక పరిణామం



**న్యూఢిల్లీ-నవభూమి:** దేశీయ దిగ్గజ వ్యాపార సంస్థ టాటా గ్రూప్‌లో కీలక పరిణామం చోటు చేసుకుంది. టాటా సన్స్ ఛైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ కీలక నిర్ణయం తీసుకున్నారు. టాటా కెమికల్స్ కంపెనీ డైరెక్టర్, ఛైర్మన్ పదవి నుంచి తప్పుకున్నారు. మే 29, 2025వ తేదీ నుంచే ఆయన బాధ్యతల నుంచి వైదొలుగుతున్నారు. ఈ మేరకు బుధవారమే స్టాక్ ఎక్స్చేంజీలకు టాటా కెమికల్స్ కంపెనీ సమాచారం అందించింది. ప్రస్తుత, భవిష్యత్తు బాధ్యతలు, నిబద్ధతలను పేర్కొంటూ రాజీనామా నిర్ణయాన్ని తెలియజేస్తూ ఎన్ చంద్రశేఖరన్ లేఖ రాసినట్లు వెల్లడించింది. కంపెనీ డైరెక్టర్ల బోర్డు ఆయన రాజీనామాను అధికారికంగా ఆమోదించినట్లు తెలిపింది.'నా ప్రస్తుత, భవిష్యత్తు బాధ్యతలను జాగ్రత్తగా పరిశీలించిన తర్వాత నేను బోర్డు నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నాను. టాటా కెమికల్స్ కంపెనీ బోర్డుకు అధ్యక్షత వహించడం నాకు లభించిన గౌరవం. నా పదవీ కాలంలో నాకు లభించిన మద్దతు, సహకారాన్ని నేను హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను.' అంటూ మే 28, 2025 వ తేదీన కంపెనీ బోర్డుకు రాసిన లేఖలో ఎన్ చంద్రశేఖరన్ పేర్కొన్నారు.

**కొత్త ఛైర్మన్‌గా ఎస్ పద్మనాభన్**

టాటా సన్స్ ఛైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ టాటా కెమికల్స్ సంస్థ బోర్డు డైరెక్టర్, ఛైర్మన్ పదవి నుంచి వైదొలిగిన క్రమంలో ఆయన వారసుడిగా ఎస్.పద్మనాభన్‌ను నియమించింది కంపెనీ బోర్డు. ప్రస్తుతం ఆయన కంపెనీ బోర్డు డైరెక్టర్‌గా ఉన్నారు. మే 30, 2025 నుంచి టాటా కమికల్స్ నూతన ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తారని కంపెనీ తెలిపింది. మరోవైపు.. మదన్ సాహాను అడిషనల్ డైరెక్టర్ (నాన్ ఎగ్జిక్యూటివ్, నాన్ ఇండిపెండెంట్) గా నియమించేందుకు కంపెనీ ఆమోదం తెలిపింది. ఆయన అడిషనల్ డైరెక్టర్‌గా మే 28, 2025 నుంచి కొనసాగుతారు. నామినేషన్, రెమ్యూనరేషన్ కమిటీ సిఫార్సుల మేరకు అడిషనల్ డైరెక్టర్‌గా నియమించారు.

టాటా కెమికల్స్ బోర్డు డైరెక్టర్, ఛైర్మన్ పదవి నుంచి వైదొలుగుతున్న ఎన్ చంద్రశేఖరన్ చాలా విషయాల్లో చరిత్ర సృష్టించారు. టాటా సన్స్ ఛైర్మన్‌గా కొత్త అధ్యాయాన్ని లిఖించారు. టాటా గ్రూప్ కుటుంబం బయటి వ్యక్తి టాటా సన్స్ ఛైర్మన్ కావడం ఇదే మొదటిసారి. టాటా సన్స్ అనేది టాటా గ్రూప్‌కి ఒక నియంత్రణ సంస్థ. టాటా సన్స్ విస్తృతమైన వ్యాపారాలు కలిగి ఉంది. ఎన్ చంద్రశేఖరన్ మొత్తం టాటా గ్రూప్ కంపెనీలను నిర్వహించే, నియంత్రించే స్థాయిలో ఉన్నాడు. ఆయన 2017 నుంచి ఆ పదవిలో ఉండటం గొప్ప విషయం.

## బుచ్‌కు లోక్‌పాల్ క్లీన్‌చిట్

**న్యూఢిల్లీ-నవభూమి:** క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ మాజీ చైర్‌పర్సన్ మాధవి పురి బుచ్‌కు అవినీతి నిరోధక అంబుడ్స్‌మన్ లోక్‌పాల్ క్లీన్‌చిట్ ఇచ్చింది. అమెరికా షార్ట్ షెల్లింగ్, మార్కెట్ రీసెర్చ్ కంపెనీ హిండెన్‌బర్గ్ ఆరోపణల ఆధారంగా అనుచితం, పరస్పర విరుద్ధ ప్రయోజనాలకు సంబంధించి బుచ్‌పై దాఖలైన ఫిర్యాదులను లోక్‌పాల్ బుధవారం తోసిపుచ్చింది.

ఆ అభియోగాలన్నీ కేవలం అనుమానాలు, ఊహలే తప్ప వాటిని ధ్రువీకరించే ఆధారాలేమీ లేవంది. అదానీ గ్రూప్ నిధుల అక్రమ మళ్లింపునకు ఉపయోగించిన విదేశీ ఫండ్లలో మాధవి పురి బుచ్‌తోపాటు ఆమె భర్త ధవల్ బుచ్‌కు రహస్య వాటాలున్నాయని హిండెన్‌బర్గ్ గత ఆగస్టులో ఆరోపించింది. అంతేకాదు, సెబీ పదవీ చేపట్టాక కూడా మాధవి పురి బుచ్ తన మాజీ సంస్థ ఐసీఐసీ బ్యాంక్ నుంచి పారితోషికం అందుకున్నారని కాంగ్రెస్ ఆరోపించింది. అయితే, బుచ్ ఆ ఆరోపణలన్నింటినీ ఖండించారు.


# దేశంలోనే అత్యంత ఖరీదైన 'హోమ్' డీల్



**న్యూఢిల్లీ-నవభూమి:**దేశంలోని పలు ప్రాంతాల్లో ఇళ్ల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఇక ధనవంతులు ఉండే ప్రాంతాల్లో విలాసవంతమైన ఇళ్ల ధరలు వింటేనే కళ్లు తిరుగుతాయి. కోట్ల రూపాయలు వెచ్చించి తమకు నచ్చిన ఇంటిని కొనుగోలు చేస్తుంటారు. అలా ఓ మహిళ ఇప్పటి వరకు దేశంలో ఎవరూ వెచ్చించని రేటుతో లగ్జరీ డూప్లెక్స్ అపార్ట్మెంట్లను కొనుగోలు చేశారు. ఒక్క చదరపు అడుగు ఏకంగా రూ.2.83 లక్షలుగా ఉంది. దేశంలోనే అత్యధిక ధర పలికిన హోమ్ డీల్ ఇదే కావడం గమనార్హం. ఇంతకీ ఈ రికార్డ్ డీల్ ద్వారా ఇంటిని సొంతం చేసుకుంది ఎవరో తెలుసా? మల్టీనేషనల్ ఫార్మాస్యూటికల్, బయోటెక్నాలజీ కంపెనీ యూఎస్‌వీ లిమిటెడ్ ఛైర్‌పర్సన్ లీనా గాంధీ తివారీ

ముంబైలోని అత్యంత ఖరీదైన ప్రాంతం వర్లీలో సముద్రానికి అభిముఖంగా ఉండే భవనంలోని రెండు లగ్జరీ డూప్లెక్స్ అపార్ట్‌మెంట్లను లీనా గాంధీ తివారీ కొనుగోలు చేశారు. ఈ డీల్ మొత్తం విలువ రూ.639 కోట్లుగా ఉన్నట్లు సమాచారం. ఈ రికార్డ్ బ్రేకింగ్ డీల్‌లో మొత్తంగా 22,572 చదరపు అడుగుల విస్తీర్ణంలో రెండు విలాసవంతమైన అపార్ట్‌మెంట్లు కొన్నారు. వర్లీ ప్రాంతంలో ఉన్న 40 అంతస్తుల సూపర్ ప్రీమియం టవర్ నమాన్ క్సానా (%ఝీఖుఝిఅ ఝుఅఖు%)లో 32, 35 ఫ్లోర్లలో కొనుగోలు చేశారు. ఒక్క చదరపు అడుగుకు రూ. 2.83 లక్షలు వెచ్చించారట. భారత్‌లో ఇప్పటి వరకు నమోదైన రెసిడెన్షియల్ ప్రాపర్టీ సేల్స్‌లో ఇదే అత్యంత ఖరీదైన డీల్ కావడం గమనార్హం.

పన్నులే 64 కోట్లు..దేశంలోనే అత్యంత ఖరీదైన డీల్‌గా నిలిచిన నామాన్ క్సాన్ బిల్డింగ్ అపార్ట్‌మెంట్ల కొనుగోలు, రిజిస్ట్రేషన్ కోసం లీనా గాంధీ తివారీ ఏకంగా రూ.63.9 కోట్ల స్టాంప్ డ్యూటీ, వస్తు సేవల పన్ను చెల్లించారట. దీంతో ఈ ఛార్జీలు కలుపుకొని ఈ లగ్జరీ అపార్ట్‌మెంట్ల కోసం ఆమె మొత్తంగా రూ.703 కోట్లు వెచ్చించినట్లయింది. ఈ ధర ముంబైలోని ఖరీదైన ప్రాంతాలు మలబార్ హిల్స్, వర్లీలోని లగ్జరీ ప్రాజెక్టులతో పోలిస్తే రెండింతలుగా ఉంటుందని సమాచారం.మరోవైపు.. కొద్ది రోజుల క్రితం బిలియనీర్ బ్యాంకర్ ఉదయ్ కొటక్ సరికొత్త జాతీయ బెంచ్‌మార్క్‌ను నమోదు చేశారు. వర్లీలోని సముద్ర అభిముఖంలోని రెసిడెన్షియల్ భవనం మొత్తం కొనుగోలు చేశారు. రూ.400 కోట్లు ఇందుకోసం వెచ్చించారు. కొన్ని లావాదేవీల్లో చదరపు అడుగు రూ.2.75 లక్షల వరకు పడినట్లు సమాచారం. అయితే, ఇప్పటి వరకు దేశంలోనే అత్యంత ఖరీదైన డీల్‌గా ఇది నిలిచింది. ఆయన ప్రస్తుతం భవనం మొత్తం కొనుగోలు చేశారు.



# మురారి బాటలో ఖలేజా...

సూపర్ స్టార్ కృష్ణ జన్మదినోత్సవం సందర్భంగా మే 30న మహేశ్ బాబు నటించిన 'ఖలేజా' చిత్రం మరోసారి జనం ముందుకు రాబోతోంది. మహేశ్, త్రివిక్రమ్ కాంబినేషన్ లో ఆ చిత్రాన్ని శింగనమల రమేశ్, సి. కళ్యాణ్ నిర్మించారు. ఇప్పుడు దీనిని సుబ్బారావు ప్రస్తుతం రీ-రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా మూవీ ప్రీ రిలీజ్ సేల్స్ బాగా జరిగినందుకు హైదరాబాద్ ఎఫ్.ఎన్.సి.సి.లో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో ఇద్దరు నిర్మాతలతో పాటు కృష్ణ సోదరుడు ఆది శేషగిరిరావు, కమెడియన్ అలీ, సునీల్ నారంగ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదిశేషగిరి రావు మాట్లాడుతూ, 'మహేశ్ బాబు నటించిన 'పోకిరి' , 'మురారి' చిత్రాలు రీ-రిలీజ్ లో మంచి విజయాన్ని అందుకున్నాయి. అదే తరహాలో 'ఖలేజా' చిత్రానికీ విడుదలకు ముందే స్పందన లభించడం ఆనందంగా ఉంది' అని అన్నారు. ఏ దేశం వెళ్ళినా అక్కడ ఖలేజా సినిమా గురించి మాట్లాడుతుంటారని, త్రివిక్రమ్, మహేశ్ ఆ సినిమా కోసం ప్రాణం పెట్టిపనిచేశారని అలి చెప్పారు. ఈ సినిమాకు ఇప్పటికీ కల్ట్ ఫ్యాన్స్ ఉన్నారని ఆయన అన్నారు. ఈ సినిమా అడ్వాన్స్ బుకింగ్స్ ఓపెన్ చేసిన నిమిషాల్లోనే అయిపోవడం ఆశ్చర్యాన్ని కలిగించిందని ఏసియన్ సునీల్ నారంగ్ తెలిపారు. నిజానికి మహేశ్ బాబు నటించిన 'పోకిరి, 'మురారి', 'ఒక్కడు' వంటి చిత్రాలు అప్పట్లో బాక్సాఫీస్ బరిలో చక్కని విజయాన్ని అందుకున్నాయి. అందువల్ల రీ-రిలీజ్ సమయంలోన ఆ యా చిత్రాలకు చక్కని ఆదరణ లభించింది. కానీ 'ఖలేజా' మొదటిసారి విడుదలైనప్పుడు ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోలేకపోయింది. అయినా... ఈ సినిమా రీ-రిలీజ్ సమయంలో అడ్వాన్స్ బుకింగ్స్ భారీగా జరగడం విశేషం.





## అందాల రష్మిక.. చీర ఎవరిచ్చారు?


హీరోయిన్ రష్మిక మందన్న ఎప్పటికప్పుడు కొత్త కొత్త పిక్స్ షేర్ చేస్తున్న విషయం తెలిసిందే. రకరకాల ఔట్ ఫిట్స్ లో ఫోటోలు దిగి సందడి చేస్తుంటారు. అటు ట్రెడిషనల్.. ఇటు మోడ్రన్ గా అలరిస్తుంటారు. రీసెంట్ గా ఆనంద్ దేవరకొండ సినిమా లాంచ్ ఈవెంట్ కు పసుపు, ఎరుపు, ఆరెంజ్ కలర్స్ ఉన్న చీరలో అటెండ్ అయ్యారు. ఆ తర్వాత అదే చీరతో దిగిన పిక్స్ ను షేర్ చేశారు రష్మిక. రకరకాల పోజులు ఇచ్చారు. అదే సమయంలో ఆమె ఇచ్చిన క్యాప్షన్ హాట్ టాపిక్ గా మారింది. "ఈ పిక్స్ లో నాకు ఇచ్చినవి, విలువైనవి అన్నీ ఉన్నాయి. ఇష్టమైన 3 రంగుల చీర, అది ఇచ్చిన స్పెషల్ లేడీ, ఫోటో తీసిన వ్యక్తి, ఇష్టమైన ప్లేస్ అన్నీ ఉన్నాయి" అని క్యాప్షన్ ఇచ్చారు. దీంతో ఇంకేముంది.. రష్మిక పిక్స్ తో మరోసారి ఆమె లవ్ మ్యాటర్ పై చర్చ ఊపందుకుంది. ఎందుకంటే విజయ్ దేవరకొండతో ఆమె ప్రేమలో ఉన్నారని ఎప్పటి నుంచో ప్రచారం జరుగుతోంది. కానీ ఇప్పటి వరకు ఇద్దరిలో ఎవరూ దానికి అంగీకరించలేదు. ఫ్రెండ్స్ అనే చెబుతుంటారు. అయినా అంతా లవర్స్ అని ఫిక్సయ్యారు. అందుకు అనేక కారణాలు ఉన్నాయి. అదే సమయంలో రీసెంట్ గా రష్మిక.. సోఫాపై కూర్చుని పిక్స్ దిగారు. అదే ప్లేస్ లో ఇప్పటికే విజయ్, రష్మిక, దర్శకుడు పరశురామ్ దిగిన పాత పిక్ వైరల్ గా మారింది. దీంతో రష్మిక.. విజయ్ ఇంట్లోనే పిక్స్ తీసుకున్నారని క్లియర్ గా తెలుస్తోంది. అంతే కాదు ఆయనే తీసి ఉంటారని నెటిజన్లు చెబుతున్నారు. ఆ చీర కూడా విజయ్ మదర్ ఇచ్చి ఉంటారని అనుమానపడుతున్నారు. వారిద్దరూ ప్రేమలో ఉండటం నిజమేనని అంటున్నారు. ఇంకెప్పుడూ చెబుతారని క్వశ్చన్ చేస్తున్నారు. ఇప్పటికే లేటైంది.. చెప్పండి అని అడుగుతున్నారు. మొత్తానికి రష్మిక పోస్ట్ చేసిన పిక్స్ అండ్ క్యాప్షన్ మరోసారి లవ్ కహానీ కోసం మాట్లాడేలా చేశాయని చెప్పాలి. కాగా, విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న.. ఫస్ట్ టైమ్ గీతా గోవిందం మూవీలో నటించారు. అప్పట్లో ఆ సినిమా సూపర్ హిట్ గా నిలిచింది. వారిద్దరి మధ్య కెమిస్ట్రీ వర్కౌట్ అయింది. ఆ తర్వాత డియర్ కామ్రేడ్ మూవీ కోసం మరోసారి జతకట్టారు. అలా వారి కాంబినేషన్ కు స్పెషల్ ఫ్యాన్ బేస్ ఉంది. వారంతా రీల్ కపుల్.. రియల్ కపుల్ గా మారాలని కోరుకుంటున్నారు. మరేం జరుగుతుందో వేచి చూడాలి.

## సినిమాల కంటే ఓటీటీలే ఎక్కువ డిమాండ్ చేస్తాయి



ప్రముఖ మోడల్.. బాలీవుడ్ నటి.. అందాల భామ దయానా పెంటీ పేరు చెప్పగానే మతిపోగట్టే ఆమె వ్యయరాల ఆహార్యం కళ్ల ముందు మెదలకుండా ఉండదు. ఆ మధ్య బాలీవుడ్‌లో బాక్సాఫీసు వద్ద పలు రికార్డులను బద్దలుకొట్టిన ఛావా సినిమాలోనూ మొఘల్ వంశం యువరాణిగా తన అందం, అభినయంతో ఈ అమ్మడు అదరగొట్టింది. మోడలింగ్‌తో కెరీర్‌ను ప్రారంభించిన ఈ ముంబై సుందరి ఆతర్వాత బాలీవుడ్‌లో సెటిలవడం తెలిసిందే. అయితే, తాజాగా ఢిల్లీ టైమ్స్ ఫ్యాషన్ వీక్ జరగ్గా చాలా కాలం తర్వాత దయానా ర్యాంప్‌పై తన సొగసులు ప్రదర్శిస్తూ, అందాలు ఆరబోస్తూ వాక్ చేసింది. ఈ సందర్భంగా ఒక ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మోడలింగ్, సినిమాలు, ఓటీటీల గురించి దయానా పలు ఆసక్తికర విషయాలను వెల్లడించింది. మోడలింగ్‌లో ర్యాంప్ వాక్ వైబ్‌ను బాగా ఆస్వాదిస్తా. మంచి కొరియోగ్రఫీతో కూడిన సంగీతం కూడా ర్యాంప్ వాక్‌కు తోడైతే ఆ అనుభూతి నెక్స్ట్ లెవల్‌లో ఉంటుంది అని దయానా తెలిపింది. గతంలో చాలాసార్లు ర్యాంప్‌పై నడవడంతో ఆ ఫీల్ ఎలా ఉంటుందో తనకు తెలుసునని, అయితే, ర్యాంప్‌పై పొరపాటున కింద పడకూడదని ఒక భయం కూడా వెంటాడుతుంది అని దయానా చెప్పింది. ఇక, సినిమా కెమెరాలు ముందు ఆత్మవిశ్వాసంతో నటించడం అలవాటు అయినందున ఇప్పుడు ర్యాంప్‌పై నడవడం మరింత సులువైందని తెలిపింది. ఏ పని చేసినా ఆత్మవిశ్వాంతో చేయాలని దయానా చెప్పింది. ఓటీటీ ఫ్లాట్‌ఫామ్, సినిమాలకు మధ్య చాలా వ్యత్యాసం ఉంటుందని దయానా తెలిపింది. ప్రస్తుతం తాను ఒక ఓటీటీ కంటెంట్ కోసం పని చేస్తున్నానని తెలిపింది. సినిమాలతో పోలిస్తే నటుల నుంచి ఓటీటీ పాత్రలకు ఎక్కువ స్కోప్ ఉంటుంది. నటుల నుంచి ఓటీటీలు ఎక్కువ కంటెంట్ డిమాండ్ చేస్తాయి. సినిమాలతో పోలిస్తే ఓటీటీల నిడివి ఎక్కువ ఉండడంతో కథలో, పాత్రలో లీనమై మరింత నటించడానికి అవకాశం ఉంటుంది. నటులకు కూడా తమ నటనపై ఒక సంతృప్తి కలుగుతుంది. ఇందులో ఎక్కువ ప్రయోగాలు చేయడానికి అవకాశాలుంటాయని దయానా అభిప్రాయపడింది.

## విడుదల తేదీ ప్రకటించిన రవితేజ 'మాస్ జాతర'




మాస్ మహారాజా రవితేజ ఇటీవల కాలంలో సరైన విజయం కోసం ఎదురుచూస్తున్న విషయం తెలిసిందే. 'ధమాకా' తర్వాత ఆయనకు పెద్ద హిట్ దక్కలేదు. గతేడాది విడుదలైన ఈగల్, మిస్టర్ బచ్చన్ చిత్రాలు ఆశించిన విజయాన్ని సాధించలేకపోయాయి. ఈ నేపథ్యంలో, రవితేజ ఎలాగైనా హిట్ కొట్టాలనే కసితో ఉన్నారు. ఈ క్రమంలోనే ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'మాస్ జాతర'.ఈ సినిమాకు భాను భోగవరపు దర్శకత్వం వహిస్తున్నారు. రవితేజ సరసన శ్రీలీల కథానాయికగా నటిస్తోంది. వీరిద్దరూ గతంలో 'ధమాకా'తో ప్రేక్షకులను విశేషంగా అలరించారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'మనదే ఇదంతా' అనే ట్యాగ్ లైన్‌తో వస్తున్న ఈ సినిమాపై మంచి అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ సినిమా విడుదల తేదీని మేకర్స్ తాజాగా ప్రకటించారు. ఈ సినిమాను వినాయక చవితి కానుకగా.. ఆగష్టు 27న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను పంచుకుంది.ఈ సినిమాలో రవితేజ క్లాసిక్ పాటలలో ఒకటైన ఇడియట్ సినిమాలోని చూపులతో గుచ్చి గుచ్చి చంపకే పాటను ఇందులో రీమిక్స్ చేస్తున్నట్లు సమాచారం. ఇక టైటిల్‌కు తగినట్లుగానే మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా ఉండబోతుందని చిత్రబృందం వెల్లడించింది. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతాన్నందిస్తున్నారు.

## 'స్పిరిట్' వివాదం.. ఇన్‌స్టా లైక్‌పై స్పందించిన తమన్నా

ప్రస్తుతం సినీ పరిశ్రమలో దీపికా పదుకొణె, దర్శకుడు సందీప్ రెడ్డి వంగా మధ్య 'స్పిరిట్' సినిమాకు సంబంధించి జరుగుతున్న వివాదం తీవ్ర చర్చకు దారి తీసిన విషయం తెలిసిందే. ఎ ప్రస్తుతం సినీ పరిశ్రమలో దీపికా పదుకొణె, దర్శకుడు సందీప్ రెడ్డి వంగా మధ్య 'స్పిరిట్' సినిమాకు సంబంధించి జరుగుతున్న వివాదం తీవ్ర చర్చకు దారి తీసిన



విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నటి తమన్నా భాటియా ఇన్‌స్టాగ్రామ్‌లో దీపికకు మద్దతుగా ఉన్న ఒక రీల్‌ను అనుకోకుండా లైక్ చేయడంపై వివరణ ఇచ్చింది. ఇది ఇన్‌స్టాగ్రామ్ లోపం వల్ల జరిగిందే తప్ప, తాను ఉద్దేశపూర్వకంగా లైక్ చేయలేదని ఆమె స్పష్టం చేశారు.'స్పిరిట్' వివాదంప్రభాస్ హీరోగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో తెరకెక్కనున్న 'స్పిరిట్' చిత్రం నుంచి దీపికా పదుకొణె తప్పుకున్నారని గత కొన్ని రోజులుగా వార్తలు ప్రచారంలో ఉన్నాయి. దీనికి కారణం దీపిక పెట్టిన కొన్ని కఠినమైన షరతులేనని చెబుతున్నారు. రోజుకు ఆరు గంటలకు మించి షూటింగ్ చేయకపోవడం, అదనపు రోజులకు అదనపు పారితోషికం డిమాండ్ చేయడం వంటి షరతులు విధించారని సమాచారం. ఈ వివాదంపై సందీప్ రెడ్డి వంగా పరోక్షంగా దీపికను ఉద్దేశించి కొన్ని వ్యాఖ్యలు చేసినట్లు కూడా వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో, మహిళలు వృత్తి జీవితంలో ఎదుర్కొనే లింగ వివక్ష, వేతన వ్యత్యాసాలు, అధిక పనిగంటల ఒత్తిడి వంటి అంశాలపై గతంలో దీపికా పదుకొణె తన ఆర్థిక స్వాతంత్ర్యం గురించి మాట్లాడిన ఒక పాత వీడియో క్లిప్‌తో కూడిన రీల్ ఒకటి ఇన్‌స్టాగ్రామ్‌లో వైరల్ అయింది. ఈ రీల్‌కు తమన్నా భాటియా లైక్ చేయడం గమనార్హం. దీనితో తమన్నా దీపికకు మద్దతు ఇస్తున్నారని, ఈ వివాదంలో దీపిక వైపు నిలిచారని నెటిజన్లు, సినీ వర్గాలు భావించాయి.అయితే, ఈ లైక్ వెనుక ఉన్న అసలు కారణాన్ని తమన్నా భాటియా వెల్లడించారు. తాను ఉద్దేశపూర్వకంగా ఆ రీల్‌ను లైక్ చేయలేదని, అది అనుకోకుండా జరిగిందే అని స్పష్టం చేశారు. తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో ఒక స్మైలింగ్ సెల్ఫీని షేర్ చేస్తూ, "ఇన్‌స్టాగ్రామ్ దానంతటదే పేజీలను ఎలా లైక్ చేస్తుందో అర్థం చేసుకోగలదా? ఎందుకంటే కొందరు వ్యక్తులు ఈ విషయాన్ని వార్తలుగా మార్చి నాకు నిజంగా పని ఉంది" అని రాసుకొచ్చారు. ఇన్‌స్టాగ్రామ్ అల్గారిథమ్ లోపం వల్లే ఇది జరిగిందని ఆమె పరోక్షంగా చెప్పకనే చెప్పారు.ఈ ఘటనతో తాను ఈ వివాదంలో ఎవరికీ మద్దతు ఇవ్వడం లేదని, కావాలనే ఆ రీల్‌ను లైక్ చేయలేదని తమన్నా తేల్చి చెప్పారు. ఈ ఘటనపై అనవసరమైన ఊహాగానాలు చేయవద్దని ఆమె కోరారు. గతంలో ఇలాంటి సంఘటనలు విరాట్ కోహ్లీ విషయంలోనూ జరిగాయని, అల్గారిథమ్ లోపాల వల్ల అనుకోకుండా లైక్‌లు పడతాయని గుర్తు చేస్తున్నారు.

## నెక్ట్స్ లెవల్‌లో అజిత్‌కుమార్ ఏకే 64 .. క్రేజీ వార్తేంటో తెలుసా..?

కోలీవుడ్ స్టార్ యాక్టర్ అజిత్‌కుమార్ కు సంబంధించి ఎప్పుడూ ఏదో ఒక అప్‌డేట్ నెట్టింట వైరల్ అవుతూ ఉంటుందని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఈ స్టార్ యాక్టర్ నటిస్తున్న కొత్త ప్రాజెక్టు ఏకే 64 . తాజాగా ఈ మూవీపై ఓ ఆసక్తికర వార్త తెరపైకి వచ్చి అభిమానులను ఫుల్ ఖుషీ చేస్తోంది. ఈ చిత్రాన్ని టాలీవుడ్ టాప్ బ్యానర్ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తుందని తెలిసిందే.అధిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహించబోతున్న ఈ మూవీకి మ్యూజిక్ సెన్సేషన్ జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నాడు. తాజా వార్తల ప్రకారం ఏకే 64 ఈ ఏడాది అక్టోబర్‌లో సెట్స్‌పైకి వెళ్లనుంది. 2026 వేసవిలో విడుదల కానుంది. కాగా ఈ సినిమాను అధిక్ రవిచంద్రన్ మరో లెవల్‌కు తీసుకెళ్లేలా తెరకెక్కించబోతున్నాడట. ఈ చిత్రంలో పాపులర్ అందాల భామలు పూజా హెగ్డే, నయనతారను ఫీ మేల్ లీడ్ రోల్ కోసం తీసుకునే విషయాన్ని మేకర్స్ పరిశీలిస్తున్నట్టు ఇండస్ట్రీ సర్కిల్ క్రేజీ టాక్.ఇదే నిజమైతే సిల్వర్ స్క్రీన్‌పై ఈ సారి అజిత్‌కుమార్ ఎలా కనిపించబోతున్నాడని సస్పెన్స్ నెలకొంది. గుడ్ బ్యాడ్ అగ్లీ, విదాముయార్చి సినిమాల తర్వాత అజిత్‌కుమార్ నుంచి రాబోతున్న ప్రాజెక్ట్ కావడంతో ఏకే 64పై అంచనాలు భారీగానే ఉన్నాయి.



## శ్రీయ కంబ్యాక్ ఇచ్చేలా ఉందే..?



సౌత్ స్టార్ హీరోయిన్స్ లో ఒకరైన శ్రీయ శరణ్ మొన్నటిదాకా వరుస సినిమాల్లో రాణించారు. ఎలాంటి పాత్ర అయినా సరే శ్రీయ చేయగలదు అనిపించుకుంది. సినిమాలో కీలక పాత్ర అది ఎంత తక్కువ నిడివి ఉన్నా సరే చేసే హీరోయిన్ గా శ్రీయ శరణ్ క్రేజ్ తెచ్చుకుంది. ఐతే పెళ్లి తర్వాత కాస్త దూకుడు తగ్గినా తన కోసం వచ్చిన ఏ అవకాశాన్ని వదిలి పెట్టదు శ్రీయ శరణ్. అమ్మడు ఈమధ్య తెర మీద కనిపించడం మానేసింది. సౌత్ లో ఛాన్స్ లు తగ్గగా హిందీలో ఛాన్స్ లు అందుకుంటుంది – రెండు క్లైమాక్సులు కన్ఫ్యూజ్ చేయవా? 2022 లో లో అజయ్ దేవగన్ పక్కన చేసిన శ్రీయ అదే ఇయర్ లో బాలీవుడ్ లో తడ్క, దృశ్యం 2 సినిమాల్లో నటించింది. ఆ తర్వాత కన్నడలో ఉపేంద్ర తో చేసిన కబ్జా సినిమాలో నటించింది అమ్మడు. అదే ఏడాది మ్యూజిక్ స్కూల్ అంటూ మరో హిందీ సినిమా చేసింది. ఐతే ఇవేవి అమ్మడికి మళ్లీ అవకాశాలు తెచ్చి పెట్టలేదు. ఐతే రీసెంట్ గా సూర్య రెట్రో సినిమాలో స్పెషల్ అప్పియరెన్స్ ఇచ్చింది శ్రీయ శరణ్. అది కూడా అంత క్లిక్ అవ్వలేదు. ఐతే శ్రీయ శరణ్ తాజాగా తేజ సజ్జా చేస్తున్న మిరాయ్ సినిమాలో సర్ ప్రైజ్ చేయనుందని తెలుస్తుంది. తేజా సజ్జా మిరాయ్ లేటెస్ట్ టీజర్ చూసి ఆడియన్స్ అవాక్కవుతున్నారు. హాలీవుడ్ సినిమా రేంజ్ విజువల్స్ తో అదరగొట్టారని చెప్పొచ్చు. కార్తీక్ ఘట్టమనేని డైరెక్షన్ లో తెరకెక్కుతున్న మిరాయ్ సినిమాను పీపుల్ మీడియా ఫ్యాక్టరీ ప్రెస్టీజియస్ గా నిర్మిస్తుంది. ఐతే ఈ సినిమా టీజర్ లో శ్రీయ శరణ్ కనిపించింది. టీజర్ లో ఆమెను ఉంచారంటే కచ్చితంగా ఆమెది ఇంపార్టెంట్ రోల్ అనే తెలుస్తుంది. తేజా సజ్జా లీడ్ రోల్ లో నటిస్తున్న ఈ సినిమాలో మంచు మనోజ్ ప్రతినాయకుడి పాత్రలో నటిస్తున్నారు. టీజర్ లో విజువల్స్ అదుర్స్ అనిపించగా సినిమా సంథింగ్ స్పెషల్ అనిపించేలా ఉందనిపిస్తుంది. హనుమాన్ సినిమా తర్వాత తేజా సజ్జా పాన్ ఇండియా లెవెల్ లో చేయబోతున్న సినిమా మిరాయ్. ఈగల్ తో అంచనాలను అందుకోలేకపోయిన కార్తీక్ ఘట్టమనేని ఈసారి మిరాయ్ తో సత్తా చాటనున్నాడు. మిరాయ్ సినిమాను సెప్టెంబర్ 5న రిలీజ్ లాక్ చేశారు. తేజా సజ్జా, మంచు మనోజ్ స్క్రీన్ ప్రెజెన్స్ ఆడియన్స్ కి

## క్రికెట్ పిచ్‌పైనే ఫైటింగ్.. బంగ్లా బ్యాటర్‌పై సౌతాఫ్రికా బౌలర్ అటాక్..



**న్యూదిల్లీ-నవభూమి:** బంగ్లాదేశ్, దక్షిణాఫ్రికా ఎమర్జింగ్ జట్ల మధ్య జరుగుతున్న క్రికెట్ మ్యాచ్‌లో ప్లేయర్లు ఘర్షణ(%జతీఅఎిఎవ్ ఖీఅస్త్రష్ట్ర%) పడ్డారు. ఢాకాలో రెండు జట్ల మధ్య నాలుగు రోజుల మ్యాచ్ జరుగుతున్న సమయంలో.. మైదానంలోనే ఇద్దరు ప్లేయర్లు గొడవకు దిగారు. బంగ్లా బ్యాటర్ రిపన్ మోండల్‌పై .. సౌతాఫ్రికా పేస్ బౌలర్ షిపో నులి చేయిచేసుకున్నాడు. పిచ్‌పై వాగ్వాదానికి దిగారు. బంగ్లా బ్యాటర్‌కు సఫారీ బౌలర్ పంచ్ ఇచ్చాడు. ఫీల్డ్ అంపైర్‌తో పాటు మిగితా ఆటగాళ్లు అడ్డుకునే ప్రయత్నం చేశారు. బంగ్లా బ్యాటర్‌పై మరో దక్షిణాఫ్రికా ఫీల్డర్ దూసుకెళ్లే ప్రయత్నం చేశాడు. ప్రస్తుతం ఆటగాళ్లపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. మ్యాచ్ అధికారులు త్వరలో రిపోర్టును సమర్పించనున్నారు. ఓ క్రికెట్ వెబ్‌సైట్ ప్రకారం.. నులి బౌలింగ్‌లో స్ట్రెయిట్ సిక్సర్ కొట్టాడు రిపన్. దీంతో ఆ ఇద్దరు ఒకరిపై ఒకరు చూపులు విసురుకున్నారు. ఆ తర్వాత బ్యాటింగ్ పార్ట్నర్, నాన్ స్ట్రయికర్ వద్దకు బ్యాటర్ వెళ్లాడు. ఆ సమయంలో బంగ్లా బ్యాటర్ మీదకు సౌతాఫ్రికా బౌలర్ దూసుకువచ్చాడు. ఏదో మాటలు అనుకుని, ఒకర్ని ఒకరు తోసేసుకున్నారు. ఆ తర్వాత ఆ గొడవ పెద్దగా మారింది. బ్యాటర్ రిపన్ హెల్మెట్‌ను బౌలర్ నులి లాగేశాడు. ఆ ఘటనకు చెందిన వీడియో ఒకటి వైరల్ అవుతున్నది.

## ఐపీఎల్ చరిత్రలో నెం.1 కెప్టెన్ ఎవరో చెప్పిన ఆస్ట్రేలియా క్రికెట్



**న్యూదిల్లీ-నవభూమి:** మహేంద్ర సింగ్ ధోనీ.. రోహిత్ శర్మ.. ఇద్దరూ ఇద్దరే. అద్భుత ఆటతీరుతో ఈ దిగ్గజ ప్లేయర్స్ టీమిండియాకు అనేక విజయాలను అందించారు. ఐపీఎల్‌లో కూడా తమ తమ జట్లను పలుమార్లు విజయతీరాలకు చేర్చారు. దీంతో, సహజంగానే ఇద్దరి పర్‌ఫార్మెన్స్‌ను అభిమానులు పోల్చి చూస్తుంటారు. మరి ఈ ఇద్దరిలో ఐపీఎల్ బెస్ట్ కెప్టెన్ ఎవరనేదానిపై మాజీ ఆస్ట్రేలియా క్రికెటర్ టామ్ మూడీ కూడా తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. దీంతో, ఈ అంశం ప్రస్తుతం క్రికెట్ అభిమానుల్లో పెద్ద చర్చకు దారి తీస్తోంది.ఐపీఎల్ చరిత్రలో అత్యద్భుత కెప్టెన్ ఎమ్ఎస్ ధోనీ అని టామ్ మూడీ స్పష్టం చేశాడు. అతడికి తిరుగేలేదని పేర్కొన్నాడు. ధోనీ సారథ్యంలో సీఎస్‌కే ఐదు సార్లు ఐపీఎల్ ఛాంపియన్‌గా నిలిచిన విషయం తెలిసిందే. రోహిత్ కూడా ఐదు సార్లు ఐపీఎల్ విజేతగా నిలిచాడు. అయితే, రోహిత్ కంటే ధోనీకే తాను ఎక్కువ మార్కులు వేస్తానని టామ్ మూడీ అన్నాడు.

## ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్.. టీమిండియా సభ్యుల ఎంపికపై సంజయ్ మంజ్రేకర్ విమర్శలు



**న్యూదిల్లీ-నవభూమి:** ఇంగ్లండ్‌తో త్వరలో జరగనున్న ఐదు మ్యాచుల టెస్టు సిరీస్ కోసం టీమిండియా జట్టుకు పులువురు కొత్త సభ్యులు ఎంపికయ్యారు. దేశవాళీ క్రికెట్‌లో సత్తా చాటిన అనేక మందికి చోటు దక్కింది. కునాల్ నాయర్, శార్దూల్ ఠాకూర్ వంటి వారు ఇంగ్లండ్ టూర్‌కు ఎంపికయ్యారు. అయితే, ఈ సిరీస్‌కు సర్ఫరాజ్ ఖాన్‌ను ఎంపిక చేయకపోవడంపై విమర్శలు ఎక్కువవుతున్నాయి. మాజీ క్రికెటర్ సంజయ్ మంజ్రేకర్ ఎక్స్ వేదికగా తన అసంతృప్తిని వెళ్ళగక్కారు.గౌతమ్ గంభీర్ జట్టు మార్గదర్శకత్వంలో టీమ్ మేనేజ్‌మెంట్.. జట్టు సభ్యుల ఎంపిక విషయంలో వారి ప్రస్తుత ఫార్మ్‌ను పరిగణనలోకి తీసుకుంటున్నట్టు లేదని సంజయ్ మంజ్రేకర్ అభిప్రాయపడ్డారు. పిచ్ పరిస్థితులు, ప్రత్యర్థి బలాబలాల ఆధారంగా ఎవరు ఎలా ఆడొచ్చనే అంచనాతో మాత్రమే నిర్ణయాలు తీసుకుంటున్నట్టు ఉందని విమర్శించారు. నాలుగు టెస్టుల్లో మూడు అర్ధ సెంచరీలు 150 పరుగులు చేసిన సర్ఫరాజ్ ఆ తరువాత నాలుగు ఇన్నింగ్స్‌లో ఆడనందుకే =ఆస్ట్రేలియా టూర్‌లో ఒక్క అవకాశం కూడా దొరక్కపోవడం విచారకరమని అన్నాడు. ఇటీవల కాలంలో కరన్ నాయర్‌కు మించి అద్భుత ప్రదర్శన చేసినా కూడా ఇంగ్లండ్ జట్టుకు ఎంపిక కాలేదని కామెంట్ చేశాడు.


Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**